

నిష్పక్షపాతం.. సత్యనిష్ఠ..
అంకితభావం..
ప్రజల మేలు కోసం చూపే తెగువ
పత్రికలకు అవశ్యం.

# ఆంధ్రపత్రిక

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914

విశాఖపట్నం సంపుటి : 60 సంచిక : 51 • పేజీలు : 8 • గురువారం 21 నవంబరు 2024 • వెల : రూ. 5.00

Published from : Vijayawada | Visakhapatnam | Srikakulam | Rajahmundry | Kurnool | Guntur | Ongole | Nellore Tirupati


- ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు
- ఏపీలో రూ.85 వేల కోట్ల పెట్టుబడులకు సంబంధించి..
- ఎస్ఐపీబీ నిర్ణయాలకు కేబినెట్ ఆమోదం
- పీడీయాక్ట్ పటిష్టం చేస్తూ సవరణ బిల్లుకు ఆమోదం
- లోకాయుక్త చట్ట సవరణ బిల్లుకు మంత్రివర్గం ఆమోదం
- కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు నిర్ణయం
- ఈగల్ పేరుతో యాంటీ నార్కోటిక్స్ విభాగం ఏర్పాటు
- అమరావతి సాంకేతిక కమిటీ ప్రతిపాదనలకు ఆమోదం
- స్పోర్ట్స్, పర్యాటక పాలసీలకు ఏపీ కేబినెట్ ఆమోదం
- ఏపీ టవర్ కార్పొరేషన్ ఫైబర్‌గ్రిడ్‌లో విలీనం
- కాంట్రాక్టర్లకు మొబిలైజేషన్ అడ్వాన్స్‌ల పునరుద్ధరణ
- దేవాలయ కమిటీల్లో ఇద్దరు సభ్యులకు చోటు కల్పించేలా..
- చట్టసవరణ బిల్లుకు కేబినెట్ ఆమోదం



## టూరిజం పాలసీకి కేబినెట్ ఆమోదం

### ఎస్ఐపిబి తొలి సమావేశంలో సిఎం చంద్రబాబు నాయుడు నిర్ణయం

**అమరావతి,నవంబరు 20 (ఆంధ్రపత్రిక):** సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన ఏపీ మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఏపీ టూరిజం పాలసీకి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. పర్యాటక ప్రాజెక్టులకు పరిశ్రమ హోదా కల్పించే ప్రతిపాదనపై చర్చించి ఆమోదించింది. జ్యుడిషియల్ ప్రివ్యూ రద్దు బిల్లుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఏపీ ఇన్ఫ్రా ట్రాన్స్పరెన్సీ యాక్ట్ 2019 రిపీల్ చేయాలని ప్రతిపాదించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో స్థానిక సంస్థల్లో చైర్మన్లపై అవిశ్వాసం పెట్టే అంశంపై చట్ట మిగతా 7లో

## రష్యా గురిలో అమెరికా ఎంబసీ..?

- ఆగమేఘాల మీద ఖాళీ చేసిన అగ్రరాజ్యం
- అక్కడ ఉద్యోగులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లండి
- నవంబర్ 20న దాడి జరగబోతోందని సమాచారం
- ముదురుతున్న రష్యా, ఉక్రెయిన్ల మధ్య యుద్ధం
- అణ్వాయుధాల వినియోగానికి అనుమతించే నిబంధనలను మరింత సరళం
- ఉక్రెయిన్‌లో అమెరికా రాయబార కార్యాలయం తాత్కాలికంగా మూసివేత




**అమెరికా,నవంబర్ 20 :** ఉక్రెయిన్లోని తమ రాయబార కార్యాలయాన్ని తాత్కాలికంగా మూసివేస్తున్నటు అమెరికా పేర్కొంది. కీవ్‌లోని తమ దౌత్య కార్యాలయంపై రష్యా బుధవారం భారీ వైమానిక దాడులకు పాల్పడే అవకాశం ఉందని తమకు సమాచారం వచ్చిందని మిగతా 7లో

## క్షీణిస్తున్న గాలిలో నాణ్యత

- ప్రజలకు కళ్లమంటలు, తలనొప్పి వంటి అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు



**న్యూఢిల్లీ,నవంబరు 20 :** దేశరాజధాని ఢిల్లీ సహా ఉత్తర భారతదేశంలోని పలు ప్రధాన నగరాల్లో గాలి కాలుష్యం తీవ్రంగా ఉన్న విషయం తెలిసిందే. ఢిల్లీ, యూపీ, నోయిడా, లక్నో సహా పలు ప్రధాన నగరాల్లో మిగతా 7లో

## 'మహా'లో ప్రశాంతంగా ఎన్నికలు

**ముంబై, నవంబరు 20 :** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ బుధవారం కొనసాగుతోంది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకూ కొనసాగనుంది. అయి తే, ప్రస్తుతం మహా ఎన్నికలకు పోలింగ్ మందకొడిగా సాగుతోంది. ఓటింగ్ ప్రారంభమై నాలుగు గంటలైనా 20 శాతం కూడా పోలింగ్ నమోదు కాలేదు. ఉదయం 11 గంటల వరకూ 18.14 శాతం మాత్రమే మిగతా 7లో



## చిదంబరానికి హైకోర్టులో ఊరట



**న్యూఢిల్లీ, నవంబర్ 20 :** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ దాఖలు చేసిన ఎయిర్ సెల్ మ్యాక్సిస్ కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత పీ.చిదంబరానికి ఢిల్లీలో హైకోర్టు ఊరటనిచ్చింది. ట్రయల్ కోర్టు విచారణపై ఢిల్లీ హైకోర్టు బుధవారం స్టే విధించింది. కాంగ్రెస్ నేత పిటిషన్‌పై ఈడీకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మనీలాండరింగ్ కేసులో చిదంబరం, ఆయన తనయుడు కార్తీ చిదంబరంపై ట్రయల్ మిగతా 7లో

## డిప్యూటీ సీఎం పవన్ ఆసక్తికర వ్యాఖ్యలు

- చంద్రబాబుకు మాట ఇస్తున్నా..
- మేం చేయాల్సిన పనులపై ఆదేశాలు ఇవ్వాలి
- సీఎం చంద్రబాబు విజన్‌కు తగ్గట్టు పనిచేస్తాం
- సీఎం కలలను నెరవేర్చడానికి సిద్ధంగా ఉన్నాం
- ఐదేళ్లే కాదు మరో పదేళ్లు చంద్రబాబు సీఎంగా ఉండాలి
- సీఎం చంద్రబాబు స్ఫూర్తిని కొనసాగించాలి



**అమరావతి,నవంబరు 20 (ఆంధ్రపత్రిక):** ఉప ముఖ్యమంత్రి పవన్ ఆసక్తి కర వ్యాఖ్యలు చేసారు. అసెంబ్లీ వేదికగా 150 రోజుల కూటమి పాలన పైన స్పందించారు. సీఎం చంద్రబాబు మిగతా 7లో



## అప్పులపై తప్పుడు లెక్కలు

- తప్పుడు ప్రచారం చేయడం ధర్మమేనా
- ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా?
- మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

7లో

## బంగాళాఖాతంలో మరో అల్పపీడనం



**అమరావతి,నవంబరు 20 (ఆంధ్రపత్రిక):** ఏపీలో భారీ వర్షాలు కొద్దిరోజుల కిందటే బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఏపీ సహా తమిళనాడు, కర్ణాటకల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. పలు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యాయి. యానాం, మిగతా 7లో

- రేపు దక్షిణ అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం
- పశ్చిమ వాయవ్య దిశలో వాయుగుండంగా బలపడే చాన్స్
- శ్రీలంక, తమిళనాడు, కేరళవైపు పయనం
- దక్షిణ కోస్తా, రాయలసీమకు వర్ష సూచన
- 26 నుంచి 3 రోజులు ఏపీలో వర్షాలు
- తుఫాన్ హెచ్చరికల కేంద్రం డైరెక్టర్

## ప్రజల తరపున పోరాడాలి

- రాజీనామా చేసి నగం స్థానాలు గెలవండి..చూద్దాం..!
- మాజీ సీఎం జగన్‌కు బీసీవై అధినేత రామచంద్ర యాదవ్ లేఖ
- వైసీపీ సభ్యులు ఎమ్మెల్యేలుగా అనర్హులు..
- కనీసం 5 స్థానాలు గెలిచినా ప్రజలు ఆమోదించినట్లేనని సవాల్



**అమరావతి,నవంబర్ 20 (ఆంధ్రపత్రిక):** శాసన సభ సమావేశాలకు హాజరై ప్రజల తరపున పోరాడి, ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన మిగతా 7లో

## కర్నూలులో ఎపి హైకోర్టు బెంచ్ ఏర్పాటు..?



- ప్రజాగళంలో ఇచ్చిన హామీ మేరకు ఏర్పాటుకు చర్యలు
- కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం
- బెంచ్ ఏర్పాటుకు నాలుగు జిల్లాల నుంచి 1/3 కేసులు ఉండాలి
- దేశంలో ఇప్పటికే 7 రాష్ట్రాల్లో హైకోర్ట్ బెంచ్‌లు ఏర్పాటు చేశారు..

**అమరావతి,నవంబర్ 20 (ఆంధ్రపత్రిక):** కర్నూలులో హైకోర్ట్ బెంచ్ ఏర్పాటు కోసం ప్రక్రియ ప్రారంభమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాగళంలో ఇచ్చిన హామీ మేరకు హైకోర్ట్ బెంచ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు సర్కార్ పేర్కొంది. ఈ మేరకు మిగతా 7లో



## అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో గందరగోళం

- ఎనిమిదవ రోజుకు చేరిన ఎపి అసెంబ్లీ సమావేశాలు
- ప్రశ్నోత్తరాల సమయంలో అయోమయం..
- ఈ అయోమయానికి కారణం అధికారుల నిర్లక్షమే
- అధికారుల తీరుపై స్పీకర్ అయ్యన్న ఆగ్రహం

**అమరావతి,నవంబరు 20 (ఆంధ్రపత్రిక):** ఏపీ అసెంబ్లీ సమావేశాలు ఎనిమిదవ రోజుకు చేరుకున్నాయి. సభ మొదలవగానే స్పీకర్ అయ్యన్న పాత్రుడు ప్రశ్నోత్తరాలు మిగతా 7లో

## కడప స్టీల్ ప్లాంట్ కోసం ఏం చేశావు..!



- పదేళ్లు ఎంపిగా అవినాశ్ చేసిందేమిటి..
- సోషల్ మీడియా సైకోల భరతం పట్టాల్సిందే
- టెంకాయలు కొట్టి నిరసన తెలిపిన షర్మిల..
- ఆ కేసులో అసలు దోషులెవరో కనిపెట్టి శిక్షించాలి
- ఎపి కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల డిమాండ్..

**కడప,నవంబరు 20 (ఆంధ్రపత్రిక):** కడప స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనలకే పరిమితమైందని, పదేళ్లు స్థానిక ఎంపీగా ఉన్న అవినాష్‌రెడ్డి కడప స్టీల్ ప్లాంట్ కోసం ఏం చేశారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల ప్రశ్నించారు.పదేళ్లు స్థానిక ఎంపీగా ఉన్న అవినాష్‌రెడ్డి మిగతా 7లో

ఒరులేయని యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్

ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

# వలసల పాఠాలు

యూరప్ ను వలసలు చుట్టుముట్టేస్తున్నాయి. ఈ ఖండంలోని చాలా దేశాలు విలవిలలాడిపోతున్నాయి. ప్రభుత్వాలు కూలిపోతున్నాయి. అల్లర్లు, నేరాలు, ఘోరాలు, అశాంతి ఆ దేశాలను అల్లకల్లోలం చేస్తున్నాయి. వీటికి పరిష్కారం లభించకపోగా, మరింత రగిలే ప్రమాదఘంటికలే వినిపిస్తున్నాయి. వలసలు ఏ ఖండానికి, ఏ దేశానికి కొత్తకాదు. ఇతర దేశాల నుంచి అక్రమంగా వలస వచ్చినవారితోనూ, సక్రమంగా వలస వచ్చినవారితోనూ సమస్యలు పెరుగుతూనే వున్నాయి. భారతదేశం కూడా అందుకు మినహాయింపు కాదు. ప్రస్తుత అంశం యూరప్ విషయానికి వస్తే, వలసలు ప్రబలి, రోజుకొకరకమైనదుర్వార్త అక్కడి నుంచి వినాల్సివస్తోంది. ఇప్పటికే ఫ్రాన్స్ లోఅల్లర్లు ఆకాశాన్ని అంటుతున్నాయి. నెదర్లాండ్ లో ప్రభుత్వమే కూలిపోయింది. స్వీడన్ లో ఘర్షణలు లేని రోజంటూ లేదు. స్విట్జర్లాండ్ లో అశాంతి రాజ్యమేలుతోంది. బెల్జియం, జర్మనీలో అల్లర్లు, నేరాలుఘోరాలకుఅదుపే లేదు. మానవతా దృక్పథంతోశరణు ఇచ్చినందుకుయూరప్ మొత్తంమూల్యం చెల్లించాల్సి వస్తోంది. శరణుకోరి ఆ యా దేశాలలో ప్రవేశించినవారి సంఖ్య కోట్లకు చేరుకుంది. వీరంతామిగిలిన సామాజిక సమస్యలను సృష్టించడమే గాక, రాజకీయాలనుప్రభావితం చేస్తున్నారు. ప్రభుత్వాల మనుగడే ప్రశ్నార్ధకమవుతోంది. యుద్ధాలు, అంతర్యుద్ధాల కారణంతో యుగొస్లావియా, ఉక్రెయిన్, సిరియా, ఆఫ్ఘనిస్థాన్మొదలైన దేశాలలో బాధపడేవారుయూరప్ దేశాల వైపు వస్తున్నారు. అతి ప్రమాదకరమైన విధానాల్లోసముద్ర ప్రయాణాలు చేస్తూ, కొందరు ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. ముఖ్యంగా 2015లో వలసలు పెద్దఎత్తున పోటెత్తాయి. ఆ సంవత్సరాన్ని'వలసల సంవత్సరం'గా అభివర్ణించారు. 2007-2011మధ్య కూడా వలసలు పెద్ద సంఖ్యలోనేజరిగాయి. ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదం పెరగడం కూడా వలసలపైనకీలక ప్రభావం చూపించింది, ఇంకా చూపిస్తూనే వుంది. 2022నాటికి వలసవచ్చిన జనాభా చూస్తే, జర్మనీలో 10.9మిలియన్లు, స్పెయిన్ లో 5.4మిలియన్లు, ఫ్రాన్స్ లో 5.3మిలియన్లు, ఇటలీలో5మిలియన్లు ఉన్నట్లు సమాచారం. ఒక్క 2022లోనే యూరోపియన్ యూనియన్ లో ఆశ్రమం కోరిన వారి సంఖ్య 6,32,430. అందులో ఆమోదం పొందిన వారి సంఖ్య3.10 లక్షలు. ఇన్నేళ్ల పాటు వచ్చినవారు, వస్తున్నవారిలో అధికారికంగా కంటే అనధికారికంగావచ్చిన వారి సంఖ్య అంచనాలకుమించి వుంటుంది. లక్షల్లో వలసవస్తున్న వీరిని కొన్ని దేశాలు అడ్డుకుంటున్నాయి. జర్మనీ వంటి కొన్ని దేశాలు మాత్రం ఆదుకుంటున్నాయి. పశ్చిమాసియా, దక్షిణాసియా, ఆఫ్రికా నుంచిపెద్ద సంఖ్యలో వలసలు జరిగాయి. అరబ్ విప్లవం తర్వాత టునీసియా, లిబియా, ఈజిప్ట్, యెమెన్, అల్జీరియా వంటి దేశాల నుంచివలసలు వెల్లువెత్తాయి. చట్టవిరుద్ధంగా ప్రవేశించినవారిలో ఎక్కువమంది గ్రీస్ ద్వారా వెళ్లినట్లు తెలుస్తోంది. వలసల ప్రభావం ఆర్థిక, సామాజిక, రాజకీయ వ్యవస్థలపైపడుతోంది. నివాసం, ఉపాధి కల్పించడం ప్రభుత్వాలకు పెనుసమస్యగా మారింది. వివిధ సమాజాల మధ్య సాంస్కృతిక ప్రయాణం పెద్దసవాల్ విసురుతోంది. ప్రస్తుతం యూరప్ లో ప్రముఖంగా కనిపిస్తున్న ఈ జాఢ్యం మిగిలిన ఖండాలలోనూ రేపోమాపో శృతిమించకపోదు. భిన్న సంస్కృతులకు, మతాలకు నిలయమై, అనేక దాడులకు ఆలవాలమై, ప్రపంచంలోనేఅతిపెద్ద దేశంగా అవతరిస్తున్న భారతదేశం వలసల విషయంలో, ముఖ్యంగా మిగిలిన దేశాల నుంచి అక్రమంగా చొరబడిన వారి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. యూరప్ వలసల అంశంపై ప్రపంచ దేశాధినేతలు దృష్టి పెట్టాలి. ఆ యా దేశాల అంతర్గత సమస్యలను అరికట్టడంలోనూ, మతోన్మాద ఉగ్రవాదం ప్రబలకుండాచూడడంలోనూ అందరూ కలిసి సాగాలి. యూరప్ అనుభవాలుమిగిలిన ఖండాలకు పెద్దగుణపాఠం!

# వైద్యసేవల్లో సామాన్యులకు వరం:మంగళగిరి ఎయిమ్స్



కిడ్నీ మార్పిడి చికిత్స చేస్తున్న వైద్య నిపుణుల బృందం



ప్రకృతి అందాలనడుమ మంగళగిరి ఎయిమ్స్

ప్రపంచం స్థాయి కేంద్రప్రభుత్వ వైద్య సంస్థ ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఎయిమ్స్, మంగళగిరి ఆంధ్రప్రదేశ్ తో పాటు దక్షణ భారత దేశంలోని పేషంట్లకు ముఖ్యంగా సామాన్య రోగులకు ఒక అపురూప వరం అని చెప్పక తప్పదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము విభజన హామీ మేరకు కేంద్రం అంగీకరించిన ఈ సంస్థ నిర్మాణానికి ప్రజా సంక్షేమం, ప్రజా ప్రాధాన్యతలు బాగా ఎరిగిన పాలనాదక్షులైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏమాత్రం మీనమేషాలు లెక్కించకుండా వెంటనే మంగళగిరి వద్ద 183 ఎకరాల భూమిని కేటాయించటం, దానికి ప్రహరీగోడ, అంతర్గత రోడ్లు, విద్యుత్ లైన్లు రాష్ట్రవాటాగా చెయ్యాల్సిన ఈ పనులు పూర్తి చేసి ఎయిమ్స్కి అప్పగించిన తీరు పరిశీలిస్తే అది సామాన్య రోగుల నుండి అసమాన్యులవరకు ప్రపంచం స్థాయి వైద్యం అందాలనే తపన ఆయనకే చెల్లిందని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తారు. అయితే నీటి సరఫరా కూడా ఇవ్వాల్సి ఉండగా ఆత్మకూరు ఛానెల్ నుండి ఎయిమ్స్ వరకు 5కి. మీ పైప్ లైన్ కోసం 7 కోట్లు కేటాయించి పనులు ప్రారంభించటం జరిగింది. అయితే కలకత్తా చెన్నై జాతీయ రహదారి ద్వారా పైప్ లైన్ వేసేందుకు జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ నుండి, అలాగే కొంత కొండ తవ్వి పైప్ లైన్ వెయ్యాల్సినందున పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖల నుండి అనుమతులు రావటం ఆలస్యం జరగటం, ఈ లోపు 2019 సం. లో ప్రభుత్వం మారిపోవటం తో పైపలైన్ వెయ్యలేకపోవటం జరిగింది. చుట్టూ కొండలు, దట్టమైన చెట్ల నడుమ ఆహ్లాదకరంగా వుండే ఆ ప్రదేశంలో 950 పడకల సామర్థ్యం తో ఆసుపత్రి భవనాలని అత్యంత ఆధునికంగా నిర్మాణముని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పూర్తి చేసి వైద్యసేవలు ప్రారంభించటం తోపాటు, అలాగే ఆప్రాంగణంలోనే అనుబంధంగా 125 సీట్లతో మెడికల్ కళాశాల, క్వార్టర్లు, హాస్టల్ భవనాలు పూర్తి అయ్యాయి. తరువాత వచ్చిన వైఎస్సార్ సిపి ప్రభుత్వం పైప్ లైన్ నిర్మాణము పూర్తి చేసి నీరందించాల్సింది పోయి పైప్ లైన్ కోసం ముందు ప్రభుత్వం కేటాయించిన ఆ 7 కోట్ల రూపాయలు దారిమళ్ళించింది. ఫలితంగా సామర్థ్యం ఉండి కూడా కేవలం నీటిసరఫరా లేనందున ఇన్ పేషంటలను 350 లోపే చేర్చుకోవటంతో సరిపెట్టాల్సి రావటం దురదృష్టకరం అని చెప్పక తప్పదు. ఈ చర్య తో ప్రభుత్వం పేదలకు మేలైన చౌక వైద్య సేవలు పొందే వీలు లేకుండా ద్రోహం చేసిందని పలువురు అప్పట్లోనే ఆగ్రహం వ్యక్తం చేశారు. 2019 సం. ముందే చంద్రబాబు నాయుడు స్థలం, రాష్ట్రము వంతు గా సమాకూర్చాల్సిన చుట్టూ ప్రహరీగోడ, విద్యుత్ లైన్లు, అంతర్గత రోడ్లు వెయ్యకుంటే, తరువాత వచ్చిన ప్రభుత్వం కేవలం వున్న 7కోట్ల నిధులే దారిమళ్లిస్తే ఇంకా స్థలంకేటాయించటంతో పాటు ఇన్ని పనులు చేయటం సాధ్యమా? పైగా ఇప్పటికి కూడా ఎయిమ్స్ రావటం కూడా బాధ్యత తెలియని పాలకుల వలన ఆంధ్రులకు కలగానే మిగిలేదని చెప్పాలి. షుమారు 1800 కోట్ల వ్యయం చేసి ఆధునిక వైద్య విజ్ఞాన సంస్థ నిర్మించినప్పటికీ పాలనా విలువ తెలీనివారి చర్యతో పైప్ లైన్ వెయ్యకపోవటం తో ఎయిమ్స్ పాలకమండలి చొరవ తీసుకుని తాడేపల్లి, మంగళగిరి, విజయవాడ పురపాలక సంఘాలనుండి ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించి వైద్యసేవలు సాధ్యమైనంత రీతిలో అందించారు. ఈ నీటికోసం ఎయిమ్స్ షుమారు 3 కోట్ల వరకు మూడు పురపాలక సంఘాలకు బాకి పడింది. చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో భగీరదుడు వచ్చినట్లుంది. ఈ నీటి సమస్య తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల ఎయిమ్స్ సీ ఈ వో తో చర్చించి అవసరమైన విషయాలు తెలుసుకుని పైప్ లైన్ వేసే పనులు ప్రారంభించటం తో పాటు మంగళగిరి ఎయిమ్స్ ని జాతీయ స్థాయిలో మూడవ స్థానం లోకి తేవటానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాగా ఎయిమ్స్ ఇప్పుడు సంపూర్ణంగా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించే పరిపూర్ణ వైద్యశాలగా అభివృద్ధి చెందింది. ఆఖరికి ఈ మధ్యన చేపట్టిన ముగ్గురికి కిడ్నీల మార్పిడిని కూడా నూరు శాతం విజయవంతంగా అదికూడా పేషంట్లకు ఖర్చులేకుండా ఆరోగ్యశ్రీ కార్డు మీదే చేసినట్లు, కిడ్నీ దాతలు, మార్పిడి జరిగిన పేషంట్లు సంపూర్ణ ఆరోగ్యంతో వున్నారు, పైగా వీరికి సంవత్సరం పాటు మందులు ఇవ్వటం జరుగుతుంది అని అస్పత్రి అధికారప్రతినిధి డా కే. వంశీ కృష్ణా రెడ్డి తెలిపారు. ఈ కిడ్నీ మార్పిడి శాస్త్ర చికిత్సలతో పాటు మరిన్ని క్లిష్టమైన సర్జికల్ అంకాలజి, పిడియాట్రిక్ సర్జరీ, న్యూరాలజి, న్యూరో సర్జరీ, ఆర్థోపేడిక్స్, బర్న్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ, తదితర క్లిష్టమైన శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తీ చేసిన ఎయిమ్స్ త్వరలో బైపాస్ హార్ట్ సర్జరీలు కూడా ప్రారంభించనుంది, ఇప్పటికే ఇద్దరు కార్డియాలజీ శస్త్రచికిత్స నిపుణులు ఢిల్లి నుండి మంగళగిరి ఎయిమ్స్ లో పదవి బాధ్యతలు చేట్టారు. అలాగే ఆరోగ్యశ్రీ కార్డు వున్న వారికి ఉచితంగా ఆంజియోగ్రామ్, కార్డులేనివారికి కేవలం 4 వేలతో ఆంజియోగ్రామ్ చెయ్యటం జరుగుతోంది. ఎయిమ్స్ చుట్టూ కొండలు కొండలపై పచ్చని దట్టమైన చెట్లుతో వాతావరణం ఆహ్లాదకరగా వుండి పేషంట్లకు మరింత త్వరగా స్వస్థత చేకూర్చే ఈ ఎయిమ్స్ ఇప్పుడు అన్ని విభాగాల్లో సంపూర్ణ వైద్యసేవలు అందించే వైద్య విజ్ఞాన సంస్థగా పరిపూర్ణత పొందింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ద్రుష్టి పెట్టారు కనుక జాతీయ స్థాయిలో మూడవ స్థానమే కాదు మరింత అగ్రస్థానంలోకి వచ్చినా రావచ్చు. కారణం కావలసినంత ప్రాంగణం, ఆధునిక విశాల భవనాలు, అర్హత కలిగిన వైద్య నిపుణుల బృందం, సమర్థులైన చైర్మన్, డైరెక్టర్, ఇతర అదికారులు, అత్యంత ఆధునిక పరికరాలు, యంత్రాలు ఉండగా, దీనికి అవసరమైన ఏమి చెయ్యాలో అది సమకూర్చే రాష్ట్రప్రభుత్వం ఉండటమే! ఇక ఆరోగ్యం కార్పొరేట్ వైద్యం కంటే ఏంతో చౌకగా ప్రపంచ స్థాయి సూపర్ వైద్యశాలలో సేవ లు పొంది అదనపు ఆర్థిక వ్యయం తగ్గించుకునే అవకాశం రోగుల చేతుల్లోనే వుంది.



చలాది పూర్ణచంద్రరావు
సీనియర్ జర్నలిస్ట్

# విక్రమాదిత్య మహారాజు..

ఒక రాత్రి తన జాతకం వ్రాయబడిన కాగితాన్ని చదువుతుంటే ఆయనకు ఒక అనుమానం వచ్చింది. నేను పుట్టిన రోజే ప్రపంచంలో అనేకమంది పుట్టివుంటారు. కానీ వాళ్ళంతా రాజులు కాలేదు... నేనే ఎందుకయ్యాను ? ఈ గొప్ప స్థానం నాకే ఎందుకు దక్కింది ? మరుసటిరోజు రాజసభలో పండితుల ముందు ఇదే ప్రశ్న పెడితే వాళ్ళు చెప్పిన జవాబు రాజుకు సత్రుంప్తిని ఇవ్వలేదు. అపుడు ఒక వృద్ధ పండితుడు రాజా ! ఈ నగరానికి తూర్పున బయటవున్న అడవిలో ఒక సన్యాసి వున్నాడు. ఆయనను కలవండి. మీకుజవాబు దొరుకుతుంది అన్నాడు. రాజు అక్కడకు వెళ్ళాడు. అపుడు ఆ సన్యాసి బొగ్గు తింటున్నాడు...అది చూసి రాజు ఆశ్చర్యపోయి, తన ప్రశ్న ఆయన ముందు పెట్టాడు .... ఆయన ఇలా అన్నాడు... ఇక్కడికి మరో నాలుగు మైళ్ళ దూరంలో ఇలాంటిదే మరొక గుడిశె ఉంటుంది. అందులో ఒక సన్యాసి ఉంటాడు ఆయన్ను వెళ్లి కలవండి... అని అంటాడు రాజు నిరాశపడినా... అలాగే రాజు రెండవ సన్యాసి కోసం వెళ్ళాడు. రాజు ఆయన్ని చూసినపుడు ఆ సన్యాసి మట్టి తింటున్నాడు...రాజు కాస్త ఇబ్బందిపడ్డాడు. కానీ తన ప్రశ్ననైతే రాజు సన్యాసిని అడిగాడు. కానీ ఆ సన్యాసి రాజు మీద తీవ్ర కోపంతో గట్టిగా అరచి... ఇక్కడి నుండి వెళ్ళిపో... అని కసురుకున్నాడు. రాజుకూ కోపం వచ్చినా సన్యాసి కాబట్టి సహనం తో ఆయన్ని ఏమీ అనలేదు. వాపసు



వెళుతుంటే ఆ సన్యాసి రాజుతో ఇలా అంటాడు....ఇదే దారిలో వెళితే ఒక గ్రామం వస్తుంది. అక్కడ ఒక బాలుడు చని పోవడానికి సిద్ధంగా వుంటాడు... వెంటనే అతన్ని కలవండి అని చెబుతాడు. రాజుకంతా గందరగోళంగా వుంటూంది. అయినా అక్కడికెళతాడు. అక్కడ చనిపోవడానికి సిద్ధంగా వున్న ఆ అబ్బాయిని కలిసి తన ప్రశ్న అడిగాడు. అపుడు ఆ అబ్బాయి అన్నాడు రాజా ! గత జన్మ లో నలుగురు వ్యక్తులు ఒక రాత్రి అడవిలో దారితప్పివుంటారు. ఆకలేస్తే వాళ్ళ దగ్గరున్న రొట్టెలు తిందామని చెట్టుక్రింద ఆగివుంటారు. తినబోతుంటే అక్కడికి బాగా ఆకలేసి , నీరసంగా వున్న ఒక ముసలి వ్యక్తి వచ్చి తనకూ కొంచెం ఆహారం ఇవ్వమని అడిగితే ఆ నలుగురిలో మొదటీవాడు కోపంతో... " నీకు నా రొట్టెలు ఇస్తే నేను బొగ్గు తినాలా ? " అని కసురుకొంటాడు రెండవ వ్యక్తిని అడిగితే.... " నీకు ఈ రొట్టెలు ఇస్తే నేను మట్టి తినాల్సిందే " అని వెటకారంగా అంటాడు.... మూడవవాడు కూడా... ఏమీ నేనిచ్చే ఈ రొట్టెలు తినకపోతే ఈ రాత్రికి చస్తావా ? " అని నీచంగా పరుషంగా అంటాడు " కానీ నాల్గవ వ్యక్తిని రొట్టె ఇస్తావా అని అడుగుతే... ఇతను మాత్రం " తాతా నీవు చాలా నీరసంగా వున్నావు. ఈ రొట్టె తిను , " అని తాను తినబోతున్న రొట్టెను ఇచ్చేసాడు. ఆ నాల్గవ వ్యక్తి ఎవరో కాదు... మీరే ! మీరే... రాజా ! " అని అన్నాడు. రాజు దిగ్భ్రాంతి కి లోనయ్యాడు. రాజా ! మీరు చేసిన పుణ్యం వల్ల రాజుగా జన్మించారు. అనవసరమయిన మీమాంసలతో కాలం వృథా చేయక ప్రజలను కన్న తండ్రి వలె పాలించు... అని చెప్పి ఆ అబ్బాయి కనులు మూసినాడు.

సేనాధిపత్యం రమేష్

# సమయ పాలనతోనే జీవితంలో విజయం

మనిషి జీవితంలో సమయ పాలన విజయాలకు పునాది కావాలి తల్లి తండ్రులుతమ పిల్లలకు ఇచ్చే అత్యుతమబహుమతులు సమయ పాలన ఆత్మసైర్యంధైర్యంవజ్ర సంకల్పం పట్టుదల అంకితభావం కార్యశీలత విజయ సాధన జిజ్ఞాస పనులు వాయిదా వద్దు అనుకున్న పనులు చేయడమే ముద్దు పిల్లలు తమ బాల్య దశలో తమ జీవిత లక్ష్యాలను తామే కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకునే నైపుణ్యాలను సృజనాత్మకత వాతావరణాన్ని సృష్టించాలి తల్లి తండ్రులు పిల్లలకు మానవీయ విలువలు నేర్పాలి పనులలో ప్రాధాన్యతలు నిర్ణయించుకొనే స్వయం చాలక శక్తిని ఉద్దీపన చేయాలి పనుల ప్రాధాన్యత బట్టి సమయాన్ని ఏవిధంగా కేటాయించాలో నేర్పాలి సమయమే ధనం సమయానుకూల స్పందనా శక్తి సమస్య పరిష్కారానికి సొంత ఆలోచనలను పిల్లల్లో ప్రేరేపించాలి స్వయం నిర్ణయ శక్తిని ప్రోత్సాహించాలి సమస్యల పరిష్కారానికి నైపుణ్యాలను పెంపొందించాలి స్వశక్తితో ఎదిగేట్లు పిల్లలను పెంచాలి భవిష్యత్తులో మానవీయ సంబంధాలకు మెరుగైన జీవితానికి కుటుంబ వ్యవస్థ బహుముఖ పాత్ర పోషించాలి.

నేదునూరి కనకయ్య

# వీరవనిత రాణీ ఝాన్సీ లక్ష్మీబాయి

భరతమాత నుదుట సింధూరం, భరతమాత దాస్య శృంఖలాలను తెంచడానికై యుద్ధభూమిలో ఆంగ్లేయులను ప్రాణభయంతో పరుగులెత్తించిన చవీరవణిత, తన తుదిశ్వాస వరకు భారతీయ సంస్కృతిని, పౌరుషాన్ని కాపాడిన "మణికర్ణిక" వీరనారి ఝాన్సీ లాక్ష్మీభాయ్. చిన్నపుడే తల్లి చనిపోయింది. తండ్రి పెంచాల్సిన పరిస్థితి. అతి చిన్న వయసుల్లోనే పెళ్లి చేసారు. విషాదం పుట్టిన కొడుకు చనిపోయాడు. ఆ బాధను తట్టుకోలేక భర్త మరణం. అడుగడుగునా కష్టాలు. దత్తత కొడుకు ను వీపున కట్టి, ఒక చేతిలో ఖడ్గం, మరో చేతిలో గుర్రపు కళ్లెం పట్టుకొని యుద్ధం లోకి దిగింది. కన్న తల్లిల తన రాజ్యాన్ని, రాజ్య ప్రజలను రక్షించాలని బ్రిటీష్ వారితో వీర పోరాటం చేసింది. ఇప్పటికి మనము ఆమె గురుంచి పాఠ్య పుస్తకాలలో చదువుకుంటున్నాం. చమనందరికీ ఆమె స్ఫూర్తి దాయకం. ధైర్యము, పరాక్రమము, మరియు వివేకము అన్ని కళకలిసిన ఆమె గూర్చి చెప్పాలంటే మాటలు సరిపోవు. భారతదేశంలోనే మొట్ట మొదటి సారిగా మహిళా సమూహాన్ని తయారు చేసిన గొప్ప వనిత. మొట్టమొదటి స్వతంత్ర పోరాటంలో పోరాడిన వీరవనిత, ఆమె చేసిన త్యాగాలు ఎప్పటికి మరువనివి. కానీ చివరకు వీర మరణం పొందింది. ఆమె మరణము పై ఎన్నో అనుమానులున్నాయి. బ్రిటిష్ వారి తూటాలకు బలి అయ్యిందా? లేక తనకు తానే ఆత్మ హత్య చేసుకుందా? గ్వాలియర్ యుద్ధంలో దొరికిన శవము ఆమెది కాదు అని బహిరంగ ప్రకటనే జరిగింది. .. ఆమె మరణం వెనుక ఉన్న అసలు కథ ఏంటి? ఆ వీర వనిత ఝాన్సీ లక్ష్మీబాయి గూర్చి ఈ రోజు తెలుసుకోపోతున్నాం. ఝాన్సీ లక్ష్మీబాయి' అసలు పేరు చమణికర్ణిక. మహారాష్ట్ర కు చెందిన సతారలో 1828వ సంవత్సరము నవంబరు నెల19 వంశంలో జన్మించింది. ఈమె తల్లిదండ్రులు మోరోపంత్ తాంబే మరియు భాగీరథీబాయిలు, వీళ్ళది సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబం. కానీ ఆమె తల్లి రాణి నాలుగేళ్ళ ప్రాయంలో ఉన్నపుడే కన్ను మూయడం తో ఆమెను పెంచాల్సిన బాధ్యత తండ్రి మీద పడింది. ఇలాంటి క్లిష్ట సమయంలో బాజీరావు పీష్వా మోరో పంత్, ఝాన్సీ లక్ష్మీబాయి బిఠూర్ కు పిలిపించి ఆశ్రయమిచ్చి వాళ్ళని ఆదుకున్నాడు. బాజీరావు కు సంతానం లేకపోవడంతో నానా సాహెబ్ అనే బాలుని దత్తత చేసుకున్నాడు. నానా సాహెబ్ యొక్క పినతండ్రి కుమారుడు రావు సాహెబ్ వీరిద్దరూ లక్ష్మీబాయిని తమ చెల్లెలిగా చూసుకునేవారు. వీరుముగ్గురూ కలిసే కత్తిసాము, గుర్రపుస్వారీ, తుపాకీ పేల్చడం వంటి విద్యలన్నీ నేర్చుకునేవారు. ఖడ్గం ధరించి, కళ్ళెం బిగించి గాలి విసురుకు ఉవ్వెత్తుగా ఎగిరే కురులతో గుర్రపు స్వారీ చేస్తూ నానా సాహెబ్ వెంట మనూబాయి కూడా దుసుకొని పోయేది. ఇక ఆమె చవివాహం విషయానికొస్తే.....1842లో ఝాన్సీ పట్టణానికి రాజైన గంగాధరరావు నెవల్కార్ తో లక్ష్మీబాయికి 13 ఏళ్ళ వయసులోనే వివాహమైంది. దీంతో అప్పటి ఆచారాల ప్రకారం మహారాణి అయిన తర్వాత ఆమె పేరు లక్ష్మీబాయి పిలిచారు. లక్ష్మీబాయికి ఒక కుమారుడు జన్మించాడు. కానీ ఆ పిల్లవాడు నాలుగు నెలల వయసులోనే కన్ను మూయడం తో లక్ష్మీబాయి, గంగాధరరావులు దామోదర్ రావు అనే పిల్లవాడిని దత్తత తీసుకొన్నారు. కన్న కుమారుడి మరణం నుంచి తేరుకోలేక, పగిలిన హృదయముతో చాలా బాధపడుతూ ఆ తర్వాత గంగాధర్ చనిపోయాడు. హిందూ సాంప్రదాయం ప్రకారం దామోదర్ రావు రాజ్యానికి వారసుడు కావల్సి ఉన్నా, దామోదర్ రావు , గంగాధర్ రావుకు రక్త సంబంధం కానందువలన సింహాసనాన్ని అధిష్టించే అధికారం లేదని బ్రిటీష్ ప్రభుత్వం అందుకు అంగీకరించలేదు. రాణి దీనికి ఒప్పుకోలేక లండన్ కోర్టులో దావా వేసింది. కానీ కేసును కోర్టు కొట్టివేసింది. ఆంగ్లేయులు రాణి మీద కక్ష పెంచుకొని గంగాధర్ రావు తీసుకున్న అప్పుకు వారి రాజాభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఆమె వెంటనే



ఝాన్సీ పట్టణాన్ని విడిచి వెళ్ళాల్సిందిగా ఆదేశించారు. కానీ రాణి అందుకు సమ్మతించలేదు. తాను ఝాన్సీ పట్టణాన్ని విడిచి వెళ్ళేది లేదని ప్రతిజ్ఞ పూనింది. రాణి ఝాన్సీ పట్టణంని బ్రిటిష్ వారికీ ఇవ్వకూడదని చపోరాటానికి సిద్దపడింది. 1857లో అలజడి రేగడంతో ఝాన్సీ పట్టణం విప్లవ కారులకు నిలయంగా మలిచింది .లక్ష్మీబాయి స్వచ్ఛంద సైన్యాన్ని సమకూర్చి సైన్యాన్ని బలోపేతం చేసింది. మహిళలను కూడా సైన్యంలో చేర్చుకుని వారికి ఆయుధ శిక్షణను ఇచ్చింది .1858లో బ్రిటిష్ సైన్యం ఝాన్సీని ముట్టడించడం ప్రారంభించింది. ఆమె తన బలగాలను తన చుట్టూ ఏర్పరచుకొని బ్రిటిష్ కి వ్యతిరేకంగా చాలా భయంకరంగా యుద్ధం చేసింది. రెండు వారాల పోరాటం తర్వాత చలక్ష్మీబాయి బలగాలు బలహీనమవడంతో బ్రిటిష్ వాళ్ళు నగర గోడలను చీల్చుకొని నగరాన్ని చేజిక్కించుకోగలిగారు. కానీ రాణి మాత్రం మగ వేషంలో దత్తత తీసుకున్న చిన్న బిడ్డను వీపున తగిలించుకుని వారి కన్నుగప్పి పారిపోయింది. ఆ తర్వాత కల్పి అనే ప్రదేశానికి చేరుకుని చతాంతియా తోపే అనే విప్లవ కారునితో చేయి కలిపి మరింత బలగాన్ని పెంచుకుంది. రాణి మరియు తాత్యా తోపే గ్వాలియర్ కు వెళ్లి తమ తిరుగుబాటు చేసి గ్వాలియర్ మహారాజ సైన్యాన్ని ఓడించి తమ బలగాలతో వాళ్ళను పూర్తిగా నశించి పోయేలా చేసిందట. కానీ బ్రిటిష్ వారు తరువాత మళ్ళి కపటోపాయముతో గ్వాలియర్ కోటను ఆక్రమించుకొన్నారు. 1858 జూన్ 17లో రెండో రోజు యుద్ధములో రాణి మరణించింది. చయుద్ధం లో ఝాన్సీమరణించలేదా?....కానీ ఈమె యుద్ధం లో మరణించలేదని, ఝాన్సీ కోట నుండి తప్పించుకున్నాక ప్రతాప్ గడ్ రాజు ఆశ్రయమిచ్చి, అక్కడి నుండి నేపాల్కి వెళ్లే ఏర్పాట్లు చేసాడట. మరియు 1915 లో సహజ సిద్ధంగ మరణించిందని చెప్తుంటారు. ఇంకా చెప్పాలి అంటే బ్రిటిష్ బుల్లెట్స్ కి మరణించించింది. అచ్చం ఝాన్సీలక్ష్మి భాయ్ ల ఉండే ఝల్కారిబాయి అని. ఝాన్సీలక్ష్మి భాయ్ మహిళా సైన్యం లో ఉండే గొప్పవనిత ఝల్కారిబాయి అని "ఝాన్సీ పై రాణి" అనే పుస్తకం లో ప్రపంచానికి తెలియ పరిచారు. స్త్రీ శక్తి దివాస్ గా స్వాతంత్ర్య సమర యోధురాలు, బ్రిటిష్ వారిని గడగడలాడించినఝాన్సీ లక్ష్మీబాయి జయంతి జరుపుతున్నారు. అమెరికా వార్తాపత్రికలో....అమెరికా వార్తాపత్రిక వారు 100ఏండ్లబికింద ఝాన్సీరాణీ ధీరత్వాన్ని గుర్తించి ఆమెను హీరోయిన్ ఆఫ్ ద వార్ అనగా యుద్ధ నాయకురాలు అని సగర్వంగా ప్రకటించింది. చరిత్ర లో ఝాన్సీ లక్ష్మీబాయి గొప్పతనాన్ని గుర్తించి భారతీయులుగా గర్వించాలి. చివరగా ఆమె పోరాటానికి గుర్తుగా వీర వనిత ఝాన్సీలక్ష్మి భాయ్ గుర్రం పైన కూర్చున్నట్లుండె కంచు విగ్రహాలు ఝాన్సీ మరియు గ్వాలియర్ లో ఏర్పాటు చేసారు.

# రాజమండ్రి రైల్వేస్టేషన్‌లో మాక్ డ్రిల్...

## ఎన్ డి ఆర్ ఎఫ్ 10వ బెటాలియన్‌తో కలిసి...

## మాక్ డ్రిల్‌ను సమర్థంగా నిర్వహించిన బృందాలను అభినందించిన అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ శ్రీనివాసరావు









**రాజమహేంద్రవరం, నవంబర్ 20 ( ఆంధ్రపత్రిక):** రైలు ప్రమాద సమయంలో ప్రయాణీకుల ప్రాణనష్టాన్ని తగ్గించడానికి సాధ్యమైనంత తక్కు వ సమయంలో త్వరితగతిన రెస్క్యూ కార్యకలాపాలను ఏ విధం గా చేపట్టా లనే అంశాలకు సంబంధించి ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌పిఎఆర్ఎంవి సిబ్బంది మాక్ డ్రిల్‌ను సమర్థంగా నిర్వహించడం జరిగిందని ఎడిఆర్ఎం అభినందించారు. అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్, ఆపరేష న్స్ విజయవాడ వారు శ్రీనివాసరావు కొం డ అన్నారు.బుధవారం స్థానిక రైల్వే స్టేషన్ దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ ఈస్ట్ బుకింగ్ ఆఫీస్ సమీపంలో రాజమండ్రి రైల్వే స్టేషన్‌లోని కోల్ సైడింగ్‌లో విజయవాడ డివిజన్ ఆపరేషన్స్ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ శ్రీనివా సరావు కొండ పర్యవేక్షణలోఎన్ డి ఆర్ ఎఫ్ 10వ బెటాలియ న్‌తో కలిసి మాక్ డ్రిల్ నిర్వహించారు. మాక్ డ్రిల్ కార్యక్రమానికి జాయి ంట్ కలెక్టర్ ఎస్. చిన్నరాముడు, బి.ప్రశాంత కుమార్, సీనియర్ డీఎస్ఓ, విజయవాడ, మెకానికల్, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, కమ ర్షియల్ శాఖ అధికారులు, పౌర రక్షణ సంస్థ అధికారులు, ఎస్ సి ఆర్, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ఆర్పిఎఫ్, జి ఆర్ పి, భారత్ స్కౌట్స్ మరియు గైడ్స్, స్వీయ చోదక ప్రమాద ఉపశమన వైద్య వ్యాన్ విజయవాడ , గుం టూరు డివిజన్ల సిబ్బంది సంయుక్త మాక్ డ్రిల్ వ్యాయామంలో పాల్గొ న్నా రు. ఈ సందర్భంగా అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్, ఆపరేషన్స్ శ్రీని వాసరావు కొండ మాట్లాడుతూ ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రయాణాన్ని చేపట్టేటప్పుడు ప్రయాణికులకు చేయవల సిన మరియు చేయకూడని పనుల గురించి వారికి వివరించామన్నారు. మెకానికల్, సేఫ్టీ, మెడికల్, ఎస్ అండ్ టీ విభాగాల్లోని సిబ్బ ందికి క్రమా నుగతంగా శిక్షణ ఇవ్వ డంతో పాటు అత్యవసర సమయంలో సన్నద్ధం కావడానికి సహ కరిస్తా మన్నారు. రైలు ప్రయాణీకుల ప్రాణ నష్టాన్ని తగ్గించడానికి సాధ్యమై నంత తక్కువ సమయంలో రెస్క్యూ కార్యక లాపాలను చేపట్ట డానికి త్వరిత స్పందించే విధంగా విజయవాడలోని ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌పి ఎఆర్ఎంవి సిబ్బంది మాక్ డ్రిల్‌ను సమర్థంగా నిర్వహించారన్నా రు. జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాములు మాట్లాడుతూ ట్రైన్ యాక్సిడెంట్ సమయ ంలో ప్రాణా పాయ స్థితిలో వున్నవారిని కాపాడేందుకు అత్యవసరంగా చేపట్ట వలసిన చర్యలను ఎన్డీఆర్ బృందం మాక్ డ్రిల్ చేసిన ప్రదర్శన కళ్లకు కట్టినట్లుగా చూపించడం అభినందనీయమన్నారు. ఈ మాక్ డ్రిల్ నిర్వహిం చడం యొక్క ప్రాథమిక లక్ష్యం మెడికల్ రిలీఫ్ రైళ్లలో పనిచేసే సిబ్బందికి ప్రయాణికులను వెలికి తీయడంలో కీలక పాత్ర పోషించేలా శిక్షణ ఇవ్వడం మరియు వారిని చికిత్స కోసం సమీప ఆసు పత్రికి తరలించడం, ఇది విలువైన ప్రాణాలను రక్షించడంలో మరియు ప్రాణనష్టాన్ని తగ్గించడంలో సహాయపడుతుందనారు. మాక్ డ్రిల్ వ్యాయా మం ఉదయం 10.03 గంట లకు రాజమండ్రి స్టేషన్‌లో సైరన్ మోగిం చడంతో ప్రారంభమై మధ్యా హ్నం 12:30 గంటల వరకు కొనసాగిందని తెలిపారు. మొత్తం 100 మంది రైల్వే సిబ్బంది రెస్క్యూ మరియు పునరు ద్ధరణ కార్యకలాపాలలో పాల్గొన్నారు. మాక్ డ్రిల్ వ్యాయామం కోసం రాజమండ్రి కోల్ సైడింగ్ వద్ద ఖండించబడిన కోచ్ మరియు మెడికల్ రిలీఫ్ వ్యాన్‌ను ఉంచడం జరి గిందని, ఈ వ్యాయామం MRVలలో అందుబాటులో ఉన్న అత్యాధునిక హైడ్రాలిక్ రెస్క్యూ పరికరాలను ఉపయోగించడంలో సిబ్బందికి శిక్షణ ఇవ్వడమే కాకుండా, బ్లాక్ చేయబడిన కోచ్‌లలోకి ప్రవేశించడానికి సాధ్య మయ్యే అన్ని మార్గాలు ఉన్న సాధారణ పరిస్థితులలో పట్టాలు తప్పిన కోచ్‌ల లోకి ప్రవేశించడంలో వారికి శిక్షణ ఇవ్వడం కూడా లక్ష్యంగా పెట్టుకుంది.

**మాక్ డ్రిల్ వ్యాయామం యొక్క వివరాలు:** ప్రారంభంలో, ఎన్ డి ఆర్ ఎఫ్ బృందం ప్రమాద స్థలం నుండి ఊయల లిఫ్ట్, సింగిల్ మ్యాన్ హ్యూ మన్ క్రచ్, బ్యాక్ మరియు క్లాత్ లిఫ్ట్ వంటి గాయపడిన ప్రయాణీకులను తీసుకువెళ్లడానికి వివిధ పద్ధతులను ప్రదర్శించింది. ఏదైనా పట్టాలు తప్పిన సమయంలో లేదా ప్రమాదాల సమయంలో మంటలు చెలరేగినప్పుడు అగ్ని మాపక పరికరాలు, తడి గుడ్డ, సోడియం బైకార్బోనేట్ మొదలైన వాటిని ఉపయోగించి వివిధ అగ్నిమాపక సాంకేతికతలు ప్రదర్శించబడ్డాయి. ముఖ్య ంగా వంటగదుల్లో అగ్ని ప్రమాదాల సమయంలో గ్యాస్ సిలిండర్ల నుంచి మంటలను ఆర్పేందుకు వివిధ పద్ధతులను ప్రదర్శించారు. ఎన్‌డిఆర్ఎఫ్ బృందం చేత ప్రాథమిక లైఫ్ సపోర్ట్ మరియు అపస్మారక స్థితిలో ఉన్న ప్రయాణీకుల సంరక్షణ కూడా ప్రదర్శించబడింది.

తరువాత, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ఖండించిన కోచ్ నుండి రెస్క్యూ ఆపరే షన్‌లను ప్రదర్శించారు. SPARMV ఖండించిన కోచ్ వద్దకు పరుగెత్తింది మరియు కోచ్‌లను తెరిచి, గాయపడిన ప్రయాణికులను రక్షించడానికి కిటికీ ఇనుప గ్రిల్స్ మరియు కోచ్ యొక్క సైడ్ బాడీలను కత్తిరించడం ప్రారంభి ంచింది. గాయపడిన ప్రయాణికులను రక్షించేందుకు ఎన్‌డిఆర్ఎఫ్, రైల్వే సిబ్బంది కోచ్‌లలోకి వెళ్లారు. కోచ్‌ల పైభాగంలో చిక్కుకుపోయిన ప్రయాణికులు మరియు అప స్మారక స్థితిలో ఉన్న ప్రయాణీకుల కోసం, చైన్ నాట్ పద్ధతి మరియు స్ట్రెచర్‌తో విండో రెస్క్యూ వరుసగా నిర్వహిం చబడ్డాయి. గాయపడిన ప్రయా ణీకు లను కారవాన్‌కు తరలించి ప్రథమ చికిత్స సేవలు అందించబడతాయి మరి యు గాయం యొక్క తీవ్రతను బట్టి ఎమ్మార్వీ లేదా అంబులెన్స్‌కు తరలిం చబడతాయి. ఈ మాక్ డ్రిల్ డాక్టర్ వి. సునీల్ కుమార్, సీనియర్ డిఎంఓ మరియు డాక్టర్ ఎం. సుజి, డివై. సిఎండి రెస్క్యూ ఆపరేషన్‌లు, బేసిక్ లైఫ్ సపోర్ట్ కేర్, క్రిటికల్ పేషెంట్‌లకు సి పి ఆర్ టెక్నిక్ మరియు ప్రమాద స్థలంలో వైద్య సిబ్బంది సంసిద్ధతను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో రైల్వే శాఖలోని వివిధ విభాగాల అధికారులు మరియు సిబ్బంది ఉన్నారు.

## ఎల్ఏడి సెక్రటరీని కలిసిన ఎమ్మెల్యే గొల్లపల్లి



**యానాం, నవంబరు 20(ఆంధ్రపత్రిక):**పుదుచ్చేరి లోకల్ అడ్మినిస్ట్రేటీవ్ సెక్రటరీ జవహర్ ను యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ బుధ వారం పుదుచ్చేరిలో కలిశారు. ఈమేరకు యానాంకు సంబంధించిన పలు అంశాలపై సెక్రటరీతో ఎమ్మెల్యే చర్చించారు. యానాంలో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి జీతాలు మంజూరుపై చర్చించడం జరిగింది. జీతాలు విడుదల చేయాలని కోరారు. అలాగే యానాంలో పారా టీచర్స్ నియా మకాలపై ఇప్పటికే చాలా జాప్యం జరిగిందని, ఎప్పుడు నియామకాలు చేప డతారు అన్న విషయాలపై సెక్రటరీతో మాట్లాడారు.నియాకాలపై ప్రభు త్వాన్ని నమ్ముకుని ఉన్న నిరుద్యోగులు జరుగుతున్న జాప్యంపై ఆందోళన చెందుతున్నారని తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ఆయా అంశాలపై జవహర్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. సాధ్యమైనంత త్వరగా సమస్యను విద్యాశాఖ మంత్రి, చీఫ్ సెక్రెటరీలతో సంప్రదింపులు చేసి,అతి త్వరలోనే ఉత్తర్వులు జారీ చేసే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యేకు సెక్రటరీ హామీ ఇచ్చారు.

## బూరుగుపూడిలో రీ సర్వే సదస్సు

### సమస్యలు మిగిలిన భూ రీసర్వే - మాజీ సొసైటీ అధ్యక్షులు కేశవరావు



**కోరుకొండ, నవంబరు 20 (ఆంధ్రపత్రిక) :** గత ప్రభుత్వం నిర్వహించిన భూ రీ సర్వే రైతాంగానికి సమస్యలు మిగిల్చిందని కోరుకొండ మండలం బూరుగుపూడి సొసైటీ మాజీ అధ్యక్షులు కంటే కేశవరావు అన్నారు. గ్రామ సచివాలయం వద్ద బుధవారం తహసిల్దార్ సుస్వాగతం, రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ రజిని ఆధ్వర్యంలో నిర్వహించిన రీ సర్వేలో వచ్చిన భూ సమస్యల పరిష్కార వేదిక సదస్సుకు రైతులు హాజరై తమ భూ సమస్యలను వారి దృష్టికి అర్జీల రూపంలో తీసుకెళ్లారు. గత ప్రభుత్వ డ్రోన్ సర్వే వల్ల రైతాంగానికి జరిగిన నష్టాన్ని ఆయన వివరించారు. గతంలో జరిగిన రిసర్వేని రద్దు చేయాలని ఆయన కోరారు.అటువంటి సమస్యలు పరిష్కరిం చడం కోసం ఎన్డీఏ ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించడం హర్షణీ యమన్నారు. తహసిల్దార్ సుస్వాగతం రైతుల సమస్యలపై అర్జీలను తీసుకు ని, సాధ్యమైనంత మేరకు పరిష్కార చర్యలు చూపిస్తున్నారని కేశవరావు ప్రశంశించారు. ఈవేదిక రైతులకు ఎంతో అవసరం ఉందన్నారు. ఈకార్య క్రమంలో మండల సర్వేయర్ ఎండి సుల్తాన్ ఖాన్ , పంచాయతీ కార్యదర్శి జాకబ్ రాజు, రైతు నాయకులు అడపా శ్రీనివాస్, కంటే గణపతి, మాజీ సర్పంచ్ బుడ్డిగ సత్యనారాయణ, గండి విజయ్ కుమార్, వీఆర్వో కె రాజా రమేష్, అగ్రికల్చర్ అసిస్టెంట్ బి స్రవంతి, రెవిన్యూ సిబ్బంది, రైతులు పాల్గొ న్నారు. అనంతరం దేవుడు మాన్యం భూములను తహసిల్దార్ రైతులతో కలిసి పరిశీలించారు.

## ముగిసిన శాఖ గ్రంథాలయ వారోత్సవాలు





**దుంబ్రిగుడ, నవంబర్ 20 (ఆంధ్రపత్రిక):** మండల కేంద్రంలో ఉన్న శాఖ గ్రంధాలయ ముగింపు వారోత్సవాలను గ్రంధాలయాధికారి శెట్టి. సునీత ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈనెల 14న ప్రారంభించిన గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ముగిసింది. విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన, పాటలు పోటీలు, వివిధ రకాల పాటలను నిర్వహించి వారి నైపుణ్యతను గుర్తించి గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి పోటీతత్వంలో ప్రతి విద్యార్థి పాల్గొని వారి నైపు ణ్యతను చాటుకోవాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యంగా అత్యధిక పాల్గొన్న జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చేతులు మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి శెట్టి. సునీత,ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



**నిడదవోలు, నవంబర్20(ఆంధ్రపత్రిక) :**నిడదవోలు మండలం తాడిమల్ల గ్రామంలో ఈనెల19 తేదీ రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలి పోయి నష్టపోయిన బాధిత కుటుంబానికి నిడదవోలు మాజీ శాసనసభ్యులు మరియు నిడదవోలు నియోజకవర్గం తెలుగుదేశంపార్టీ ఇంచార్జ్ బూరు గుపల్లి శేషారావు ఆదేశాల మేరకు శేషారావు సోదరులు మరియు వేలు వెన్ను గ్రామ ఉపసర్పంచ్ బూరుగుపల్లి శ్రీనివాస్ మరియు నిడదవోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగన సూర్యారావులు బుధవారం ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం జనసేన భారతీయ జనతా పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ఆర్యవైశ్య వనసమారాధన

### వనసమారాధనకు అధికారులు నాయకులు హాజరు



**గోకవరం, నవంబరు 20 (ఆంధ్రపత్రిక) :** శ్రీ వాసవి ఆర్యవైశ్య సేవా సం ఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తీక వనసమారాధన ఉల్లాసంగా ఉత్సా హంగా భక్తిశ్రద్ధలతో జరిగింది. రంపఎర్రంపాలెం రోడ్ లో రామకృష్ణ మా స్టారు తోటలో ఉసిరి చెట్టు కింద నిర్వహించిన పూజలో బత్తుల రాయు డు దంపతుల పాల్గొనే పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు తోటలో గోపూజ ఏర్పాటు చేశారు. తోటలో ఏర్పాటు చేసిన పలు స్టాల్స్ సభ్యులను ఆకట్టుకున్నాయి. చిన్నారుల కోసం ఆటపాటలు పోటీలు, మహి ళా సంఘ సభ్యులు హౌసి, చీరల డ్రా పోటీలు తో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. సాయంత్రం వరకు ఏర్పాటుచేసిన ఆర్యవైశ్య వనసమారాధనలో సంఘ సభ్యులు కుటుంబ సభ్యులతో పాటు పాల్గొని ఆనందంగా గడిపారు. ఆర్య వైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో సంత వర్తక సంఘం సహకారంతో నిర్వ హించిన వనసమారాధనలో ఆర్యవైశ్య సంఘ కుటుంబ సభ్యులు మండ లానికి చెందిన అధికారులు, నాయకులతో పాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్య పరిరక్షణలో ఆశయాత్మక పాత్ర పోషించండి

### ఆరోగ్యసహాయకుల శిక్షణలో డీ.ఎం.ఓ డాక్టర్ సంధ్య...




**రాజమహేంద్రవరం, నవంబర్ 20 ( ఆంధ్రపత్రిక):** ప్రజారోగ్య పరిరక్షణలో ఆరోగ్య సహాయకులు ఆశయాత్మక పాత్ర పోషించి, ప్రజలకు ఆరోగ్య అవ గాహన కల్పించడం ద్వారా వ్యాధులు బారి నుంచి రక్షించాలని తూర్పు గోదావరి జిల్లా మలేరియా ఇంచార్జి అధికారి, డిప్యూటీ డీ.ఎం. హెచ్.ఓ డాక్ట ర్ జె. సంధ్య పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరంలోని ఆనం కళా కేంద్రం లో ఆరోగ్యసహాయకులకు బుధవారం రెండో రోజు జరుగుతున్న పునశ్చరణ కార్యక్రమంలో డీ.ఎం.ఓ సంధ్య పాల్గొని ప్రధాన ప్రసంగం చేసారు. జాతీ య కీటక జనిత వ్యాధులైన దోమల ద్వారా వచ్చే డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధులతో పాటు, వాతావరణ మార్పులతో సంభవించే వ్యాధులు పట్ల ప్రజల్లో సరైన అవగాహన కలిగిస్తే తప్పకుండా వ్యాధుల బారిన పడకుండా ప్రజలు తమ ఆరోగ్యాలను కాపాడుకోగలుగుతారన్నారు. దోమలు లార్వా నియంత్రణ కార్యక్రమం, పరిసరాల పరిశుభ్రత, డ్రైడే, ఫ్రైడే కార్యక్రమాలను గ్రామాల్లో ఆరోగ్యసహాయకులు సమర్ధవంతంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమాలన్నింటిపై ఈ సందర్భంగా వారికి తగిన హితబోధ చేశారు.

కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా సహాయ మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, క్షేత్ర స్థాయిలో ఆరోగ్య సహా యకులు విధులు, బాధ్యతలు గుర్తుచేస్తూ గృహ సందర్శనకు వెళ్లిన ప్పుడు జ్వరపీడుతులను గుర్తించి వారి నుంచి రక్తనమూలను సేకరించే విధా నం, తదనంతర కార్యాచరణలను ప్రత్యక్ష విసిధీకరణతో వివరించారు. పలు వ్యాధులు లక్షణాలు, వాటి నివారణ మార్గాలు గురించి సీనియర్ ఎంటమా లజిస్ట్ ఐ.రామకృష్ణారావు శిక్షణలోని ఆరోగ్యసహాయకులకు సమగ్రంగా తెలి యజేసారు. ముఖ్యంగా, దోమల నియంత్రణ కోసం వినియోగించే స్ప్రే యర్లు, వాడే ఔషధాలు నేరుగా ప్రదర్శన రూపంలో శిక్షకులకు చూపిం చారు. జిల్లా మలేరియా అధికారులు రెండ్రోజులు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం క్షేత్రస్థాయిలో పనిచేసే వైద్యఆరోగ్య ఉద్యోగులకు ఎంతగానో ఉపకరిస్తుందని ఆంధ్రప్రదేశ్ వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జీ.వీ.వీ.ప్రసాద్ చెబుతూ, జిల్లా మలేరియా అధికారులకు ఆయన అభినందనలు తెలియజేసారు.

## తాళ్లూరి మఠం ఆస్తిపై ప్రజాభిప్రాయ సేకరణ





**గండేపల్లి, నవంబర్ 20 (ఆంధ్రపత్రిక):** మండలంలోని సుమారు 700 సం వత్సరాల చరిత్ర కలిగిన తాళ్లూరు మఠంపై జరుగుతున్న వివాదానికి పరిష్క రించే పనిలో పురావస్తు శాఖ అధికారులు ప్రజాభిప్రాయం సేకరి ంచారు. బుధవారం తాళ్లూరు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ఆవ రణలో మఠం ఆస్తులపై ఉన్న వివాదాన్ని తొలగించేందుకుగాను ఆ గ్రామస్తుల నుంచి అభిప్రాయాలను పెద్దాపురం ఆర్డీవో కె శ్రీరమణి ఆధ్వర్యంలో పురా వస్తు, దేవాదాయ, రెవెన్యూ అధికారుల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందు పొడుగు వెంకట సత్యనారాయణ ప్రసాద్ ఆచార్యు లు మాట్లాడుతూ ఈ వెంకటేశ్వర స్వామి వారి గుడిని అప్పటి జీయర్ వారు కట్టించడంలో ఎంతో సహకరించారన్నారు. తాళ్లూరు మఠం ప్రసిద్ధి చెంది ందని దాని పూర్తి హక్కులు తమ వాళ్ళకే ఉన్నాయంటూ ఆచార్యులు తాళ పత్ర గ్రంథాలను చూపించారు. అందువల్ల తమకే ఈ మఠాధిపతిగా కొన సాగే పూర్తి హక్కును ఇవ్వాలని ప్రజల సమక్షంలో అధికారులను కోరారు. తాళ్లూరును మఠంగా గుర్తిస్తూ అయోధ్య, చినజీయర్ స్వామి వారి మఠాల నుండి తమకు సమాచారం వస్తుందని చెప్పారు. దీనిపై వంశపారపర్య అర్చకులు జేవీ నరసింహ మూర్తి అభ్యంతరం వ్యక్తం చేశారు. ముందు ఈ మఠం దేవాదాయ శాఖ నుంచి తొలగించి మఠంగా గుర్తించాలని చెప్పారు. ఇది ఒక వ్యక్తిని మఠాధిపతిగా ప్రకటించకుండా ప్రభుత్వ ఆధీనంలోనే సం రక్షించే బాధ్యతలను చేపట్టాలని జేవీ సూచించారు. ఆచార్యులు చూపిస్తున్న పత్రాలు సరైనని కాదని అందువల్ల ఆయన నకిలీ పత్రాలు సృష్టించాడని దానిని పరిగణలోకి తీసుకోకుండా వాటిని ఆచార్యులకి ఇచ్చిన పురావస్తు శాఖ అధికారులపై చర్యలు చేపట్టాలన్నారు. ఆచార్యులు నకిలీ పత్రాలు సృష్టించి మఠానికి చెందిన ఆస్తులను తన ఆధీనంలోకి తెచ్చుకొని కాజేయా లని ప్రయత్నిస్తున్నట్లు నరసింహ మూర్తి తెలిపారు. దీనిపై పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి స్పందిస్తూ మఠానికి చెందిన ఆస్తుల దుర్వినియోగంపై కొన్ని అభియోగాలు వచ్చాయని వాటిని ప్రజల సమక్షంలో అభిప్రాయాలు సేకరి ంచి నివేదికను తమ ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డీసీ డీఎల్వి రమేష్ బాబు, పురావస్తు శాఖ డిడి ఓ రామ సుబ్బారెడ్డి, తాళ్లూరు సర్పంచ్ శీలమంతుల వీరబాబు, పురావస్తు శాఖ ఏడి పి సురేష్ తదితరులు పాల్గొన్నారు. తాళ్లూరు మఠం నకు చెందిన సుమారు 238 ఎకరాల భూమిలో సుమారు 59 ఎకరా లు పుష్కర కాలువ తవ్వకాలకు ప్రభుత్వం వినియోగించుకుని అందుకు గా ను ఒక కోటి డబ్బై లక్షల రూపాయలు బ్యాంకులో జమ చేసినట్లు దేవా దాయ శాఖ అధికారులు చెప్పారు. శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయం నిత్యం కళకళలాడేలా దీప ధూప నైవేద్యాలతో పూజా కార్యక్రమాలను చేపట్టాలని ప్రజలు అక్కడకు హాజరైన అధికారులను వేడుకొన్నారు. కోట్లాది విలువగల ఆస్తులు ఉన్నా స్వామి వారికి పండుగ, విశేష కార్యక్రమాలను తామంతా చందాలను వేసుకుని నిర్వహించవలసిన పరిస్థితి వస్తుందంటూ భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

## పట్టభద్రుల ఎన్నికల బరిలో రవిరాజు



**అమలాపురం,నవంబర్ 20 (ఆంధ్రపత్రిక):** ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుట్ కాన్స్టెన్సీ ఎమ్మెల్సీ రేసులో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు మంతెన రవి రాజు చెప్పారు. వైసిపి జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షు నిగా ఉన్న రవిరాజు స్వతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్సీ ఎన్ని కల బరిలో పోటీ చేయనున్నారు. తనకి అన్ని రాజకీయ పక్షాల మద్దతు ఉందని రవిరాజు చెప్పారు. గ్రాడ్యుట్లు సమస్యలు పరిష్కారం దిశగా తాను శాసన మండలికి వెళ్లాలనుకుం టున్నట్లు రవిరాజు అన్నారు.

గ్రాడ్యుట్స్ ఒట్టు నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు.

## కార్తీకమాస హరేరామ నామ పూజా మహోత్సవాలు

### కోరుకొండ హరేరామ సమాజంలో విశేష అన్నదానం



**కోరుకొండ, నవంబర్ 20 (ఆంధ్రపత్రిక) :** మండల కేంద్రమైన కోరు కొం డలో 62వ కార్తీకమాస హరేరామ నామ పూజా మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. 1965లో ఈ హరేరామ సమాజం ఏర్పాటు చేశారు. కార్తీకమాసంలో నెల రోజులు ప్రతిరోజు మధ్యాహ్నం విశేష అన్న దాన కార్యక్రమం ఇక్కడ నిర్వహిస్తున్నారు. భక్తులు, దాతల విరాళాలతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వహిస్తున్నారు. బుధవారం విశేష అన్నదాన కార్యక్రమం జరిగింది. దాతలు విరాళాలు సమర్పించారు. ఈకార్యక్రమంలో శ్రీ హరేరామ భజన భక్త సమాజం ఉపాధ్యక్షులు శీలం ఏడుకొండలు, కార్యదర్శి గరగ శ్రీధర్ బాబు, కమిటీ సభ్యులు రొంగల ఎరకయ్య, వెలిచేటి భూపతిరావు పర్యవేక్షణలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో ప్రగళ్లపాటి మార్తాండ ప్రసాద్, కొడవటి సూర్యనారాయణ, కటకం నరసింహామూర్తి, ఉప సర్పంచ్ నేతుల చిన్ని, కోడూరి సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 24న వైఖానస ఆగమ కళ్యాణ ప్రకరణ పుస్తకావిష్కరణ

**అనపర్తి, నవంబర్ 21, ( ఆంధ్రపత్రిక ) :**కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం గ్రామంలో ఈనెల 24 న వైఖానస ఆగమ కళ్యాణ ప్రకరణ పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పి. వి ఎల్ ఎన్ ఆచార్యులు(రమణ ) తెలి పారు. ప్రముఖ వైఖానస పండితులు, వైఖానస ఆగమ మహాదాచార్య పెద్దిం టి లక్ష్మీనరసింహాచార్యులు సంకలనం చేసిన వైఖానస ఆగమ కళ్యాణ ప్రకం ణ( టేకి వారి పాఠం ) పుస్తకావిష్కరణ సదస్సుకు ఏర్పాట్లు చేసినట్టు అయన తెలిపారు. కార్తీకమాసం సందర్భంగా 24 వ తేదీ కపిలేశ్వరపురం లో శ్రీ భూ సమేత జనార్ధనస్వామి ఆలయంలో ఉదయం ఆగమ సదస్సు, మధ్యా హ్నం పుస్తకావిష్కరణ జరుగనున్నదని, రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, దాట్ల బుచ్చి వేంకటపతి రాజు చేతుల మీదుగా జరుగనున్న ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు హాజరుకానున్నారని రమణ తెలిపారు. అనంతరం వైఖానస శాఖీయులకు కార్తీక వనసమా రాధన ఏర్పాటు చేసినట్టు సంకలన కర్త కుటుంబ సభ్యులు , అభిమానులు, శిష్యులు తెలిపారు.

## కార్పొరేషన్ డైరెక్టర్లను కలిసిన గంగుమళ్ళ దంపతులు



**అయినవిల్లి , నవంబర్ 21, ( ఆంధ్ర పత్రిక ) :**రాష్ట్ర క్షత్రియ కార్పోరేషన్ డైరెక్టర్ గా నియమి తులైన సయ్యపరాజు సత్య నారాయ ణ రాజు,రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరే షన్ డైరెక్టర్‌గా నియమితులైన బోం తు గంగాధర రావు (పెద బాబు) ల ను అయినవిల్లి మండల మాజీ జెడ్పీ టీసీ సభ్యురాలు గంగు మళ్ళ కాశీ అన్న పూర్ణా శ్రీనివాస్ దంపతులు వారిని కలిసి అభినందనలు తెలియ జేశా రు.వారి సారధ్యంలో ఆయా సామాజిక వర్గాలలోని పేదవారికి కార్పొరే ష న్ ద్వారా చేయూత అందించే అవకాశం తెలుగుదేశం పార్టీ గుర్తించి ఎం పిక చేయడం హర్షణీయమన్నారు.వివిధ సంద ర్భాలలో వారు చేసిన సేవల ను కొనియాడుతూ,భవిష్యత్తులో మరిన్ని సేవలు అందించాలని కోరారు.

# జాతీయ గ్రంథాలయ వారోత్సవాల బహుమతి ప్రధానోత్సవం



**మునగపాక, నవంబర్ 20, (ఆంధ్రపత్రిక):** 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా బహుమతి ప్రధానోత్సవం మునగపాక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి ఎల్వి.రమణ ఆధ్వర్యంలో మరియు గణపర్తి ప్రభుత్వ గ్రంథాలయంలో అటెండర్ ఎల్.అప్పలనరస ఆధ్వర్యంలో బుదవారం ఘనంగా జరిగింది. మునగపాక శాఖా గ్రంథాలయంలో ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి బి.శివనాయుడు పాల్గొని, ప్రసంగిస్తూ ప్రపంచంలో ఎంత టెక్నాలజీ పెరిగినప్పటికీ పుస్తకం విలువ తగ్గదని, పుస్తకం చదివినప్పుడు వచ్చే విజ్ఞానం గానీ, మానసిక ప్రశాంతత గాని ఎంతో విలువైనదని గ్రంథాలయాల్లో ప్రముఖుల జీవిత చరిత్రలు చదవడం వల్ల వారి స్ఫూర్తితో ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చని, సెల్ ఫోన్ వల్ల ఎంతో ఉపయోగం ఉన్నప్పటికీ, దుష్ప్రభావాలు కూడా ఎక్కువగానే ఉన్నా యని, కాబట్టి విద్యార్థులు ఎక్కువగా పుస్తకాలు చదవడానికి అలవాటు చేసుకోవాలన్నారు. జడ్పీహెచ్ స్కూల్ హెచ్ఎం ఎం.శ్రీనివాస రావు మాట్లాడుతూ పుస్తకాలు చదవడం వల్ల మంచి స్ఫూర్తి కలుగుతుందని, విద్యార్థుల్లోనే మంచి ప్రతిభావంతులు ఉన్నారని వారి ప్రతిభను పుస్తకాలు చదవడం ద్వారానే వెతికి తీయవచ్చు అని అన్నారు. వివిధ పోటీలలో గెలుపొందిన 50 మంది విజేతలకు అతిధులతో బహుమతులు అందజేయడం అయినది. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం పెంటకోట తులసిరావు మాస్టారు, మండల విద్యాశాఖ సిఆర్పి అచ్యుత కృష్ణ, ప్రణతి విద్యానికేతన్ కరస్పాండెంట్ సతీష్ వివిధ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. గణపతి ప్రభుత్వ గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయిని ఎం.జయలక్ష్మి మరియు మాజీ ఎంపీటీసీ సభ్యులు మారిశెట్టి వెంకట రమణ, హైస్కూల్ ఉపాధ్యాయులు ఆర్.రాంబాబు, పి.దేవుడు బాబు, ఎన్.సత్య శ్రీనివాస్, గ్రామ పెద్దలు చదరం లోవ పాల్గొని జయప్రదం చేశారు.

# గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమం

**అచ్యుతాపురం, నవంబర్ 20, (ఆంధ్రపత్రిక):** 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు అచ్యుతాపురం శాఖ గ్రంథాలయంలో ముగింపు కార్యక్రమాన్ని బుదవారం నిర్వహించడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అచ్యుతాపురం మండల పోలీస్ స్టేషన్ సిఐ గణేష్ మరియు జడ్పీహెచ్ స్కూల్ హెచ్ఎం శ్రీమతి ఎం. పద్మ మరియు అచ్యుత స్కూల్ కరస్పాండెంట్ తో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది. శేషగిరి మాస్టారు మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థులకు ఒక వెన్నెముక లాంటిది అని, ఈ గ్రంథాలయాల్లో ఉన్న గ్రంథాలన్నీ చదువుకోవడంతో పాటు కాంపిటేటివ్ ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు కూడా పుస్తకాలు అందుబాటులో ఉంటాయని ఆయన వివరించారు. తదుపరి సిఐ మాట్లాడుతూ ఈ గ్రంథాలయాల వలనే మేము కూడా ఈ ఉన్నత స్థాయికి రాగలిగాము అని, నా చిన్నతనం నుండి కూడా గ్రంథాలయాలు అంటే ఇష్టపడి చదువుకోటానికి సుమారు పది పదిహేను కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రంథాలయాలకు ప్రత్యేకంగా వెళ్లి చదువుకునేవాన్ని అంత కష్టపడి చదివినందు గాను నేను ఈరోజు సీఐ కాగలిగాను అంటూ గ్రంథాలయాలు ప్రాముఖ్యత గురుంచి గర్వంగా చెప్పుకొచ్చారు. తదుపరి హై స్కూల్ హెచ్ఎం ఎం పద్మ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు అందుబాటులో ఉంటుంది కాబట్టి ప్రతి ఒక్కరు కూడా గ్రంథాలయాన్ని అనుసరించి మీయొక్క ప్రతిభకు పట్టం కట్టేటట్టుగా చదువుకోవాలి అని, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తెచ్చుకుంటూ ఉన్నతమైన ఉద్యోగాలకు ఎదగాలని ఆమె వివరించారు .అనంతరం నవంబర్ 14 నుండి 20వ తేదీ వరకు కూడా వివిధ తరగతుల నుండి వచ్చిన విద్యార్థులకు పోటీ కార్యక్రమంలో గెలుపొందిన వారికి సిఐ గణేష్ చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేయబడింది .ఈ కార్యక్రమానికి వివిధ స్కూలు టీచర్స్ మరియు నిరుద్యోగ యువతపాల్గొని జయప్రదం చేశారు.

## ఘనంగా కామినేని నరేష్ పుట్టినరోజు వేడుకలు



**తిరువూరు నవంబర్ 20( ఆంధ్రపత్రిక):** వైఎస్ఆర్సిపి నాయకులు తిరువూరు మండల యువజన ప్రధాన కార్యదర్శి కామినేని నరేష్ పుట్టినరోజు వేడుకలు తిరువూరు పట్టణంలోని 15 వ వార్డు కౌన్సిలర్ మోదుగు ప్రసాద్ శిల్పకళశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ సీనియర్ నాయకులు మాజీ పి ఎ సి ఎస్ అధ్యక్షులు తాళ్లూరి నవీన్,15 వ వార్డు కౌన్సిలర్ మోదుగు ప్రసాద్,16 వ వార్డు ఇన్చార్జి తిరుమలశెట్టి,వేణు, టౌన్ పార్టీ ఉపాధ్యక్షుడు షేక్. రాజ్ మహమ్మద్, వైఎస్ఆర్సీపీ నాయకులు కాలసాని. నాగేశ్వరరావు ,13 వ వార్డు వైఎస్ఆర్సీపీ నాయకులు ఇనపనూరి.రవి పాల్గొని భారీ కేకును కట్ చేసి అనంతరం తాళూరి నవీన్ మాట్లాడుతూ కామినేని నరేష్ ఇలాంటి పుట్టినరోజు వేడుక లు మరెన్నో జరుపుకోవాలని నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో ఉండి భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులను పొందాలని ఆకాంక్షించారు.

## శావలదేవదత్ ప్రమాణ స్వీకారానికి హాజరైన తిరువూరు మాజీ ఏఎంసి చైర్మన్ అలవాల రమేష్ రెడ్డి




**ఎ.కొండూరు నవంబర్ 20( ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ గా తిరువూరు నియోజవర్గ తెలుగు దేశం పార్టీ మాజీ ఇన్చార్జ్ శావలదేవదత్ ప్రమాణ స్వీకారం గుంటూరు ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తిరువూరు మాజీ ఏఎంసీ చైర్మన్ అలవాల రమేష్ రెడ్డి పాల్గొని శావల దేవదత్ కు శుభాకాంక్షలు తెలిపి పూల బొకే అందజేసి శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అలవాల రమేష్ రెడ్డి మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అభ్యర్థుల గెలుపు కోసం శావల దేవదత్ చేసిన కృషి త్యాగం మర్చిపోలేమన్నారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులను పొంది ఎన్డీఏ కూటమికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

# బార్లను తలపిస్తున్న మద్యం షాపులు

### ఉదయం నుండే బార్లా తెరిచేస్తున్న తలుపులు

### సమయపాలన పాటించకుండా అడ్డగోలుగా అక్రమాలు-అయితే మాకేంటి అంటున్న అధికారులు




**కాకినాడ, నవంబర్ 20 (ఆంధ్రపత్రిక) :** కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన మద్యం పాలసీ లైసెన్సీలకు కాసుల వర్షం కురిపిస్తోంది. లక్షలు పెట్టాం, కోట్లు కొల్లగొడతాం అంటూ లైసెన్సీలు తొడ కొడుతున్నా అధికారులు మాత్రం మాకేం తెలియదు మేమేం చూడలేదు అన్నట్లుగా అటువైపు తిరిగి చూడడంలేదు. అయితే ఒక్కోసారి ఉరుము ఉరిమి మంగలం మీద పడ్డట్లుగా నాలుగు నిబ్బులతో దొరికినవాన్ని పట్టుకుని ఫొటోలకు ఫోజులిస్తూ గబ్బులేపుతున్నారు. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి బెల్టుషాపులు కనపడితే బెల్టు తీయండి అంటూ ఆదేశాలు జారీచేసినా అధికా రులు బెల్టులు తీయ కపోవడంతో బొజ్జలుబాగా పెరిగాయి. బెల్టు తీస్తే ప్యాంటు జారిపోతుందనేమో, లేక ఎక్సైజ్ అధికారులు బెల్టులు పెట్టుకోవడం మానేసారో అనే అను మానం కలుగుతోంది. ఇక ఇటీవల కొత్తగా మద్యం దుకాణాలు దక్కించుకు న్న వారి రొట్టె విరిగి నేతిలో పడ్డట్లుగా అయింది. తమకు సమయపాలన లేదు, తమకు పర్మిట్ రూములకు పర్మిషను అవసరంలేదు, మేము లేచిందే సమ యం, అమ్మిందే మందు అన్నట్లుగా ఉంది వారి వాలకం చూస్తుంటే. ఉదయం పదిగంటలకు తెర వ వలసిన షాపుల తలుపులు ఎనిమిది గంటలకే బార్లా తెరుచుకుంటున్నాయి. షాపు ప్రక్కనే మరో షాపును తీసుకుని బార్ ను తలపించేలా అన్ని హంగులూ ఏర్పాటు చేసి, మద్యం ప్రియులను రా రమ్మని ఆహ్వానించి సంక్రాంతి పండుగకు వచ్చిన కొత్త అల్లుడిలా అన్ని మద్యాదలూ చేస్తూ, అడిగిన బ్రాండు సరుకు ఫుల్ బాటిల్ ఓపెన్ చేసి లూజుగా వేసి ఇస్తున్నారు. దీనితోపాటుగా గ్లాసు, సోడా, వాటర్ ప్యాకెట్, బాటిల్, తినేందుకు జీడిపప్పు వేపుడు ఇతరత్రా ఏర్పాట్లు చేస్తున్నారు. వేళాపాళా లేకుండా మద్యం షాపులను తెరిచి లూజు విక్రయాలు సాగించినా అధికారులలో మాత్రం చలనం ఉండడంలేదు. మూడు నెలలు కర్రసాము నేర్చుకుని మూలన కూర్చున్న ముసల మ్మ నడుం విరగ్గొట్టినట్లుగా రెండు లేక మూడు క్వార్టర్ బాటిళ్లతో ముసలివాళ్లను పట్టుకొని అంతర్జాతీయ తీవ్రవాదిని పట్టుకున్నట్లుగా ఫొటోలకు ఫోజులివ్వడంతో ఆ శాఖ అధికా రులపై ప్రజలకు అసహ్యం పుడుతోంది. ఇది నిజంగా నిజం ఒకవేళ అనుమానం ఉంటే ఎక్సైజ్ అధికారులు నమోదు చేసిన కేసులలో యాభై, అరవై సంవత్సరాలు దాటినవారే ఉంటారన్నది ఇందుకు నిదర్శనం. కాకినాడ మండలంలో ఆరు మద్యం దుకాణాలు ఉండగా, గేటు సెంట రులోని మద్యం దుకాణంలో భారీగా అమ్మకాలు జరుగుతాయి. ఇక్కడ ఏ సమయంలో చూసినా షాపు ప్రక్కన ఉన్న మరోషాపులో లూజు విక్రయా లు కూడా భారీగానే జరుగుతున్నాయి.

ముఖ్యమంత్రి చెప్పినట్లుగా లూజు విక్రయాలు జరిపినా, బెల్టు షాపులను ప్రోత్సహించినా లైసెన్స్ ను కాన్సిల్ చేసేలా చర్యలు తీసుకోవాలని, అప్పుడే మద్యం సిండికేటు గాళ్లకు బుద్ది చెప్పనట్లు అవుతుందని స్థానిక ప్రజలు అభిప్రాయ పడుతున్నారు..

# కిమ్స్‌లో అందుబాటులో అత్యాధునిక వైద్య సేవలు

### -రాష్ట్రంలోనే తొలిసారిగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆధారిత ఓసిటి మరియు రొటాబ్యులేషన్ ద్వారా గుండె చికిత్సలు

### -కిమ్స్ సీఈవో, ఛీఫ్ కార్డియాలజస్ట్ డాక్టర్ రామరాజు బృందం వెల్లడి






**రాజమహేంద్రవరం,నవంబరు 20(ఆంధ్రపత్రిక):** ఎన్నో ఉన్నత అత్యాధునిక వైద్య విధానాలను అందుబాటులో ఉంచిన రాజమండ్రి కిమ్స్ బొల్లినేని హాస్పిటల్ యాజమాన్యం ఇప్పుడు అడ్వాన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారంగా చేసే ఓ సి టి వైద్య చికిత్స కూడా అందుబాటులోకి తెచ్చినట్లు కిమ్స్ సీఈవో, ఛీఫ్ కార్డియాలజస్ట్ డాక్టర్ ఎన్. రామరాజు చెప్పారు. ఇది రాష్ట్రంలోనే తొలిసారి రాజమండ్రిలో ఈ విధానం అందుబాటులో ఉందని తెలిపారు. కార్డియాలజి సర్జన్ డాక్టర్ సతీష్, కార్డియాలజిస్టులు డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ ఫణి తేజ, డాక్టర్ రేవంత్ డాక్టర్ చెన్నకేశవ మరియు కార్డియాక్ సర్జన్ డాక్టర్ పుష్యమి తదితరులతో కల్సి హోటల్ షెల్టాన్ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం సాయంత్రం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

2001లో బొల్లినేని కిమ్స్ ప్రారంభించి, యాంజియోగ్రామ్, బైపాస్ సర్జరీ, రోటా బ్లషన్ వంటివి చేయడానికి ముందుకొస్తే చాలామంది ఆశ్చర్యపోయారని, , హైద్రాబాద్, బెంగుళూరు లకు వెళ్లిపోతామని అన్నపుడు పేషేంట్స్ లో అవగాహన పెంచి ఇక్కడే ఆపరేషన్లు చేయడం ప్రారంభించామని డా రామరాజు గుర్తుచేసుకు న్నారు. తర్వాత కాలంలో డా సతీష్ చేరారని, హాస్పిటల్ లో ఇప్పటివరకు చేసిన ఆపరేషన్స్ లో 13వేల సర్జరీలు డా సతీష్ ఒక్కరే చేసి రికార్డు నెలకొల్పారని తెలిపారు. స్టెంట్స్ వేయడం, ఆపరేషన్లు చేయడం, బ్లాక్స్ ని క్లియర్ చేయ డం ఇలా ఎన్నో వైద్య విధానాలతో పేషేంట్స్ కి మంచి చికిత్స అందిస్తూ వస్తున్న కిమ్స్ ఇప్పుడు మరిన్ని కొత్త వైద్య విధాలను అందుబాటులోకి తెచ్చినట్లు డాక్టర్ రామరాజు వివరించారు. సాధార ణంగా వందమందిలో ఒక్క గుండె వ్యాధిగ్రస్తుడికి అయోర్టిక్ చాలా సన్నగా ఉంటు oదని, అటు వంటి గుండె వ్యాధిగ్రస్తులకు కూడా వాల్వులు రీప్లేస్మెంట్ చేసి రూట్ డైలేషన్ ప్రొసీజర్ ద్వారా ఇప్పటికీ పదిమంది గుండె వ్యాధిగ్రస్తులకి పైగా విజయవంతంగా అమర్చినట్లు డాక్టర్ రామ రాజు చెప్పారు. అలాగే అయో ర్టిక్ వాల్, అసెండింగ్ అయోర్ట్ రీప్లేస్మెంట్ ప్రొసీ జర్లు (బెంటల్ ప్రొసీజర్) హైదరాబాద్ లో మాత్రమే అందుబాటులో ఉండే దని అయితే ఈ ఆధునిక చికిత్స ఇప్పుడు కిమ్స్ బొల్లినేని హాస్పిటల్ లో కూడా అందుబాటులో ఉందని చెప్పడానికి సంతోషిస్తున్నామని ఆయన అన్నారు. బ్రెయిన్ స్ట్రోక్ , పునరావృత్త బ్రెయిన్ స్ట్రోక్ చికిత్స కు అవసరమైన కరోటేడ్ ఎండర్టెక్టమీ ప్రొసీజర్ కొంతమందికే అవసరపడే ఈ వైద్య విధానంతో దాదాపు 60 మంది వ్యాధిగ్రస్తులకు దిగ్విజయంగా చికిత్సలు అందించి, మెరుగైన జీవితాన్ని అందించినట్లు ఆయన తెలిపారు. అత్యాధునిక వైద్య విధానాలని రాజమండ్రి కిమ్స్ బొల్లినేని హాస్పిటల్ లో అందరికీ అందుబాటులో ఉంచి నందున వినియోగించుకోవాలని డాక్టర్ రామ రాజు కోరారు. ఈసం దర్బంగా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా గుండె రక్తనాళాలను శుద్ధిచేసి, స్టెంట్స్ ఎలా వేస్తారో, రక్తనాళాలు పగిలిపోయినపుడు, ఉబ్బినపుడు ఎలాంటి చికిత్స అందిస్తున్నామో వివరించారు.

# శ్రీ రామలింగేశ్వర స్వామి వార్షిక కళ్యాణ మహోత్సవ కరపత్రాలు ఆవిష్కరణ



**మునగపాక, నవంబర్ 20, (ఆంధ్రపత్రిక):** మండలంలో పాటిపల్లి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శ్రీ రామలింగేశ్వర స్వామి వారి వార్షిక కళ్యాణ మహోత్సవం ఈనెల 25వ తేదీ మరియు నాలుగవ కార్తీక సోమవారం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ తెలియజేశారు. ఈ సందర్భంగా కళ్యాణానికి సంబంధించిన కరపత్రాలను బుధవారం విడుదల చేశారు. అదేవిధంగా శనివారం ఉదయం 8 గంటలకు స్వామివారి కల్యాణరాట వేస్తున్నారని మరియు కళ్యాణం రోజు అనగా సోమవారం భారీ అన్న సమరాధన జరుగునని, సాయంత్రం ఐదు గంటలకు మంగళ వాయిద్యాలతో మేళతాళములతో గ్రామపురవీధులలో అమ్మవారికి మహిళా భక్తులచే సారే మరియు ఉత్సవ విగ్రహాలు ఊరేగింపు కలదని ఉత్సవ కమిటీ వారు తెలియజేశారు.

# రాష్ట్ర రోడ్లు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావుకి సత్కారము




**అచ్యుతాపురం, నవంబర్ 20, (ఆంధ్రపత్రిక):** ఎలమంచిలి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మరియు రాష్ట్ర రోడ్లు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావుని సత్కరించిన నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు పెంటకోట విజయ్ మరియు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సాయి కృష్ణ. బుదవారం జరిగిన ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాస్, మునగపాక హైస్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావు, మునగపాక గ్రామ పార్టీ అధ్యక్షుడు దాడి శివ, వెలగా మురళి, బుద్ధ వెంకటి, పెంటకోట కళ్యాణ్ దిలీప్ చక్రవర్తి, ఎదురు రాము పాల్గొని, అభినందనలు తెలియజేశారు.

## బండి ముత్యాలమ్మ భక్తుల హుండీ ఆదాయం రూ.13 లక్షల 53, 486 రూపాయలు



**మొగల్తూరు, నవంబర్ 20 (ఆంధ్రపత్రిక):** మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి భక్తులు హుండీ లెక్కింపు బుధవారం భీమవరం దేవాలయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో లెక్కింపు జరగగా 69 రోజులకు 13 లక్షల 53, వేల 486 రూపాయలు ఆదాయం లభించినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి మోకా అరుణ్ కుమార్ విలేకరులకు తెలిపారు.

అలాగే మరిడి మహాలక్ష్మి అమ్మవారి భక్తుల హుండీ లెక్కింపు నిర్వహించగా 69 రోజులకు 4.205 రూపాయల ఆదాయం లభించినట్లు ఈవో తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాజీ చైర్మన్లు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించాలి

### తాసిల్దార్ రాజ్ కిషోర్



**మొగల్తూరు, నవంబర్ 20 (ఆంధ్రపత్రిక):** ప్రజా సమస్యలు తక్షణం పరిష్కరించేందుకు అధికారులు కలిసి పనిచేయాలని మొగల్తూరు మండల తాసిల్దార్ కే రాజ్ కిషోర్ అన్నారు. బుధవారం స్థానిక తాసిల్దార్ కార్యాలయం నందు ఆయన మండల స్థాయి అధికారులకు నిర్వహించిన సమన్వయ సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో మొగల్తూరు ఎంపీడీవో చిటికెల త్రిశూల్ పాణి, మొగల్తూరు మండల బస్సు సంవర్ధన శాఖ అధికారిని గొట్టుముక్కల నీలిమ, మండల విద్యాశాఖ అధికారి 2 ఉన్నమట్ల శామ్యూల్ జాన్, ఎంపీడీవో కార్యాలయ ఈవోపీఆర్డినే నవీన్ కిరణ్, ఎంపీడీవో కార్యాలయ సూపర్డెంట్ ఎన్సిహెచ్ శ్రీనివాస్, పాల్గొన్నారు.

# 23 నుంచి సయ్యద్ ముస్తాక్ అలీ క్రికెట్ పోటీలు

### విశాఖ, విజయనగరంలో ఏర్పాట్లు పూర్తి

### ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ బాబు



**మధురవాడ, నవంబర్ 20 (ఆంధ్ర పత్రిక):** దేశవాలీ టీ20 క్రికెట్ టోర్నీ అయిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ పోటీలు విశాఖపట్నం పీఎంపాలెం ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, విజయనగరంలోని పీవీజీ రాజు కాంప్లెక్స్, విజ్జి స్టేడియంలలో ఈ నెల 23వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యదర్శి సానా సతీష్ బాబు తెలిపారు. ఈ మ్యాచ్‌లు డిసెంబర్ 5వ తేదీ వరకు జరుగుతాయని వెల్లడించారు. మ్యాచ్ నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. టోర్నమెంట్‌లో అస్సాం, రైల్వేస్, చండీగఢ్, పాండిచ్చేరి, విదర్భ, ఒడిస్సా, ఛత్తీస్‌గఢ్ జట్లు పోటీపడనున్నాయి. ఆయా జట్లు బుధవారం విశాఖపట్నం చేరుకున్నాయి. ఇండియా, ఐపీఎల్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆటగాళ్లు ఇందులో పాల్గొననున్నారు.

## జి.సి.సి చైర్మన్ కిడారిని కలిసిన గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి



**వేపాడ,నవంబర్,20(ఆంధ్రపత్రిక):** రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కిడారి శ్రావణకుమార్ ను రాష్ట్ర గిరిజన కో -ఆపరేటివ్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి లక్ష్మి బుధవారం శృంగవరపుకోటలో మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయనతో కలిసి పట్టణంలోని పలు గిడ్డంగులను పరిశీలించారు.అదేవిదంగా గిడ్డంగుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కిడారి తెలిపారు.గిడ్డంగుల మరమ్మత్తులకు ప్రత్యేక నిధులు కేటాయించే విధంగా ప్రభుత్వాన్ని కోరుతానన్నారు.ఈ కార్యక్రమంలో శృంగవరపుకోట తెదేపా మండల పార్టీ అధ్యక్షులు జి.ఎస్.ఎ నాయుడు,పలువురు తెదేపా నాయుకులు పాల్గొన్నారు.

## రేబాకలో విఘ్నేశ్వర దేవాలయం 14వ వార్షికోత్సవ వేడుకలు



**అనకాపల్లి,నవంబర్,20(ఆంధ్రపత్రిక):** మండలం రేబాక గ్రామంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ రేబాక చిన్నారావు ధన సహాయంతో 2011వ సంవత్సరం నవంబర్ 20వ తేదీన గణపతి విగ్రహాన్ని ప్రతిష్టించి దేవాలయాన్ని నిర్మించడం జరిగింది,అప్పటి నుండి ప్రతి సంవత్సరం వార్షికోత్సవ వేడుకలు జరుగుచున్నాయి.. నవంబర్ 20వ తేదీన వార్షికోత్స వేడుకల్లో భాగంగా ఈరోజు ఉదయం విఘ్నేశ్వర దేవాలయంలో మూలవిరాటకు అబిషేకాలు, అర్చనలు, పూజలు గణపతి హోమం నిర్వహించారు అనంతరం మామిడి చిన్నారావు దన సహాయంతో సుమారు 2000 మందికి అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ కార్యాలయం కార్యదర్శి బొలిశెట్టి శ్రీనివాసరావు మామిడి చిన్నారావు అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు.. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ విఘ్నాలు తొలగించి శుభాలు కలిగించే విఘ్నేశ్వర దేవాలయం నిర్మించడం శుభపరిణామం దేవాలయాలయాలకు సేవ చేయడం..భగవన్నామాన్ని కొలవడం పూర్వజన్న సుకృతం...అన్ని దానాల కంటే అన్న దానం ఎంతో పుణ్యఫలమైనదని అన్నారు.. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం గణపతి గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సతీమణి సునీత



**మొగల్తూరు ,నవంబర్, 20 (ఆంధ్ర పత్రిక):** బండి ముత్యాలమ్మ అమ్మవారిని ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ విప్. నరసాపురం శాసన సభ్యులు బొమ్మిడి నాయ కర్ సతీమణి బొమ్మిడి సునీత బుధవారం దర్శించుకున్నారు. ఆలయ ఈ వో మోకా అరుణ్ కుమార్ ఆమెకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. పూజలు జరిపించి అనంతరం లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. ఆమె వెంట జనసేన పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నాడు మాటిచ్చారు..నేడు అమలుకు శ్రీకారం చుట్టారు

## అసెంబ్లీ వేదికగా హామీల అమలుకు కృషి- ఎమ్మెల్యే కోళ్ళ పనితీరు పట్ల ప్రశంసల జల్లు





**వేపాడ,నవంబర్,20(ఆంధ్రపత్రిక):**ఎన్నికల సందర్భంగా రాజకీయ నాయకులు హామీలిస్తారు. తీరా అధికారంలోకి వచ్చేక ముఖం చాటేస్తారు. నేటి తరం రాజకీయ నాయకుల్లో అధిక శాతం మంది ఈ పనితీరును అలవాటుగా చేసుకున్నారు.ఎన్నికలప్పుడు ఎలాగూ ఓటర్లకు దబ్బిచ్చే ఓట్లు వేయించుకున్నాం కదా అన్న భావనతో ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి వెనకడుగు వేస్తుంటారు.అటువంటి నాయకులు ఎమ్మెల్యేగా ఒకసారిమాత్రమే గెలుస్తున్నారు. రెండో సారి ఎమ్మెల్యేగా గెలుపొందడం గగనమేనని చెప్పక తప్పదు.అయితే శృంగవరపుకోట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి చెందిన కోళ్ళ లలితకుమారి కుటుంబీకుల రాజకీయాలు ఇతర పార్టీల నాయ కుల రాజకీయాలకు భిన్నంగా ఉంటాయని చెప్పక తప్పదు.ప్రస్తుత ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి తాతగారైన మాజీ మంత్రి స్వర్గీయ కోళ్ళ అప్పల నాయుడు బాటలో నడుస్తూ తనదైన శైలిలో రాజకీ యాలు నెరుపుతూ ప్రజ మన్ననలు పొందడంలో తనదైన ముద్ర వేసుకున్నారు.అది అలా ఉంచితే ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచిన కోళ్ళ లలిత కుమారి ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీల అమలు దిశగా అడుగులు వేస్తున్నారనడంలో సందే హం లేదు. అందుకోసం అసెంబ్లీ వేదికగా హామీల అమలుకు విశే ష కృషి చేస్తున్నారు. అసె ంబ్లీ సమావేశాలను తన కు అనుకూలంగా మార్చుకుని ఇచ్చిన హామీలను ప్రభుత్వం దృష్టి కి తీసుకు వెళ్లడ ంలో విజయం సాధించా ర ని చెప్పక తప్పదు. నియోజక వర్గంలోని గిరి జన గ్రామాలకు రహదారులు లేకపోవడం, రోగాల బారి న పడినప్పుడు ఆస్పత్రులకు రోగు లను తరలించేందుకు అవసరమైన ఫీడర్ అంబులెన్సులను ఎక్కువ గా కేటాయించాలని కోరుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లారు. అలాగే నియోజకవర్గంలోకి కొత్తవలసలో డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని,అందుకు అవసరమైన ఐదు ఎకరాల స్థలం సిద్ధంగా ఉందని, గత ప్రభుత్వం విశాఖ పార్లమెంట్ పరిధిలో గల ఎస్.కోట నియోజకవర్గాన్ని విశాఖ జిల్లాలోనే ఉంచుతామని చెప్పి విజయ నగరం జిల్లాలోనే ఉంచి నియోజకవర్గ ప్రజలను మోసగించి న నేపథ్యంలో తాము ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు ఎస్కోటను విశాఖ జిల్లాలో విలీనం చేయాలని కోరడం పట్ల నియో జకవర్గ ప్రజలు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.అలాగే రైతు బాంధ వుడు, తాటిపూడి జలాశయానికి భూదానం చేసిన మహనీయుడు స్వర్గీయ గొర్రిపోటు బుచ్చిఅప్పారావు పేరును తాటిపూడి జలాశ యానికి కొనసాగించాలని అసెంబ్లీ వేదికగా కోరడం ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి రాజకీయ పరిపక్వతకు అద్దం పట్టిందని చెప్పవచ్చు. అలాగే పార్టీ అధిష్టానం వద్ద తన పట్టును నిరూపించుకోవడంలో కూడా సఫలీకృతం అయ్యారు.పార్టీ పురోభివృద్ధి కోసం అహర్నిశలు కష్టించి పని చేసిన నాయకులకు పలు కార్పొరేషన్ లో పదవులు కట్టబెట్టడంలో కూడా విజయం సాధించారు.నియోజకవర్గంలోని ఎల్.కోట మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మళ్ళా రామకృష్ణకు రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ గాను,వేపాడ మండలం సోంపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ దాసరి లక్ష్మికి రాష్ట్ర గిరిజన కో -ఆపరేటివ్ కార్పొరేషన్ డైరెక్టర్ గాను,జామి మండలం రామయ్యపాలెం గ్రామానికి చెందిన మాకిరెడ్డి లక్ష్మికి రాష్ట్ర కొప్పలవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గాను పదవులు కట్టబెట్టి పార్టీ బలోపేతం చేయడంలో విశేష పనితీరు కనబర్చారు.

**హామీలు అమలుకు ఎమ్మెల్యే కోళ్ళ కృషి ప్రశంసనీయం:-** (టీడీపీ సీనియర్ నేత గొగాడ) ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ఎస్ కోట ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి కృషి ప్రశంసనీయమని టీడీపీ సీనియర్ నేత గొగాడ జగన్నాధం నాయుడు అన్నారు.అసెంబ్లీలో హామీలను,సమస్యలను ప్రస్తావించడమే కాకుండా అమలు చేయించి తీరుతారన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

**మాటలు చెప్పడమే కాకుండా చేతల్లో నిరూపించారు:-** (మండల టీడీపీ ఉపాధ్యక్షుడు పోతల వెంకటరమణ)రాజకీయాలు కంటే ప్రజాసేవే మిన్నగా భావించే ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి మా టలు చెప్పడమే కాకుండా చేతల్లో నిరూపించారని మండల టీడీపీ ఉపాధ్యక్షుడు పోతల వెంకటరమణ అన్నారు.సీఎం చంద్రబాబు నాయుడు,మంత్రి లోకేష్, జిల్లా మంత్రి కొండపల్లి ఆశీస్సులతో నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి చూపిస్తారని అభిప్రాయ పడ్డారు.

**పదవుల పంపకంలో సమతుల్యం:-** (మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణ మూర్తి)పార్టీ బలోపేతం దిశగా పదవుల పంపిణీలో ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి సమతుల్యం పాటించడం హర్షణీయమని మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణ మూర్తి అన్నారు.అలాగే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు అసెంబ్లీలో ప్రస్తావించి ప్రజా నాయకురాలిగా మంచి గుర్తింపు పొందడం హర్షణీయమన్నారు.

# క్రీడాశాఖ మంత్రి హయాంలో క్రీడలకు బ్రహ్మారథం పట్టాలని మంత్రిని కోరిన స్పీకర్

## ఎనిమిదో రోజు శాసనసభ సమావేశంలో రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**అమరావతి, నవంబర్,20(ఆంధ్రపత్రిక):** స్పోర్ట్స్ మంత్రి ఆధ్వర్యంలో క్రీడలకు బ్రహ్మరధం పట్టాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు మంత్రిని కోరారు. ఎనిమిదో రోజు శాసనసభ సమావేశల లో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి , మహమ్మద్ నజీర్ అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సమాధానాలు ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 163 స్టేడియం ఉన్నాయాని, 2019 -24 గత వైసీపీ ప్రభుత్వంలో కేవలం 9 స్టేడియాలు మంజూరు చేయగా 6 మాత్రమే పూర్తి చేశారని, మన ప్రభుత్వం వచ్చిన 4 నెలలోనే 16 నూతన స్టేడియాల కొరకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. బ్రహ్మానంద రెడ్డి స్టేడియం గత 20 సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురికాలేదని, జాతీయ స్థాయి ప్రామాణీకలతో జిమ్నాస్టిక్స్ హాల్ , మరియు నాలుగు అంతస్తుల భవనాన్ని నిర్మిం చమన్నారు. ఎప్పటికప్పుడు మరమత్తులు చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం 68 లక్షల రూపాయలతో షాపింగ్ కొంప్లెక్స్ మరియు 35 లక్షలతో క్రికెట్ మైదానాన్ని నిర్మిస్తున్నామని, సత్యసాయి జిల్లాలో మైదానం నిర్మాణానికి చర్యలు కొనసాగుతున్నాయాని, ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా 2 నుంచి 3 శాతానికి పెంచామని. బ్రహ్మానంద రెడ్డి స్టేడియాన్ని అత్యున్నతంగా తీర్చుదిద్దుతామని, సత్తెనపల్లిలో స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి జవాబులు తెలిపారు.

# రబీలోసాగుకు విత్తనాలు అర్.ఎస్.కె.లలో ఉన్నాయి

## -మండల వ్యవసాయశాఖ అధికారి సోమశేఖర్



**కె.కోటపాడు,నవంబర్20(ఆంధ్రపత్రిక):** రబీ కాలంలో సాగుకు అవసరమైన వేరు శనగ, పెసర, మినుము విత్తనాలు అన్ని రైతు సేవ కేంద్రాలలో అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం.వి. సోమశేఖర్ తెలిపారు. మండలం లో ని సింగందొరపాలెం గ్రామంలో బుధవారం పొల ంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లా డు తూ ప్రధాన మంత్రి కిసాన్ యోజన్, పంటల బీమా గురించి రైతులకు వివరించారు. రైతులపొలాల్లో క్షేత్రపరిశీలన చేశారు. ప్రస్తుతం ఉధృతంగా ఉన్న "రెల్లురాల్చు పురుగు" నియంత్రణకు "పెర్మిత్రిన్" మందు ఎకరానికి 250మిల్లీలీటర్లు(పావు లీటరు) వాడడంద్వారా గింజ లుగట్టిపడిన దశలో పురుగును నియంత్రించ వచ్చున్నారు. ఒకవేళ గింజ ఇంకా కొంచెంపచ్చిగా ఉన్నప్పుడు "బైఫెంత్రిన్" అనే మందు ను ఎకరానికి 500 మిల్లీ లీటర్లు (అర లీటరు)పిచికారి చేయడం ద్వారా "రెళ్ళురాల్చు" పురుగుతోపాటు "కంకినల్లి, ఆకుముడత" పురుగులనుకూడా కొంతవరకు నియంత్రించవచ్చున్నారు. పైరు కొంచెం పచ్చగా ఉన్నప్పు డు వాడితే మేలు అని రైతులకు సూచించారు.ఈ "రెల్లరాల్చు" పురుగు ముఖ్యంగా ఆర్.జి.ఎల్. వరి రకంలో ఉంది కనుక ఈ రకం వేసుకున్న రైతులు తమ వరిపొలాలను తరచూ జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. సాయం కాలంవేళలో ఈ పురుగు ఉధృతి ఉంటుందికనుక మధ్యాహ్నం వేళ నివారణ చర్యలను చేపట్టాలని రైతులకు ఎ.ఒ. సోమశేఖర్ సూచించారు. ఈ కార్యక్రమంలో వెలగల పైడం నాయుడు, రొంగలి నాయుడుబాబు, నారపాటి రవి, వీఏఏ ప్రణయ్ రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన 57వ గ్రంథాలయ వారోత్సవాలు



**వేపాడ,నవంబర్,20(ఆంధ్రపత్రిక):**మండలంలో గల శాఖా గ్రంథాలయంలో బుధవారం 57వ గ్రంథాలయ వారోత్సవాలు లైబ్రేరియన్ ఎం. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా ముగిసాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా మండల విద్యాశాఖ అధికారులు జి.జగదీశ్వరరావు,పి. బాల భాస్కరరావు పాల్గొని,జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో వారు విద్యార్థులకు గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు.విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకొని విజ్ఞానాన్ని విస్తృత పరుచుకోవాలని ఆకాంక్షించారు.విద్యార్థులు భవిష్యత్తుకు ఉన్నత బాటలు వేసుకుని లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. గ్రంథాలయాల సేవలను విస్తృత పరిచేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు.అనంతరం గ్రంథాలయాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన పలు పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మాజీ ఎంపీపీ దాసరి

## పలువురు టీడీపీ నేతల హర్షం



**వేపాడ,నవంబర్,20 (ఆంధ్రపత్రిక):** మండలంలోని సోంపురం గ్రామానికి చెందిన వేపాడ మాజీ ఎంపీపీ దాసరి లక్ష్మికి రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ గా ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి ఆశీస్సులతో గతంలో వేపాడ ఎంపీపీగా పదవిని అలంకరించిన దాసరి లక్ష్మి పార్టీ అధికారంలో లేనపుడు కూడా కోళ్ల అడుగుజాడల్లో నడుస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న నేప థ్యంలో గిరిజన కో - ఆపరేటివ్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి వరించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.ఈ సందర్భంగా ఆమె బుదవారం స్థానిక విలేఖరులతో మాట్లాడారు.ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి కోళ్ళ రాంప్రసాద్ దంపతుల ఆశీ స్సులతో పదవి వరించిందని వారికి నా కృతజ్ఞతాభివందనాలన్నారు. అలాగే సీఎం చంద్ర బాబు నాయుడు,డిప్యూటీ సి.ఎం కొణిదల పవన్ కళ్యాణ్,మంత్రి లోకేష్ బాబు,జిల్లా మంత్రి కొండపల్లి,విశాఖ ఎంపీ శ్రీభర త్‌లకు ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నారు.అలాగే వరించిన పదవికి వన్నెతెస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ నాయకులు కార్యకర్తలతో మమేకమై పని చేస్తానని దాసరి లక్ష్మి చెప్పారు.

### గ్రంథాలయ వారోత్సవ పోటీల్లో ప్రతిభ కనబరిచిన కౌముది విద్యార్థులు



**వేపాడ,నవంబర్,20(ఆంధ్రపత్రిక):**గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా ఎస్.కోట శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ దామోదర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు రకాల పోటీల్లో ఎస్.కోట కౌముది విద్యాలయ విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచారు.శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన పలు రకాల పోటీలలో పాల్గొన్న కౌమది పాఠశాల విద్యార్థులు 15 కి పైగా బహుమతులు గెలుపొందినట్లు ప్రిన్సిపాల్ శాంతి మహంతి బుధవారం తెలిపారు.ఈ మేరకు విజేతలకు ఎస్.కోట ఎంపీపీ సండి సోమేశ్వరరావు,వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాణి చేతుల మీదు గా బహుమతులు అందుకున్నట్లు తెలిపారు.ఈ మేరకు విజేతలకు పాఠ శాల సిబ్బంది తమ అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్.కోట సర్పంచ్ సంతోషి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోని బ్యాంకు మేనేజర్లు ప్రతినిధులతో సైబర్ క్రైమ్‌పై సమీక్షా సమావేశం

## జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా



**అనకాపల్లి, నవంబర్20(ఆంధ్రపత్రిక):** జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అనకాపల్లి జిల్లాలోని వివిధ బ్యాంకు మేనేజర్లు మరియు ప్రతినిధులతో సైబర్ క్రైమ్స్ పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సైబర్ క్రైమ్స్ పట్ల ప్రజలకు అవగాహన లేకపోవడం వలన నగదు కోల్పోతున్నార న్నారు.జిల్లా పోలీసులు, బ్యాంకుల సమన్వయంతో సైబర్ క్రైమ్స్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ప్రణాళిక సిద్ధం చేశారు. సైబర్ క్రైమ్స్ లో నగదు పోగొట్టుకున్న బాధితులకు అండగా ఉండి బ్యాంకులు, పోలీసులు సమన్వయంతో సంబం ధిత ఖాతాల నుండి ఇతర బ్యాంక్ ఖాతాలకు వెళ్లే నగదుకు సంబంధించి వారి యొక్క సమాచారాన్ని పోలీసులకి అంది వ్వడం ద్వారా బాధితులకు న్యాయం చేయవచ్చు అన్నారు. అలాగే బ్యాంకుల్లో జరిగే వివిధ నగదు లావాదేవీలు సంబంధించి 5 లక్షలు అంతకన్నా ఎక్కువ మొత్తంలో జరిగే ట్రాన్సాక్షన్ పై నిఘా పెట్టాలని సంబంధిత ఖాతాదారుల వివరాలు తెలుసుకున్న తర్వాత మాత్రమే ఆమోదించాలన్నారు. అనుమానస్పద మ్యూల్ అకౌంట్లో జరిగే లావాదేవీల పై నిఘా ఏర్పాటు చేసి వారి యొక్క సమాచారాన్ని పోలీసులకు అందజేయడం ద్వారా బాధితుల నగదకు భరోసా కల్పించవచ్చున్నారు. ఖాతాదారులకు సైబర్ క్రైమ్స్ పట్ల అవగాహన కల్పించాలని, జిల్లా పోలీసులు ఇప్పటికే పెద్ద ఎత్తున సైబర్ క్రైమ్స్ పై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. బ్యాంకులు మరియు ఏటీఎం సెంటర్ల వద్ద లోపలా, బయటా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడం దానికి సంబంధించిన డి.వి.ఆర్ లు సెంట్రలైజ్డ్ గా ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఏదైనా సంఘటన జరిగినప్పుడు నిందితులను గుర్తించేందుకు ఉపయోగపడుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. అలాగే అత్యవసర అలారం పని చేస్తున్నదీ... లేనిదీ బ్యాంక్ సిబ్బందికి తెలిసి ఉండాలన్నారు. అనుమానాస్పద ఖాతాల్లో జరిగే లావాదేవీలు ఏ ఏ ఖాతాలకు వెళ్తున్నవి ట్రాక్ చేయడం ద్వారా బాధితుల డబ్బు కు భరోసా కల్పించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు అదనపు ఎస్పి శ్రీ ఎల్.మోహన్ రావు, ఎస్.బి డీఎస్పీ బి.అప్పారావు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎం. శ్రావణి, సోషల్ మీడియా మరియు సైబర్ సెల్ ఇన్స్పెక్టర్ టీ.క ళ్యాణి, సైబర్ క్రైమ్ ఎస్సై బి.సురేష్ బాబు ఐటి కోర్ సిబ్బంది వివిధ లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కె.సత్యనారాయణ, ఎస్.బి. ఐ రీజినల్ మేనేజర్ శ్రీ కె.జగదీశ్వరరావు మరియు వివిధ బ్యాంక్ మేనేజర్లు మరియు ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాష్ట్రానికి కేంద్రం 2 లక్షల కోట్లు నిధులు మోడీ చలవే

## కొణతాల వెంకట్రావు



**అనకాపల్లి ,నవంబర్20(ఆంధ్రపత్రిక):** రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో ఎన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతి పురుందేశ్వరి కృషి ఫలితంగా రాష్ట్రానికి 2 లక్షల కోట్లు పైబడి ప్రాజెక్టులను మంజూరు చేశారని నిరుద్యోగ సమస్య నిర్మూలనకు కంకణం కట్టుకున్నారని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకొని ఆంధ్రప్రదేశ్ ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు కేంద్ర ప్రభుత్వాన్ని కొనియాడారు. అమరావతిని నాశనం చేయాలని చూసినా జగన్ రెడ్డి ప్రభుత్వం ఎంత ఎన్ని ప్రయత్నాలు చేసినా రైతుల త్యాగాలను ప్రజలు మరిచిపోలేదని, ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పి కూటమికి అధికారం కట్టబట్టిన ఫలితంగా అమరావతి నిధులు ప్రవాహం వచ్చిందని, అమరావతికి రాష్ట్రంలో వివిధ జిల్లాలలో కేంద్రం నిధులు మంజూరు చేస్తుందని, ముఖ్యంగా పోలవరం ప్రాజెక్ట్, అమరావతి, ఒకే చోట అభివృద్ధి కాకుండా అభివృద్ధి వికేంద్రీకరణకు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు కంకణం కట్టుకున్నారని, రాష్ట్రీ యప్తంగా అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నారని, దీని మూ లంగా అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెంది, ఆయా ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్యతగ్గుతుందని, ఏ ఏ ప్రాంతాల్లో అభివృద్ధి చేయాలో నిర్దిష్టమైన ప్రణాళికను రూపొం దించారని, 26 జిల్లాలో రానున్న నాలుగున్నర సంవత్సరాల కాలంలో నిరుద్యోగ సమస్య నిర్మూలనకు కంకణం కట్టుకున్నాం"ని, 20 లక్షలు ఉద్యో గాలు హామీ నెరవేరబోతుందని, వెంకట రావు అన్నారు. శ్రీ భోగిలింగేశ్వర దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్య నారాయణ మాట్లాడుతూ అమరావతికి ప్రపంచబ్యాంక్, ఎడిబి, కలిసి 15000 కోట్లు మంజూరు చేశారని, ఇది గ్రాంట్, అప్పు అని ఇంకా ఇంకా ప్రశ్నలు వేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వ ం స్పష్టంగా ఆంధ్రప్రదేశ్ కి పూర్తిగా కేంద్రమే భరిస్తుందని ఆర్థిక శాఖా మంత్రి నిర్మల సీతారాం స్పష్టం చేశారని, ఇంకా వైసీపీ కమ్యూనిస్టులు ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని వెంకట రావు అన్నారు. 2 లక్షల కోట్లు ప్రాజెక్టుల్లో అత్యధికంగా రైల్వే లైన్, డబ్లింగ్ పనులు, విజయవాడ నుంచి అమరావతికి ప్రత్యేక రైల్వే లైన్స్, రైల్వేస్టేషన్‌ల ఆధునీకరణ,75000 కోట్లు రైల్వేకే కేటాయించడం జరిగిందని, విశాఖ రైల్వే జోన్, అమరావతిలో మెడికల్ కాలేజీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, రాష్ట్రానికి 11 ఈఎస్ఐ హాస్పిటల్ లు, పోర్టులు, గతంలో నిరాశ నిస్పృహలతో తో ఉన్న పారిశ్రామికవేత్తలు నేడు చంద్రబాబునాయుడు విజన్ చూసి, పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీ విషయంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నారని, రాష్ట్రానికి శుభ పరిణామని, స్పీడ్ అఫ్ డూయింగ్ విధానాన్ని తీసుకొచ్చి పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబుపై నమ్మకంతో అత్యంత వేగంగా రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయు లు చేసుకుంటున్నారని వెంకట రావు అన్నారు. బిజెపి నాయకులు బొడ్డేడ అప్పల నరసయ్య పాల్గొన్నారు.

# క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలుగా స్వర్ణకారుల సంఘం



**అనకాపల్లి ,నవంబర్20(ఆంధ్రపత్రిక):** శ్రీ కంచి కామాక్షి స్వర్ణ కార సంఘం గాజువాక వారి అద్వర్యంలో ఈనెల 17 జరి గిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ లో అనకాపల్లి స్వర్ణ కార సంఘం విన్నర్ (మొదట బహుమతి)గా గెలుపొందారు,ఈ టోర్నమెంట్‌లో గాజువాక విజయనగరం అనకాపల్లి తుని నర్సీ పట్నం జట్లులు మధ్య జరిగిన టోర్నమెంట్లో అనకాపల్లి టీమ్ ఫైనల్ లో గాజువాక టీమ్ మీద గెలిచి టోర్న మెంట్ విజేతలు గా నిలిచారు.ఈ టోర్నమెంట్‌లో బెస్ట్ బ్యాట్స్ మెన్ గా ముక్కాల రాజ శేఖర్ నిలి చా రు మరియు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కుడా ఆయ నకి వచ్చింది అలాగే బెస్ట్ బౌలర్ గా కణితి ఉమా. ఈ జట్టు కి ఆములోజు శ్రీను కెప్టెన్ గా వ్యవహారించి టీమ్ ని ముందుకి నడిపారు.ఈ జట్టులో ఎ.శ్రీను, టి.రవి, రాజా, పి.శ్రీను, కృష్ణా,శేఖర్, శివ, నాగబాబు, హరీష్,సాయి, భాస్కర్,కె.ఉమా, శ్రీనివాస్, ప్రసాద్,భార్గవ్,వేణు,జగదీష్,మోహన్ సభ్యులు పాల్గొన్నారు. అనకాపల్లి స్వర్ణకార సంఘం ట్రోఫీ విజేతగా సత్కరించి, అభినందించారు. విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షులు కోటిపల్లి జేజిబాబు స్వర్ణకార సంఘం గౌరవ అధ్యక్షులు మత్తుర్తి గంగారాము, తణుకు రవికుమార్ కిల్లాడి శ్రీనివాసరావు దోసూరు చంద్రశేఖర పొన్నాడ పెదబాబు కొమ్మోజి గోవిందరాజు కోటిపల్లి శ్రీను పెదపాటి శీను పాల్గొన్నారు.

# స్మార్ట్ మీటర్లు బిగించడం తక్షణం నిలుపుదల చేయాలని డిమాండ్



**అనకాపల్లి ,నవంబర్20 (ఆంధ్ర పత్రిక):** వ్యవసాయ బోర్లకు, గృహాలకు, వాణిజ్య సముదాయాలకు బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను తక్షణం నిలిపివేయాలని అనకాపల్లి విద్యుత్ శాఖ సూపరేంటింగ్ ఇంజనీర్ (ఆపరేషన్) జి .ప్రసాద్ కు సిపిఐ జోనల్ కార్యదర్శి వై .ఎన్ .భద్రం, మండల కార్యదర్శి చెల్లూరు నాగరాజు, సిపిఐ నాయకులు కోరుబిల్లి శం కర్రావు, శ్రీరామదాసు అబ్బులు, కొమనాపల్లి వెంకటరమణ తదితరులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైయస్సార్ ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల బిగిస్తే పగలగొట్టండి అని ప్రజలకుఆనాడు పిలుపునిచ్చిన నేటి తెలుగుదేశం పార్టీ మంత్రి నారా లోకేష్ తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగిస్మార్ట్ మీటర్లు బిగించడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని కూటమి నాయకులు వాగ్దానం చేసి ఓట్లు వేయించుకొని అధికారం వచ్చాక2019 సం" నుండి సర్దుబాటు చార్జీల పేరుతో వేలకోట్ల రూపాయలు పేద ప్రజల నుండి ముక్కు పిండి వసూలు చేస్తున్నారని విమర్శించారు. వ్యవసాయ పంపుసెట్లకుఉచిత విద్యుత్తు ప్రకటించిన ప్రభుత్వం ఇప్పుడు స్మార్ట్ మీటర్లు బిగించడంలో కుట్ర దాగి ఉందని రానున్న కాలంలో ట్రూ ఆఫ్ చార్జీలు (సర్దుబాటు) లాగే వసూలు చేసే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గృహ సముదాయాలు కూడా గుట్టుచప్పుడు కాకుండా ఈ స్మార్ట్ మీటర్లు బిగించి పేద మధ్యతరగతి ప్రజలను దోచుకోవాలని చూడండం ప్రజలను మోసం చేయడమే అన్నారు. వెంటనే స్మార్ట్ మీటర్లు బిగించడం నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. గృహాలకు మీటర్ల బిగిస్తే ప్రతి ఘటన తప్పదని ప్రజలే మీటర్లను పగలగొట్టవలసిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. అంతేగాక మీటర్ రీడర్స్, విద్యుత్ ఉద్యోగులను తొలగించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ప్రజలకు ఉపయోగపడేలాగా ఉండాలి గాని జీవించే హక్కును హరించేదిగా ఉండకూడదు అన్నారు. మొండికేసి స్మార్ట్ మీటర్లు బిగిస్తే గత వైఎస్ ఆర్సిపి కి పట్టిన గతే కూటమి ప్రభుత్వం వస్తుందని హెచ్చరించారు. సూపరిండెంట్ ఇంజనీర్ ప్రసాద్ మాట్లాడుతూ గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగించబోమని తెలిపారు. ఆఫీసులకు వాణిజ్య సముదాయాలకు మాత్రమే బిగిస్తున్నామని వారు నిరాకరిస్తే, బలవంతం చేయమన్నారు.

# టోల్ చార్జీలు ప్రజలపై పెను భారం రాష్ట్ర ప్రభుత్వం కుట్ర




**అనకాపల్లి ,నవంబర్20 (ఆంధ్ర పత్రిక):** రాష్ట్ర శాసనసభలో జిల్లా రోడ్లు కూడా టోల్గేట్స్ పెట్టి టెక్స్ వసూలు చేయాలి అని నిర్ణయించడానికి సిపిఎం పార్టీ అనకాపల్లి మండల కమిటీ తీవ్రంగా ఖండిస్తుంది. అనకాపల్లి దొడ్డి రామా నాయుడు భవన్ లో సిపిఎం పార్టీ సమావేశంలో మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం జిల్లా రోడ్లకు కూడా టాక్సీ వసూలు చేయా లని నిర్ణయించడం దుర్మార్గం అన్నారు. దీని సిపిఎం పార్టీ తీవ్రంగా ఖండి స్తుం దన్నారు. ఇప్పటికే వాహనాలుకు టాక్సీలు వసూలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా టోల్ గేట్ల ద్వారా కోత్తగా ప్రజలుపై భారాలను మోపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికే టు అప్ చార్జీలు పేరుతో 20,000 కోట్లు రూపాయలు కరెంట్ చార్జీలు పెంచడానికి ప్రయత్నిస్తున్నారని ఇప్పు డు టోల్ ఛార్జింగ్ పేరుతో బారాలు మోపడం సరి కాదన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తా మని చెప్పి ఇప్పుడు ప్రజల పై భారాలు మోపడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో శాంతి భద్రతలు సమస్యలు బాగా లేవని ఉపముఖ్యమంత్రి స్వయంగా చెప్పారని, విశాఖలో లా విద్యార్థిపై నలుగురు సాముహిక అత్యాచారానికి పాల్పడ్డారని ఇలాంటి సంఘటన రోజు రోజుకి పెరుగు తున్నాయని అయి నప్పటికీ ప్రభుత్వ చర్యలు సరిగా లేవన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వీటిపై సక్రమ ంగా స్పందించాలని లేదంటే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కె.తేలయ్యబాబు, బోప్పే ఉమా మహేశ్వరరావు, జి. సుభాషి ణి, బుగిడి నూక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### బండి ముత్యాలమ్మ వారిని దర్శించుకున్న వైస్ చైర్మన్ భుజంగరాయుడు



**మొగల్తూరు ,నవంబర్ 20 (ఆంధ్రపత్రిక):** పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలో బండి ముత్యాలమ్మ అమ్మవారిని నరసాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్తపల్లి భుజంగ రాయుడు బుధవారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట కొల్లాటి నాగరాజు, దొంగ స్వామి తదితరులు ఉన్నారు.

# విశాఖ నగర వాతావరణ మార్పుకు జివిఎంసి ప్రత్యేక కార్యాచరణ

## -విశాఖ నగర మేయరు గొలగాని హరి వెంకటకుమారి

**విశాఖపట్నం, నవంబరు 20 (ఆంధ్రపత్రిక):** ప్రపంచ వ్యాప్తంగా నగరాలలో గణనీయంగా వాతావరణం మార్పులు చెంది ప్రజల జీవన ప్రమాణాలపై ప్రభావం చూపుతుందని, ఇది నగ్రరలకు ఒక సవాలు గా మారిందని, విశాఖ నగర వాతావరణం మార్పు పై జివిఎంసి ప్రత్యేక కార్యాచరణ చేపడుతోందని విశాఖ నగర మేయరు గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. మంగళవారం ఆమె జివిఎంసి ఆధ్వర్యం లో ఐసీ ఎల్ ఈ ఐ ఆర్గనైజేషన్ క్లైమేట్ యాక్షన్ పై రెసిలిఎన్ట్ సిటీస్ ప్లానింగ్, ఆచరణ కొరకు ఆంధ్రప్రదేశ్ లో 3 నగరాలైన విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ యొక్క ప్రాజెక్టుకు సంబంధించి ఏర్పాటు చేసిన వర్క్ షాప్ నందు ముఖ్య అతిధి గా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో నగర మేయర్ మాట్లాడుతూ, క్లైమేట్ చేంజ్ కారణంగా గ్లోబల్ టెంపరేచర్స్ పెరుగుతుండడం వలన సముద్ర మట్టం పెరగడం, తీవ్ర వాతావరణ సంఘటనలు, వరదలు, కరువు, తుఫాన్లు, వాయు కాలుష్యం వంటి ప్రభావాలను పెంచుతుందన్నారు. ఇప్పటికే భారత దేశం లో గల నగరాలు వరదలు, తుపానులు, తీవ్రమైన శీతాకాలాలు, తీవ్రమైన వేడి తరంగాలకు గురవుతున్నాయని, వీటి తీవ్రత పెరుగుతూ వస్తోందన్నారు. విశాఖపట్నం ఒక తీరప్రాంత పరిశ్రమ నగరంగా పలు ప్రమాదాలు మరియు విపత్తులకు గురవుతోంది. పరిస్థితులు క్లైమేట్ చేంజ్ ప్రభావాల వల్ల మరింత తీవ్రంగా మారుతున్నాయని ప్రజల రక్షణ దిశగా విశాఖ నగర క్లైమేట్ చేంజ్‌ను ఎదుర్కొనడానికి ప్రభుత్వం పలు అనుసరణ మరియు నిరోధక చర్యలను తీసుకుంటోందన్నారు. విశాఖ నగరం ఇప్పటికే పునరుత్పాదక శక్తి వనరుల వినియోగంలో ముందంజలో ఉందని, జివిఎంసి 13 మెగావాట్ల సోలార్ శక్తి గరిష్ట సామర్థ్యం కలిగిన ప్లాంట్లను నీటిపై, భూమిపై మరియు రూఫ్ టాప్‌లపై ఏర్పాటు చేసి గ్రీన్ ఎనర్జీ ద్వారా నగరానికి కావలసిన అవసరాలను సమకూర్చుకుంటోందన్నారు. జివిఎంసి బీచ్ రోడ్ లో 3,000 సో




లార్ వీధి దీపాలను ఏర్పాటు చేసిందన్నారు. విశాఖపట్నంలో 28% గ్రీన్ కవర్ ఉందని మరింత పచ్చదనం ప్రజల సహకారం తో పెంపొందించేందుకు చర్యలు జివిఎంసి చేపడుతుందన్నారు. నగరం లో కాలుష్య నియంత్రణకు జివిఎంసి బీచ్ రోడ్‌లో ప్రజా రవాణా కోసం ఉచితంగా ఈ–ఆటోలు ప్రవేశపెట్టి, అలాగే ఇంటింటి నుండి చెత్త సేకరణ కోసం 65 ఈ–ఆటోలను వినియోగిస్తున్నామన్నారు. జీవన స్థిరత్వం మరియు రిజిలియన్స్ యూనిట్ నగరంలోని క్లైమేట్ రిస్క్ మేనేజ్‌మెంట్, అనుకూలత, నిరోధక చర్యలు, గ్రీన్ గ్రోత్ కోసం 'క్లైమేట్ సెల్' జివిఎంసి ఏర్పాటు చేసిందన్నారు. వికసిత భారత్ ఏ 2047 కేంద్ర ప్రభుత్వం భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడం లక్ష్యంగా ప్రారంభించిందని, దీనికి అనుగుణంగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వర్ణ ఆంధ్ర ఏ 2047 ను ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమంలో 12 ప్రధాన అంశాలలో ఒకటి 'క్లైమేట్ ఫస్ట్ అప్రోచ్'గా అభివృద్ధి లక్ష్యంగా ఉందని, సాంకేతిక సహాయంతో మన నగరాలు 'క్లైమేట్ రెసిలియంట్ సిటీ యాక్షన్ ప్లాన్' పథకాలను రూపొందించి, క్లైమేట్ ప్రభావాలను ఎదుర్కొనేలా మారుతా యని జివిఎంసి ఆశిస్తుందన్నారు. విశాఖపట్నాన్ని ఈ ప్రాజెక్ట్ నగరంగా ఎంపిక చేసినందుకు టీమ్‌కు మరియు నగరానికి వివిధ ప్రాజెక్టుల ద్వారా మద్దతు అందిస్తున్న జాతీయ పట్టణ వ్యవహారాల సంస్థకు ధన్యవాదాలు తెలియజే శారు. ఈ వర్క్ షాప్ లో పాల్గొనే నగరాల భాగస్వాములను క్లైమేట్ చేంజ్ పై తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మేయర్ విజ్ఞప్తి చేశారు. అనంతరం విశాఖపట్నం క్లైమేట్ చేంజ్ యాక్షన్ ప్లాన్ ను జీవీఎంసీ ఎస్ ఆరయు టీమ్ పిపిటి ద్వారా వివరించారు. అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అర్బన్ లో కార్బన్ మొబిలిటీ సోలార్ పవర్ చార్జింగ్ స్టేషన్ ఫర్ ఎలక్ట్రిక్ బస్సుల ప్రాజెక్టు గురించి, ఉదయపూర్ మున్సిపల్ కార్పొరేషన్ మియా వాకి అర్బన్ ఫారెస్ట్ గురించి, తమిళనాడు తిరునల్వేలి క్లైమేట్ యాక్షన్ ఎర్లీ వార్నింగ్ సిస్టం ఫర్ అర్బన్ ఫ్లడింగ్ ప్రాజెక్టుకు సంబంధించి ఆయా ప్రతినిధులు పి పి టి ద్వారా యాక్షన్ ప్లాన్ ను వివరించారు. అనంతరం జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ ఆర్.సోమ నారాయణ, ప్రధాన ఇంజనీర్ పి.శివప్రసాద్ రాజు, ఆర్గనైజేషన్ ప్రతినిధి ఈమని కుమార్, ప్రొఫెసర్ ఎస్.రామకృష్ణారావు, విజయవాడ అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు క్లైమేట్ చేంజ్ యాక్షన్ ప్లానింగ్ చర్చలలో పలు అంశాలపై చర్చించారు. ఈ వర్క్ షాప్ నందు విజ యవాడ మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ డి.చంద్రశేఖర రావు, మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ వారా రవీంద్ర, , శ్రీకాకుళం కమిషనర్ ప్రసాదరావు, విజయ నగరం మున్సిపల్ కమిషనర్ పీ. నల్లనయ్య, కాకినాడ కార్యనిర్వాహక ఇంజనీర్ మత్స్యరాజు, జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీర్ సంపత్ కుమార్, కార్యనిర్వాహక ఇంజనీర్లు ఏడుకొండలు, రత్నాకర్ రెడ్డి, జీవీఎంసీ కార్యదర్శి బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ల నిర్మాణాల పనుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

## కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్



**విశాఖపట్టణం, నవంబర్ 20 (ఆంధ్రపత్రిక):** ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనుల్లో మరింత పురోగతి సాధించాలని, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని, సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఇసుక సరఫరా, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిర్దేశిత లక్ష్యాల మేరకు ఇండ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు. ఇండ్ల నిర్మాణాల పనుల్లో వెనుకబడిన మండల అధికారుల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల ప్రత్యేక అధికారులు, లేఅవుట్ ఇన్ ఛార్జి అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని క్షేత్ర స్థాయి అధికారులకు తగిన సహకారం అందిస్తూ అప్రమత్తం చేస్తూ పనుల్లో జోరు పెంచాలన్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను సమన్వయంతో పరిష్కరించుకొని పురోగతి సాధించాలని సూచించారు. ఈ సమావేశంలో డిస్టిక్ హౌసింగ్ హెడ్ ఏ శ్రీనివాస రావు.,డి.ఈ కే సూర్యరావు, పిడి యు సి డి సత్యవేణి, జీవీఎంసీ ఎడిషనల్ కమిషనర్ బివి రమణమూర్తి, మండల్ ప్రత్యేక అధికారులు, ఏఈ లు ఇతర జిల్లా అధికారులుపాల్గొన్నారు.

# ముగిసిన జాతీయ గ్రంథాలయాల వారోత్సవాలు



**కె.కోటపాడు,నవంబర్20(ఆంధ్రపత్రిక):** గ్రంథాలయాలు జ్ఞాన జ్యోతులను వెలిగించే విజ్ఞానకేంద్రాలని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ఎస్.వి. పద్మావతి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిసాయి. ఈ ముగింపోత్సవంలో పాల్గొన్న పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు పద్మావతి మాట్లాడుతూ గ్రంథాలయాల వలన ప్రయోజనాలను తెలిపారు. శాఖా గ్రంథాలయ అధికారిణి కె.సౌమ్య ఆధ్వర్యంలో జరిగిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేత విద్యార్థులకు బహుమతులను హెచ్.ఎం.,ఉపాధ్యాయులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మండల మురళీకృష్ణ, ఎ.వి.రమణమ్మ, హిమబిందు, వ్యాయామ ఉపాధ్యాయురాలు లక్ష్మి పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# మండలంలో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను సందర్శించిన ఎంఈఓలు




**వేపాడ,నవంబర్,20(ఆంధ్రపత్రిక):** మండలంలోని వేపాడ,సోంపురం జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను మండల విద్యాశాఖ అధికారులు పి.బాల భాస్కరరావు, జి.జగదీశ్వరరావు సందర్శించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించేటప్పుడు టీచర్ లెర్నింగ్ మెటీరియల్ ను ఉపయోగించి బోధించాలని సూచించారు. తద్వారా విద్యార్థులు అభ్యసన, పఠనాసక్తిని పెంపొందించేందుకు దోహదపడుతుందన్నారు. ఉపాధ్యాయులు ప్రార్థన సమయానికి హాజరై విద్యార్థులకు ప్రార్థన యొక్క ప్రాధాన్యతను తెలపాలని సూచించారు. తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ డి కన్నయ్య,సెక్రటరీ సి. హెచ్ అర్జున్ రావు, వేపాడ,ఎల్ కోట మండల ఉపాధ్యాయులు,ఆర్.పి.టి రాంబాబు,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో చేపట్టిన ఆధునికీకరణ, అభివృద్ధి పనులను, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, గ్యాలెరీలను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలిస్తున్న దృశ్యం.



స్థానిక కొమ్మాదిలో ఉన్న ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్సును కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సందర్శించి, అక్కడి మౌలిక వసతులు, ఇతర పరిస్థితుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# 57వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం



**ప్రత్తిపాడు , నవంబర్ 20 (ఆంధ్రపత్రిక) :** ప్రత్తిపాడు కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం గెద్దనాపల్లి శాఖా గ్రంథాలయంలో ఈనెల 14వ తేదీ నుండి బుధవారం వరకు వారం రోజులు పాటు నిర్వహించిన 57వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది ఈ క్రమంలో జరిపిన వ్యాసరచన చిత్రలేఖనం పోటీలలో విజేతలకు స్థానిక పెద్దల సమక్షంలో ప్రశంసా పత్రాలు బహుమతులు పంపిణీ చేయడం జరిగింది కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని పుస్తక పఠనం ద్వారానే విజ్ఞాన సమూపార్జన జరుగుతుందన్నారు గ్రంథాలయ అధికారి దన్నిన శంకర్రావు మాట్లాడుతూ వారోత్సవాలు నిర్వహణకు వై అధికారులతో పాటు స్థానిక ఉద్యోగులు పెద్దలు ప్రజలు సహకరించారన్నారు గ్రంథాలయంలో విద్యార్థులకు పెద్దలకు మహిళలకు పలు రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు విద్యార్థులందరూ ప్రతినిత్యం గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేయడం వల్ల విజ్ఞానంతో పాటు ప్రపంచంలో జరుగుతున్న అనేక విషయాలు అవగాహన చేసుకోవచ్చుని అన్నారు విజేతలకు గ్రామ ప్రముఖులు పంతం కృష్ణ పంతం సురేష్ నా మన నాయుడు పంతం పద్మనాభం తదితరులు బహుమతి ప్రధానం చేశారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాఠకులు పలు విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు విద్యార్థులు తమకు ఇచ్చిన ప్రశంసా పత్రాలను ప్రదర్శన చేశారు.

# కొరువాడ రీసర్వే గ్రామసభలో 51అర్జీలు



**కె.కోటపాడు,నవంబర్20(ఆంధ్రపత్రిక):** భూముల రీ సర్వేకు సబంధించి సమస్యల పట్ల వచ్చిన వినతులపై సమగ్ర విచారణ జరిపి పరిష్కరిస్తామని స్థానిక ఉప తహశీల్దార్ డి.రమేష్ బాబు అన్నారు. రీ సర్వే భూ సమస్యల పరిష్కారం కోసం గతనెల17వ తేదీనుంచి మండలంలో నిర్వహిస్తున్న గ్రామ సభల్లో భాగంగా 22వ రోజయిన బుధవారం కొరువాడ గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఉపతహశీల్దార్ రమేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో పట్టాదార్ రికార్డ్స్ పై ఫోటోస్, సర్వే నెంబర్స్, ఎక్స్టెంట్ కరెక్షన్స్, ఆధార్ సీడింగ్, మ్యుటేషన్స్ తదితర సమస్యల పరిష్కారం కోరుతూ 51వినతులను ఉప తహశీల్దార్ రమేష్ బాబుకు కు అంద చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ సభలో మండల సర్వేయర్ కె.రామచంద్రమూర్తి, సర్పంచ్ సింగంపల్లి నారాయణ మూర్తి, ఎంపీటీసీ సభ్యుడు చీపురుపల్లి అచ్చిబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చీపురుపల్లి రామారావు, వి.అర్.ఒ. శివకుమార్, విలేజ్ సర్వేయర్ ఉస్మాన్, మండలంలో పలువురు సర్వేయర్స్ త్రినాథ్, సూర్య, కేశవ, కాసునాయుడు తదితరులు పాల్గొన్నారు.

# నిత్యం ప్రజా సేవలో తరించిన కొయ్య పరాలు



**మునగపాక, నవంబర్20(ఆంధ్రపత్రిక):** సర్పంచ్ గా కొయ్య పరాలు తన సమయంలో ఎక్కువ సమయం ప్రజల కోసమే కేటాయించారని జడ్పిటిసి సభ్యులు పెంటకోట సోము సత్యనారాయణ(సోంబాబు) అన్నారు. పాటిపల్లి గ్రామంలో బుధవారం మాజీ సర్పంచ్ కొయ్య పరాలు సంతాప సభ జరిగింది. ఈ కార్యక్రమంలో చక్రం, సర్పంచ్ కోరుకొండ వెంకటి రాజు, శ్రీను, సబ్బి శ్రీనివాసరావు, శేషు, కోణ శ్రీను, కొయ్య అచ్చియనాయుడు తదితరులు పాల్గొని సంతాపం తెలియజేశారు.

# వంగలపూడి 1 అండ్ 2 ఇసుక రిచ్‌ల రద్దు చేస్తూ ఉత్తర్వులు



**ఓపెన్ రిచ్ పాయింట్ వద్ద టన్ను ఇసుక ధర వంగలపూడి -1 రూ. 67.59 , వంగలపూడి -2 రూ.70.19 లుగా నిర్ణయం -ఓపెన్ రీచ్ ల వద్ద రూ.270 నుంచి రూ.300 లకు అమ్మడంపై ఫిర్యాదు - వినియోగదారుడికి మార్గదర్శకాల మేరకు మాత్రమే త్రవ్వకాల చెల్లింపు చార్జీలు వసూలు జరపాలి -నియమాలను ఉల్లంఘి ంచిన వారిపై చట్టపరమైన చర్యలు - ఫిర్యాదులు వస్తున్న నేపథ్య ంలో అటు వంటి వారి అనుమతులు రద్దు చెయ్య డం జరుగు తుంది-ట్రాక్టర్లు, ఎడ్ల బండిలతో త్రవ్వకం చార్జీలు చెల్లించి ఇసుక తీసుకుని వెళ్ళవచ్చు - జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు**

**కోరుకొండ, నవంబర్ 20 (ఆంధ్రపత్రిక) :** మెసర్స్ పాన్ ఇండియా ప్రాజెక్ట్స్ వారికి నవంబర్ 11 వ తేదీన ఆరు నెలలు కోసం జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చెయడం జరిగిందన్నారు. వాస్తవంగా నవంబర్ 11 2024 నుంచి మే 10 2025 వరకూ రీచ్ వద్ద లావాదేవీల విషయంలో ఇచ్చినటి వంటి అనుమతులు తక్షణం రద్దు చెయ్యడం జరిగిందని జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు తెలియ చేశారు.

బుధవారం వంగలపూడి ఇసుక రిచ్ పాయింట్ ను ఆర్డీవో, మైన్స్ అధికారితో కలిసి జాయింట్ కలెక్టర్ పరిశీలించారు.

ఈసందర్భంగా జెసి చిన్న రాముడు మాట్లాడుతూ, ప్రభుత్వము త్రవ్వకం చార్జీలు కొరకు నిర్దేశించిన ఓపెన్ రిచ్ పాయింట్ వద్ద టన్ను ఇసుక ధర వంగలపూడి –1 రూ. 67.59 , వంగలపూడి –2 రూ.70.19 లుగా నిర్ణయంను ఉల్లంఘిస్తూ, రు.200, రూ.300, రూ.400, రు.500 వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు మేరకు క్షేత్ర స్థాయిలో పరిశీలన నిమిత్తం రావడం జరిగిందన్నారు. వాస్తవ పరిస్థితిని పరిశీలన చేసి, తక్షణం రద్దు చేసినట్లు తెలిపారు. త్వరలో మరియొక ఏజెన్సీ గుర్తించి ఉత్తర్వులు జారీ చేయడం జరుగుతుందన్నారు. ట్రాక్టర్, ఎడ్ల బండి ద్వారా ఇసుక రవాణా వ్యవస్థ కొనసాగిస్తామని జెసి చిన్న రాముడు స్పష్టం చేశారు.

ఈపర్యటనలో ఆర్డీవో ఆర్ కృష్ణ నాయక్ , ఏడి మైన్స్ డి ఫణి భూషణ్ రెడ్డి, ఇతర అధికారులు, బోట్స్ మ్యాన్ సొసైటి సభ్యులు ఉన్నారు.

# గాజువాక జోన్‌లో అభివృద్ధి పనులను ప్రణాళికాయుతంగా చేపట్టండి

## ప్రజా ఫిర్యాదుల నియంత్రణ దిశగా వార్డు కార్యదర్శులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలి: కమిషనర్ డాక్టర్ పి సంపత్ కుమార్



**విశాఖపట్నం, నవంబర్ 19 (ఆంధ్రపత్రిక):** జీవీఎంసీ గాజువాక జోన్ పరిధిలో అభివృద్ధి పనులను ప్రణాళిక యుతంగా చేపట్టి ప్రజలకు మెరుగైన సేవలను అందించే దిశగా అధికారులు, వార్డు కార్యదర్శులు విధులు నిర్వహించాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన గాజువాక జోనల్ స్థాయి సమీక్షా సమావేశాన్ని ఉన్నతాధికారులు, గాజువాక జోన్ సంబంధిత అధికారులతో కలిసి షీలానగర్ వద్ద సిగ్నేచర్ హోటల్ నందు నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా కమిషనర్ సంపత్ కుమార్ ముందుగా, గాజువాక జోన్ కు సంబంధించిన పూర్తి వివరాలను జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్ శేషాద్రిని తెలుపమనగా.. జోనల్ కమిషనర్ మాట్లాడుతూ, గాజువాక జోన్ 194.96 స్క్వేర్ కిలోమీటర్ల ప్రాంతంలో, 19 వార్డులలో, 4,81,270 మంది ప్రజల నివసిస్తున్నారని, 1,45,196 గృహాలు కలవని, అందులో వ్యక్తిగత గృహాలు 1,14,452, అపార్ట్మెంట్లు 1197, గ్రూప్ హౌస్ లు 851, గ్రేటెడ్ కమ్యూనిటీలు 13, వాణిజ్య వ్యాపార సంస్థలు 7,124 కలవని జీవీఎంసీ గాజువాక జోన్ 107 సచివాలయాల ద్వారా ప్రజలందరికీ సేవలు సంక్షేమ పథకాలు అందిస్తూ మౌలిక సదుపా యాలను కల్పిస్తుందని కమిషనర్ కు వివరించారు. అనంతరం కమిషనర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ, జీవీఎంసీ ప్రజలకు సేవలు అందించడం లో, విశాఖ నగరాన్ని అభివృద్ధి పరచడంలో నిత్యం ప్రత్యేక దృష్టి సారిస్తుందని, అయినప్పటికీ ప్రతి సోమవారం జీవీఎంసీ నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి విరివిగా ప్రజా ఫిర్యాదులు అందుతున్నాయని, మరుసటి వారం కూడా అవే ఫిర్యాదు లు ఆయా సమస్యలపై మరలా రావడం పై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ ఈ విషయంలో జీవీఎంసీ యంత్రాంగం, అధికారులు, వార్డు కార్యదర్శులు విధులు నిర్వర్తించడంలో లోపం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ప్రజా ఫిర్యాదులు/వినతులను సూక్ష్మంగా క్షుణ్ణంగా పరిశీలించి అధికారుల సలహాలతో సంబంధిత సమస్యలకు సమాధానాలను వార్డు కార్యదర్శులు, సంబంధిత ఉద్యోగులు ప్రత్యేక దృష్టితో చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తూ ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజా ఫిర్యాదులను నియంత్రించే దిశగా సంబంధిత అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ, దృష్టి సారించాలన్నారు. అనంతరం అన్ని విభాగాలను సమీక్షించిన కమిషనర్ మాట్లాడుతూ గాజువాక జోన్ ప్రాంతంలో 768.8 కిలోమీటర్లు కలిగిన రోడ్ల అభివృద్ధిలో భాగంగా అవసరమైన చోట గ్రావెల్ రోడ్లకు తారు రోడ్లను వేసే చర్యలను, అభివృద్ధి పనులను ప్రణాళికయుతంగా చేపట్టాల ని, రోడ్ల అభివృద్ధిలో ప్రస్తుతం గాజువాక జోన్ లో జరుగుతున్న భూగర్భ మురుగునీటి కాలువ నిర్మాణ పనులను అంతర్గతం చేస్తూ రోడ్లను నిర్మించా లని, ఇతర సంస్థలకు సంబంధించిన రోడ్ల అభివృద్ధిపై ఆయా సంస్థలకు తెలియపరచి వారు రోడ్లను అభివృద్ధిపరిచేలా చర్య చేపట్టాలని, ఒకే చోట ఎక్కువ పాట్ హోల్స్ కలిగిన రోడ్డులో మరమ్మతులు చేపట్టకుండా ఆ ప్రదేశాన్ని గమనించి అవసరమైతే ఒక పొర రోడ్డును వేయాలని, గుర్తించిన ఖాళీ స్థలాలను సంరక్షణ దిశగా తక్కువ ఖర్చుతో పచ్చదనంతో అభివృద్ధి పరచాలని, స్మశాన వాటికలను కావలసిన మౌలిక సదుపాయాలతో తీర్చిదిద్దాలని, వీధి దీపాల పై నిరంతర పర్యవేక్షణ జరిపి ఎమినిటీస్ కార్యదర్శులు ప్రజా ఫిర్యాదులు లేకుండా విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు కమీషనర్ ఆదేశించారు. జీవీఎంసీకి చెల్లించవలసిన ఆస్తి పన్నులు, నీటి చార్జీలు సకాలంలో ప్రజలు చెల్లించేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, ఆ దిశగా రెవెన్యూ అధికారులు, ఇన్స్పెక్టర్లు, వార్డ్ అడ్మిన్ సెక్రటరీలు, నిత్యం వార్డుల్లో పర్యవేక్షిస్తూ ఆస్తి పన్ను హెచ్చింపులు, కొత్త నిర్మాణాలకు ఆస్తి పన్నులను విధింపులు జరపాలన్నారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే ఇంటి పన్నులు, నీటి చార్జీలు పై ప్రత్యేక దృష్టి సారించి శతశాతం వసూలు చేసినట్లయితే జీవీఎంసీకి ఆదాయం చేకూరి నగర అభివృద్ధి పనులకు కార్యాచరణ చేపట్టడం జరుగుతుందని అ దిశగా వార్డు కార్యదర్శులు ఆస్తిపన్నులు, నీటి చార్జీలు వసూళ్లు చేసేలా నిరంతర పర్యవేక్షణ జరపాలని డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ ఎస్.శ్రీనివాస్ కు కమిషనర్ ఆదేశించారు. ఆస్తి పన్ను వసూళ్లలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహించినా, అడ్మిన్ కార్యదర్శులు పర్యవేక్షణలో అలసత్వం వహించినా, విధులకు గైర్హాజరైన సోకాజు నోటీసులను జారీ చేయవలసిందిగా డీసీఆర్ కు కమిషనర్ ఆదేశించారు. ప్రజలకు అందించే తాగునీటి సరఫరా నిర్వహణకు సంబంధించి జీవీఎంసీకి చాలా ఆదాయం ఖర్చు జరుగుతుందని, ప్రజలకు పూర్తిస్థాయిలో తాగు నీటిని సరఫరా చేయడం జరుగుతుందని, ప్రతి ఇంటికి నీటి కొళాయి వేయించుకోవాలని సంబంధిత నివాసితులకు తెలియపరచి నీటి కొళాయిలను వేసి తద్వార జివిఎంసికి ఆదాయాన్ని సమకూర్చేలా చర్యలు చేపట్టి నిర్ణీత సమయంలో నీటి చార్జీలను ప్రజల నుండి వసూలు చేసేలా ఎమినిటీ సెక్రటరీ లు విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ శేషాద్రిని కమిషనర్ ఆదేశించారు. ముఖ్యంగా ప్రజా ఫిర్యాదులు అక్రమ అనధికార నిర్మాణాలపై జీవీఎంసీకి విరివిగా అందుతున్నాయని, ఈ విషయమై ప్లానింగ్ కార్యదర్శుల విధుల లోపం కనిపిస్తుంది అన్నారు. వెంటనే అన్ని జోన్లలో వాహనాలతో కూడిన ఎన్ఫోర్స్మెంట్ బృందాలను ఏర్పాటు చేసి అనధికార, అక్రమ నిర్మాణాలను ప్లానింగ్ కార్యదర్శులు, సంబంధిత అధికారులు, ఎన్ఫోర్స్మెంట్ బృందంతో కలిసి వాటిని అరికట్టేలా చర్యలు చేపట్టాలని సి.సి.పి. ఎ.ప్రభాకర్ రావుకు కమిషనర్ ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగంపై అందుతున్న ప్రజా ఫిర్యాదుల నియంత్రణ దిశగా టౌన్ ప్లానింగ్ యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కమిషనర్ అన్నారు. గాజువాక పారిశుద్ధ్య నిర్వహణలో శానిటరీ ఇన్స్పెక్టర్లు, శానిటరీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించి, వార్డుల సచివాలయ పరిధిలో గల ఎక్కువగా వ్యర్థాలు కలిగిన అపరిశుభ్ర ప్రదేశాలను గుర్తించి వాటిని పరిశుభ్ర ప్రదేశాలుగా అందంగా తీర్చిదిద్దేందుకు వార్డులలో నిత్యం పర్యవేక్షిస్తూ ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, విశాఖ నగరాన్ని "బిన్ ఫ్రీ సిటీ"గా తీర్చిదిద్దేందుకు పారిశుధ్య నిర్వహణ విధులలో కొన్ని రోజులపాటు యుసీడి విభాగంలో గల ఆర్పీల సహకారంతో ఇంటింటి నుండి వ్యర్థాలను నిత్యం సేకరించేలా ప్రజల అవగాహన కొరకు పారిశుద్ధ్య నిర్వహణ పనులు వార్డులలో చేపట్టాలని, గాజువాక జోన్ లో గల మారుమూల ప్రాంతాల్లో గల నివాసిత ప్రజలకు అవగాహన పరుస్తూ ఇంటింటి నుండి వ్యర్థాలను సేకరించి తరలించేలా పరిశుభ్రతా చర్యలు చేపట్టేలా ప్రత్యేక శ్రద్ధ చేపట్టాలని ప్రజారోగ్య అధికారులకు కమిషనర్ ఆదేశించారు. ప్రధాన రోడ్లలో ఊడ్చిన మట్టిని, వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులు సెంటర్ మీడియన్ లలో వేసి మీడియన్ పచ్చదనాన్ని ఖరాబు చేస్తున్నారని ఇకపై అలా చేస్తే కఠిన చర్యలు చేపడతానన్నారు. సుందర విశాఖ నగరాన్ని శతశాతం నిత్యం పరిశుభ్రంగా అందంగా తీర్చిదిద్దాలని ఆ దిశగా ప్రజారోగ్య అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారని కమిషనర్ ఈ సందర్భంగా తెలిపారు. జీవీఎంసీ పరిధిలోగల అన్ని వార్డులలో ప్రజలకు అందించే సేవలు, మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలలో నిర్లక్ష్యం, అలసత్వం వహించరాదని, విశాఖ నగర అభివృద్ధి దిశగా జీవీఎంసీ చేపడుతున్న అభివృద్ధి పనులు, జీవీఎంసీకి ఆదాయం చేకూర్చేలా ఆస్తి, నీటి పన్నుల వసూళ్లు, నగర పరిశుభ్రత దిశగా పారిశుద్ధ్య పనులు, అక్రమ, అనధికార నిర్మాణాల నియంత్రణ చర్యలు, ఇతర విధులలో చిత్తశుద్ధితో, ప్రత్యేక దృష్టి సారించి అన్ని విభాగాల వార్డు కార్యదర్శులు నిర్వహించేలా ప్రత్యేక కార్యాచరణ అధికారులు నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ సమీక్షలో ప్రధాన ఇంజనీర్ పి.శివ ప్రసాద్ రాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్ గోవిందరావు, సి.పి. మీనా కుమారి, డి.సి.పి. రామ్మోహన్, కార్యనిర్వాక ఇంజనీర్లు, ఏసీపీలు, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు, వార్డు ఎమినిటీస్, ప్లానింగ్, శానిటేషన్, వెల్ఫేర్, అడ్మిన్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల తరపున పోరాడాలి

(మొదటిపేజీ తరువాయి)

వైసీపీ ఎమ్మెల్యేలు వెంటనే రాజీనామా చేయాలని, వారు ఎమ్మెల్యేలుగా కొనసాగేందుకు అనర్హులని "బీసీ యువజన పార్టీ" అధినేత రామచంద్ర యాదవ్ పేర్కొన్నారు.. అందరూ రాజీనామా చేసి, కానీసం సగం మంది గెలిచినా మీ డిమాండ్ కు ప్రజల మద్దతు ఉన్నట్టేనని సవాల్ చేశారు.ప్రజాస్వామ్య భారతదేశంలో అన్ని పార్టీలకు, నాయకులకు మీ ద్వారా ఓ గొప్ప కనువిప్పు కలిగింది. అధికారాన్ని అడ్డుపెట్టుకుని విర్రవీగి.., అధికార మదంతో వ్యవహరించి.., అవినీతితో సహా అధికార దుర్వినియోగానికి పాల్పడితే ప్రజలు ఎంతగా తిరస్కరిస్తారో.. ఎంత అదఃపాతాళానికి తొక్కేస్తారో మీ ద్వారానే నిరూపితమైంది..! 151 సీట్లతో గెలిచి నియంత పాలన సాగించి ఆంధ్ర ప్రదేశ్ లో మరో విధానాన్ని ప్రవేశపెట్టి దారుణంగా ప్రజలచేత ఛీత్కరించబడ్డారు. అయినా మీ ఆలోచనల్లో పరిణితి రాలేదు..!మీ పార్టీకి 11 సీట్లు ఇవ్వడం అనేది ప్రజాతీర్పు. దీన్ని గౌరవించి శాసనసభకు హాజరై ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించాల్సిన మీరు.. ప్రజల తరపున పోరాటం చేయాల్సిన మీరు "ప్రతిపక్ష హోదా ఇస్తేనే వస్తాను అనే కుంటిసాకుతో.. దాని కోసం వెంపర్లాడుతుంటే ప్రజలు, ప్రజాస్వామ్య వాదులు నవ్వుకుంటున్నారు. మీకు ఈ ఐదేళ్లు ప్రతిపక్ష హోదా ఎలాగూ రాదూ.., మీరు కూడా అసెంబ్లీకి వెళ్లే ఉద్దేశంతో లేరు, కాబట్టి మీరు, మీ పార్టీ ఎమ్మెల్యేలు 11 మంది నైతికంగా ఎమ్మెల్యే పదవులకు అనర్హులు. కాబట్టి వెంటనే మీ అందరూ మీ పదవులకు రాజీనామా చేయాలనీ "భారత చైతన్య యువజన పార్టీ" డిమాండ్ చేస్తుంది.. మీ పార్టీకి ఈ రాష్ట్రంలో ఇంకా మనుగడ ఉంటుందని మీరు భావిస్తే వెంటనే రాజీనామా చేసి మళ్ళీ ప్రజాతీర్పు కోరండి. మీకున్న ఈ 11 సీట్లలో సగం సీట్లు గెలుచుకున్నా (అంటే కనీసం 5 సీట్లు గెలుచుకున్నా) మీకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని మా బీసీ వై పార్టీ కూడా మీ తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది. మీ పోరాటానికి మద్దతిస్తుంది. కాబట్టి మీరు, మీ పార్టీ శాసనసభ్యులు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

# కర్నూలులో ఎపి హైకోర్టు బెంచ్ ఏర్పాటు..?

(మొదటిపేజీ తరువాయి)

సీఎం కార్యాలయం నుంచి న్యాయశాఖకు వచ్చిన లేఖతో ప్రక్రియను న్యాయశాఖ మొదలుపెట్టింది. బెంచ్ ఏర్పాటుకు సంబంధించి హైకోర్ట్ రిజిస్ట్రార్ జనరల్‌కు న్యాయశాఖ కార్యదర్శి సునీత లేఖ రాశారు. రాయలసీమలోని నాలుగు జిల్లాలు కర్నూల్, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల నుంచి హైకోర్ట్‌లో దాఖలైన కేసులు వివరాలు ఇవ్వాలని న్యాయశాఖ కార్యదర్శి కోరారు. బెంచ్ ఏర్పాటు చేయాలంటే ఈ నాలుగు జిల్లాల నుంచి 1/3 కేసులు ఉండాలని లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర మొత్తం జనాభాలో 4.95 కోట్లు ఉండగా అందులో రాయలసీమలో రీజియన్‌లో 1.59 కోట్ల మంది ఉన్నారని అధికారులు పేర్కొన్నారు. అంటే రాష్ట్ర మొత్తం జనాభాలో 25 శాతం మంది ఈ రీజియన్‌లో ఉన్నారని ప్రభుత్వం వెల్లడించింది. దేశంలో ఇప్పటికే 7 రాష్ట్రాల్లో హైకోర్ట్ బెంచ్‌లు ఏర్పాటు చేశారని అధికారులు గుర్తుచేశారు. రాయలసీమ రీజియన్ నుంచి నేరుగా రాజధానికి వచ్చేందుకు రవాణా సౌకర్యం కూడా సరిగా లేదని అధికారులు పేర్కొన్నారు. హైకోర్ట్‌లో ఈ రీజియన్ నుంచి వచ్చిన కేసుల్లో రెండు లేదా మూడు ఏళ్ల కంటే పెండింగ్‌లో ఉన్న వివరాలు కూడా ఇవ్వాలని అధికారులు కోరారు. దీనిపై సమగ్ర సమాచారం ఇవ్వాలని హైకోర్ట్ రిజిస్ట్రార్ జనరల్‌ను న్యాయశాఖ కార్యదర్శి సునీత కోరారు. ఇటీవల న్యాయశాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన సమీక్ష సమావేశంలో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని అన్నారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన మేరకు, మంత్రివర్గ సమావేశంలో దీనిపై తీర్మానం చేసి కేంద్రానికి పంపనున్నట్లు వెల్లడించారు. జూనియర్ న్యాయవాదులకు గౌరవ వేతనం కింద నెలకు రూ.10 వేలు అందిస్తామని చెప్పారు. తమ మేనిఫెస్టోలో ఇచ్చిన ఈ హామీని అమలుచేసే ప్రక్రియను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

# అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో గందరగోళం

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టారు. అయితే ప్రశ్నోత్తరాల విష యంలో సభలో అయోమయం నెలకొంది. ఒక శాఖకు సంబంధించిన ప్రశ్నలు వేరే శాఖలకు వెళ్లడంపై స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఉభయసభల్లో మంత్రికి ఒకే ప్రశ్న రావడంపైనా మండిపడ్డారు స్పీకర్. ఈ అయోమయానికి కారణం అధికారుల నిర్లక్ష్యమే స్పీకర్ ఆగ్రహించారు. అధికారులు తమ శాఖకు వచ్చిన ప్రశ్నలను వేరే శాఖలకు ఎలా పంపుతారంటూ స్పీకర్ ప్రశ్నించారు. ఇళ్ళ స్థలాల, ఇళ్లు పంపిణీకి సంబంధించిన ప్రశ్న రెవెన్యూకు ఎలా వేస్తారని స్పీకర్ అడిగారు. అధికారులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అలాగే గోదావరి పుష్కరాల పనులు విషయంలో జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడుకు ప్రశ్న వెళ్లింది. ఇదే సమయంలో మండలిలో గాలేరు నగరి, హంద్రీనీవా అనుసంధాన ప్రాజెక్టుపై ప్రశ్న ఇచ్చారు. దీనిపైనా స్పీకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒకే మంత్రికి ఉభయసభల్లో ఎలా ప్రశ్న వేస్తారనే క్వశ్చన్ చేశారు. ఉభయ సభల్లో మంత్రికి ఒకే సమయంలో ప్రశ్న రావడంపై విస్మయం వ్యక్తం చేశారు. అధికారుల పనితీరుతో ప్రశ్నత్తరాల సమయంలో సభలో కాసేపు అయోమయ పరిస్థితి నెలకొంది.కాగా.. శాసనసభ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగే ప్రశ్నలకు మంత్రులు సమాధానం ఇవ్వనున్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మృతిపై సంతాప తీర్మానం చేయనున్నారు. రూల్ 344 కింద కూటమి ప్రభుత్వం 150 రోజుల పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై శాసన సభలో చర్చించనున్నారు. ఈరోజు సభలో పలు బిల్లులను కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నారు. విశాఖ రుషికొండపై నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలపై స్వల్పకాలిక చర్చ జరుగనుంది. అలాగే నూతన మద్యం పాలసీపై సభలో మంత్రి కొల్లు రవీంద్ర స్టేట్‌మెంట్ ఇవ్వనున్నారు.

# అప్పులపై తప్పుడు లెక్కలు..

**అమరావతి,నవంబర్ 20 (ఆంధ్రపత్రిక):** నాలుగు నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తుందనగా బడ్జెట్ ప్రవేశపెట్టారని, అసలు లెక్కలు బయటపెట్టాల్సి వస్తుందనే ఆలస్యంగా పెట్టారని ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ మండిపడ్డారు. చంద్రబాబు సర్కార్‌పై వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి సర్కార్ అబద్ధాల మీద అబద్ధాలు చెబుతున్నారని విరుచుకుపడ్డారు.ముఖ్యంగా బడ్జెట్ చూస్తే బాబు ఆర్గనైజ్డ్ క్రైమ్ తెలుస్తున్నట్లు కనిపిస్తోం దని, హామీలు ఎగొట్టడానికి బాబు అబద్ధాలకు రెక్కలు కట్టారంటూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ఆరోపించారు. చంద్రబాబు అన్నీ వక్రీకరించి అబద్ధాలు చెబుతున్నారన్నారు. బాబు హయాంలో కన్నా వైఎస్సార్‌సీపీ హయాంలో తలసరి ఆదాయం పెరిగిందని జగన్ స్పష్టం చేశారు. జాతీయ సగటు కన్నా ఏపీ సగటు వృద్ధి రేటు ఎక్కువగా ఉందని తెలిపారు. లేని అప్పులు ఉన్నట్టుగా అబద్ధాలకు రెక్కలు కట్టి తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. అసెంబ్లీ సాక్షిగా చెప్పే మాటలకు పొంతన ఉండటం లేదన్న జగన్,వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండగా లక్షా 30వేలు ఉద్యోగాలు ఇచ్చామని, ఆర్టీసీలో 50 వేల ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి, ఆర్టీసీ కార్మికుల్లో వెలుగులు నింపామన్నారు. 2.66 లక్షల వలంటీర్ల నియామకాలు చేశామన్న జగన్, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా? అని జగన్ ప్రశ్నించారు.వైసీపీ హయాంలో ఆరోగ్యశ్రీలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని, ఆరోగ్యశ్రీ చికిత్సలు పరిమితి 25 లక్షల రూపా యలకు పెంచామన్నారు. గత 4 నెలల నుంచి జీతాలు అందడం లేదని 108 ఉద్యోగాలు ధర్నాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

# చిదంబరానికి హైకోర్టులో ఊరట

(మొదటిపేజీ తరువాయి)

కోర్టులో ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను పరిగణలోకి తీసుకొని నోటీసులు జారీ చేసింది. కేసు విచారణను జనవరి 22కి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ మనోజ్ కుమార్ ఓహ్రి పేర్కొన్నారు. ఈ కేసులో వివరణాత్మక ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు తెలిపారు.చిదంబరం తరపున సీనియర్ న్యాయవాది ఎన్ హరిహరన్, అర్షదీప్ సింగ్ ఖురానా, అక్షత్ గుప్తా వాదనలు వినిపించారు. మాజీ కేంద్రమంత్రిపై ప్రాసిక్యూషన్‌కు ఎలాంటి అనుమతి లేకపోవడంతో ప్రత్యేక న్యాయమూర్తి మనీలాండరింగ్‌కు సంబంధించిన ఛార్జిషీట్‌ను పరిగణలోకి తీసుకున్నారని.. ఆయనపై వచ్చిన ఆరోపణలు అధికారిక విధులతో సంబంధం లేదని.. ఈ కేసులో ప్రాసిక్యూషన్‌కు అనుమతి అవసరం లేదని ఈడీ న్యాయవాది అభ్యంతరాలు లేవనెత్తారు. ఈ క్రమంలో మధ్యంతర ఉపశమనం కల్పించాలని.. ట్రయల్ కోర్టులో కొనసాగుతున్న విచారణపై స్టే విధించాలని చిదంబరం కోరారు. ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ కేసులో చిదంబరం, కార్తీలపై సీబీఐ, ఈడీ దాఖలు చేసిన చార్జిషీట్‌లపై ట్రయల్ కోర్టు నవంబర్ 27, 2021న విచారణ చేపట్టి, సమన్లు జారీ చేసింది. సీఆర్‌పీసీ సెక్షన్ 197 (1) ప్రకారం ప్రాసిక్యూషన్ కోసం అనుమతి పొందడం తప్పనిసరని.. ఈడీ ఇప్పటి వరకు ప్రాసిక్యూషన్‌కు అనుమతి తీసుకోలేదని చిదంబరం తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ప్రస్తుతం, అభియోగాల పరిశీలన కోసం ట్రయల్ కోర్టు ఎదుట ప్రొసీడింగ్స్ ఫిక్స్ అయ్యాయని లాయర్ తెలిపారు. 2006లో చిదంబరం కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ ఒప్పందానికి అనుమతి లభించింది.

# 'మహా'లో ప్రశాంతంగా ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)

ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. మరోవైపు జారండ్ అసెంబ్లీ ఎన్నికలకు కూడా పోలింగ్ కొనసాగుతోంది. ఇక్కడ పోలింగ్ జోరుగా సాగుతోంది. ఉదయం 11 గంటల వరకూ 31.37 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

# భవిష్యత్ ఎజెండా సిపిఎస్ రద్దు

**న్యూఢిల్లీ,నవంబర్ 20 :** సిపిఎస్ రద్దు ఇప్పుడు ఎన్నికల ఎజెండాగా మారింది. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలకు లెఫ్ట్ పార్టీలతో పాటు అన్ని వర్గాలు మద్దతుగా నిలుస్తున్నాయి. మహారాష్ట్ర, జార్ఖండ్‌లో కూడా దీని ప్రభావం కనిపిస్తోంది. ఈ క్రమంలో ఉద్యోగులు ఎవరివైపు మొగ్గు చూపుతారన్న ఆసక్తి పెరిగింది. ఈ రెండు రాష్ట్రాల్లో సిపిఎస్ రద్దు అంశాన్ని ఎజెండా పైకి తెచ్చారు. ఇక్కడ బిజెపి ఓటమి పాలైతే సిపిఎస్ రద్దుకు సానుకూల పరిస్థితి ఏర్పడవచ్చు. ఇప్పుడు దేశంలో ఓపిఎస్ అమలవుతున్న రాష్ట్రాల సంఖ్య ఐదుకు చేరింది. జమిలి ఎన్నికలు వస్తే సిపిఎస్ సమస్యను ఎన్నికల ఎజెండాగా మార్చాల్సిన అవసరముంది.

# టూరిజం పాలసీకి కేబినెట్ ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

సవరణ బిల్లుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అవిశ్వాసం పెట్టే గడువును నాలుగేళ్ల నుంచి రెండేళ్లకి కుదిస్తూ చట్ట సవరణ చేశారు. 2024- 25 కొత్త క్రీడా పాలసీకి క్యాబినెట్లో ఆమోదం లభించింది. డ్రగ్స్ నియంత్రణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్ పేరును ఈగల్ (ఎలైట్ యాంటీ నార్కటిక్ గ్రూప్ ) మారుస్తూ క్యాబినెట్ తీర్మానం చేసింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కోసం గృహ నిర్మాణ శాఖ చేసుకోనున్న ఒప్పందానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఏపీ టవర్స్ లిమిటెడు ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ విలీనం చేసేందుకు క్యాబినెట్ ఆమోదం లభించింది. ఏపీ టవర్స్ లిమిటెడకు చెందిన మూలధనం, ఆస్తులు, అప్పులు బదలాయిస్తూ ప్రతిపాదన చేశారు.ఏపీలో భారీగా పెట్టుబడులు.. వేల సంఖ్యలో ఉద్యోగావకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో చంద్రబాబు సర్కార్ ముందుకు సాగుతోంది.. ఈ క్రమంలో.. మంగళవారం సచివాలయంలో అత్యంత కీలకమైన స్టేట్ ఇన్వెస్ట్ మెంట్ ప్రమోషన్ బోర్డ్ మీటింగ్ జరిగింది. ఈ ఎస్ఐపిబి తొలి సమావేశంలో 33,966 ఉద్యోగాలు కల్పించే రూ.85వేల కోట్ల పెట్టుబడులకు సంబంధించి 10 కంపెనీలకు ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా భారీ పరిశ్రమలకు భూముల కోసం ల్యాండ్ పూలింగ్ విధానం చేపట్టాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశ్రమలకు భూములు ఇచ్చే వారికి స్కిల్ డెవలప్మెంట్ ద్వారా అదే సంస్థలో ఉద్యోగ, ఉపాధి కల్పించేలా ప్రతిపాదనలు తయారు చేయాలని కోరారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను సాకారం చేసేలా ఒప్పందాలను నిత్యం ట్రాక్ చేయాలని సిఎం సూచించారు. దేశంలో పెట్టుబడుల కోసం రాష్ట్రాల మధ్య తీవ్రమైన పోటీ ఉందని.. ఆ పోటీని తట్టుకుని రాష్ట్రానికి పెట్టుబడులు సాధించేలా అధికారులు పనిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. గత ప్రభుత్వ విధానాల వల్ల 5 సంవత్సరాలు పెట్టుబడులు రాలేదని, ఒప్పందాలు చేసుకున్న వాళ్లు కూడా గత ప్రభుత్వ తీరుతో వెనక్కి వెళ్లిపోయారని అన్నారు. ప్రభుత్వ టెర్రరిజంతో పారిశ్రామిక వేత్తలు పారిపోయారని సిఎం గుర్తుచేశారు. ప్రభుత్వాలు తెచ్చే పాలసీలు సమాజంపై అత్యంత ప్రభావం చూపుతాయని పరిశ్రమల వర్గాల అవసరాలు, కంపెనీల మంచి చెడులూ కూడా ప్రభుత్వాలు చూసి పాలసీలు రూపొందించాలని సిఎం అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టడానికి వచ్చే వారికి గౌరవం ఇవ్వాలన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు. వారికి అన్ని రకాలుగా అధికారులు సహకరించాలని సీఎం సూచించారు. పెట్టుబడులు పెట్టేవారిని ప్రోత్సహించేలా ప్రభుత్వంలోని ప్రతి ఒక్కరూ పనిచేయాలని.. దాని వల్ల యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఏ పాలసీ తయారు చేసినా.. ప్రజా ప్రయోజనాలతో పాటు.. పారిశ్రామిక వేత్తల గురించి ఆలోచించాలని.. అప్పుడే పోటీని తట్టుకుని పెట్టుబడులు సాధించవచ్చన్నారు. ఒక పెట్టుబడిపై చర్చ మొదలైతే దాన్ని సాకారం చేసే వరకు ట్రాక్ చేసి దాన్ని ఫలవంతం చేయాలని సూచించారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన స్టేట్ ఇన్వెస్టిమెంట్ ప్రమోషన్ బోర్డ్ మీటింగ్ జరిగింది. ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరిగిన తొలి మీటింగ్ లో పలు పెట్టుబడులు, ఒప్పందాలపై చర్చించారు. అర్సెలార్ మిత్తల్ స్టీల్ ఫ్యాక్టరీ ద్వారా ప్రత్యక్షంగా 61 వేల మందికి పరోక్షంగా లక్షల మందికి ఉపాధి లభిస్తుందని సీఎం అన్నారు. ఈ ప్రాజెక్టును 4 ఏళ్లలో కార్యరూపం దాల్చేలా చూడాలని మంత్రులకు సూచించారు. ఇది పూర్తి అయితే ఆ ప్రాంతంలో ఒక కొత్త నగరం ఏర్పాటు అవుతుందని సిఎం అన్నారు. అటు మూలపేట పోర్టు, ఈ స్టీల్ ప్రాజెక్టు పూర్తి అయితే ఆ ప్రాంతాల రూపురేఖలు మారిపోతాయని సిఎం అన్నారు. పెట్టుబడుల విషయంలో కంపెనీలతో నిరంతరం సంప్రదింపులు జరిపి.. అన్ని అడ్డంకులు తొలగించి త్వరగా గ్రౌండ్ అయ్యేలా చూడాలని సిఎం సూచించారు.

# గ్రూప్-1 నోటిఫికేషన్‌పై పిటిషన్‌ను విచారించిన హైకోర్టు

**హైదరాబాద్,నవంబర్ 20 (ఆంధ్రపత్రిక):** గ్రూప్-1 నోటిఫికేషన్‌పై దాఖలైన పిటిషన్లను హైకోర్టు బుధవారం విచారించింది. విచారణ అనంతరం తదుపరి విచారణను నవంబర్ 26వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. జీవో-29, ట్రాన్స్‌జెండర్ రిజర్వేషన్లు, లోకల్, నాన్ లోకల్ అంశాలపై దాఖలైన పిటిషన్లను హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. కోర్టు తీర్పు వెలువడే వరకు గ్రూప్-1 ఫలితాలు విడుదల చేయొద్దని పిటిషన్ల తరపు అడ్వకేట్స్ డివిజన్ బెంచ్‌ను కోరారు. ఇందుకు జడ్జిలు అంగీకరించారు. అయితే అన్ని కేసులు కలిపి వింటామని జడ్జిలు చెప్పారు. అన్ని పిటిషన్లను అదే వారంలో కంప్లీట్ చేద్దామని జడ్జిలు చెప్పినట్లు సమాచారం. ఈ పిటిషన్లపై కౌంటర్‌లకు ప్రభుత్వ తరపు అడ్వకేట్లు సిద్ధంగా ఉండాలని జడ్జిలు చెప్పారు. వాదనలకు పిటిషనర్ల తరపు అడ్వకేట్ సుధీర్‌కు కూడా అవకాశం ఇస్తామని జడ్జిలు వెల్లడించారు.



# జైశంకర్ అనుభవజ్ఞుడైన దౌత్యవేత్త మాత్రమే కాదు..

## ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ప్రశంసలు

**న్యూఢిల్లీ, నవంబర్ 20 :** బ్రెజిల్‌లో జరుగుతున్న జీ20 సదస్సులో ఆసక్తికర ఘట్టం చోటుచేసుకుంది. భారత విదేశాంగ మంత్రి డా.ఎస్.జైశంకర్, ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో మధ్య జరిగిన భేటీలో ఈ పరిణామం చోటు చేసుకుంది. ఇది అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రధాని నరేంద్ర మోదీ, ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో మధ్య ద్వైపాక్షిక సమావేశం జరిగింది. దీనికి ముందు విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్ తనను తాను రాష్ట్రపతి ప్రబోవోకు పరిచయం చేసుకున్నారు. అయితే దీని తర్వాత అధ్యక్షుడు ప్రబోవో ఇచ్చిన సమాధానం భారత విదేశాంగ మంత్రి అంతర్జాతీయ గుర్తింపును బహిర్గతం చేసింది. విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ప్రెసిడెంట్ ప్రబోవో సుబియాంటోకి తనను తాను పరిచయం చేసుకున్నప్పుడు, ప్రెసిడెంట్ ప్రబోవో ఇలా బదులిచ్చారు, "మీరు నాకు తెలుసు, మీరు ప్రపంచవ్యాప్తంగా చాలా ప్రసిద్ధి చెందారు." దీనిపై ఎస్.జైశంకర్ రాష్ట్రపతికి తల వంచుకుని సంతోషంగా పలకరించారు. జైశంకర్ అనుభవజ్ఞుడైన దౌత్యవేత్త మాత్రమే కాదు, భారతదేశ విదేశాంగ మంత్రిగా ఉన్న సమయంలో భారతదేశం ప్రపంచ పాత్రను బలోపేతం చేయడంలో గణనీయమైన కృషి చేశారు.ఇదిలావుంటే, ఇండోనేషియా అధ్యక్షుడు సుబియాంటోతో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. ఇందులో ముఖ్యమైన అంశాలపై చర్చించారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేశారు. బ్రెజిల్‌లో జరుగుతున్న జి20 సదస్సు సందర్భంగా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోను కలవడం ఆనందంగా ఉందని ప్రధాని మోదీ రాశారు. భారత్-ఇండోనేషియా దౌత్య సంబంధాలకు 75 ఏళ్లు పూర్తవుతున్నందున ఈ సంవత్సరం కూడా ప్రత్యేకమైనదన్నారు. వాణిజ్యం, భద్రత, ఆరోగ్య సంరక్షణ, ఫార్మాస్యూటికల్స్ సహా ఇతర రంగాలలో రెండు దేశాల మధ్య సంబంధాలను మెరుగుపరచడం ఇద్దరు నేతలు చర్చలు జరిపారు.

# బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

(మొదటిపేజీ తరువాయి)

ఏపీ దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో ఆశించిన స్థాయి కంటే అధిక వర్షపాతం నమోదైంది. నెల్లూరు, శ్రీసత్యసాయి పుట్టపర్తి, కడప, అన్నమయ్య రాయచోటి, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు పడ్డాయి. విశాఖపట్నం, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, కృష్ణా, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. "హెచ్చరిక: బంగాళాఖాతంలో అల్పపీడనం... పొంచివున్న తుపాను ముప్పు" అటు తమిళనాడులో చెన్నై సహా ఉత్తర కోస్తా జిల్లాలు- చెంగల్పట్టు, కాంచీపురం, రాణిపేట్, తిరుపత్తూర్, కడలూర్, దక్షిణ ప్రాంత జిల్లాలైన విల్లుపురం, తంజావూరు, తిరువరూర్, నాగపట్నం, మైలాడుతురై, పుదుక్కోట్టై, రామనాథపురం, కాళ్లకురిచ్చి, తూత్తుకూడి, దిండిగల్, మధురై, విరుధ్‌నగర్, థేని, తెన్ కాశి, తిరునెల్వేలి, కన్యాకుమారి జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదైంది. ఇదే పరిస్థితులు మరోసారి తలెత్తడం ఖాయంగా కనిపిస్తోంది. గురువారం నాటికి బంగాళాఖాతంలో మరో ఉపరితల ఆవర్తనం ఏర్పడబోతోంది. అండమాన్ నికోబార్ దీవులకు దక్షిణ దిశ, దాని పరిసర ప్రాంతాల గగనతలంపై సుమారు రెండు కిలోమీటర్ల ఎత్తున ఈ ఆవర్తనం ఏర్పడటానికి అనుకూల వాతావరణం ఉందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. క్రమంగా ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతుందని అంచనా వేసింది. ఈ క్రమంలో నవంబర్ 23వ తేదీ నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని ఐఎండీ వివరించింది. అల్పపీడనంగా మారిన అనంతరం నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడతుందని పేర్కొంది. దీని ప్రభావంతో ఈ నెల 27, 28 తేదీల్లో ఏపీలోని పలు జిల్లాల్లో ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఏపీతో పాటు తమిళనాడు ఉత్తర ప్రాంత జిల్లాల్లో అంచనాలకు మించిన వర్షపాతం నమోదవుతుందని పేర్కొంది. కొన్ని చోట్ల పిడుగులు పడే ప్రమాదం ఉందని తెలిపింది.

# డిప్యూటీ సీఎం పవన్ ఆసక్తికర వ్యాఖ్యలు

(మొదటిపేజీ తరువాయి)

విజన్‌కు తగ్గట్టు పనిచేస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా సీఎం కలలను నెరవేర్చడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పుకొచ్చారు. చంద్రబాబు ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని ఆకాంక్షించిన పవన్ .. వైసీపీ హయాంలో జరిగిన నష్టాలను వివరిం చారు. మరో పదేళ్ల పాటు చంద్రబాబు సీఎంగా ఉండాలంటూ కొత్త చర్చకు తెర తీసారు.ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 150 రోజులు పూర్తి కావటంతో సాధించిన పురోగతిని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. ఆ తరువాత డిప్యూటీ సీఎం పవన్ తన అభిప్రాయాలను వెల్లడించారు. వైసీపీ హయాంలో అన్ని రకాలుగా రాష్ట్రం నష్టపోయిందని విమర్శించారు. పంచాయితీలను నిర్వీర్యం చేసారని ఆరోపించారు. రోడ్లను పట్టించుకోలేదని .. ఇసుక, మద్యం లో దోపిడీ జరిగిందని చెప్పుకొచ్చారు. కూల్చివేతల పైన ప్రజాగ్రహం తీవ్ర స్థాయిలో కనిపించిందని పవన్ వివరించారు.వైసీపి వ్యవహార శైలి కారణంగానే ప్రజలు కూటమికి మద్దతుగా నిలిచారని పవన్ విశ్లేషించారు. రాష్ట్ర భవిష్యత్తుపై చంద్రబాబు విశ్వాసం పెంచారని చెప్పుకొచ్చారు. ఈ అంశంలో తనకు సీఎం చంద్రబాబు పైన పూర్తి నమ్మకం ఉందని చెప్పారు. రాబోయే రోజుల్లో ఏపీ ఆర్థిక వ్యవస్థ ఒక ట్రిలియన్ డాలర్ ఎకానమీగా అందుకుంటుందని పవన్ ఆశాభావం వ్యక్తం చేసారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు ఇచ్చిన పరిస్థితి లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగులు ప్రతీ నెలా ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నారని వివరించారు. రాష్ట్రంలోని 64 లక్షల మంది లబ్దిదారులకు రూ 4 వేల చొప్పున పెన్షన్ అందిస్తున్నామని పవన్ చెప్పుకొచ్చారు. పంచాయితీలను బలోపేతం చేశామని చెప్పారు.అటు కేంద్రం నుంచి రాష్ట్రానికి అవసరమైన విధంగా అన్ని రకాల సహకారం అందుతుందని పవన్ వెల్లడించారు. రాజధాని, పోలవరం తో పాటుగా రోడ్లు - రైల్వే లైన్ల కోసం వేల కోట్లు కేంద్రం కేటాయించిందని వివరించారు. వైపరీత్యాలు వచ్చిన సమయంలో నాయకుడు ఎలా ఉండాలో విజయవాడ వరదల సమయంలో చంద్రబాబు నిరూపించారని ప్రశంసించారు. చంద్రబాబు ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని పవన్ కోరారు. మరో పదేళ్ల పాటు చంద్రబాబే సీఎంగా ఉండాలంటూ పవన్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయంగా కొత్త చర్చకు కారణమవుతోంది.

# రష్యా గురిలో అమెరికా ఎంబసీ..?

(మొదటిపేజీ తరువాయి)

అమెరికా వెల్లడించింది. ఈనేపథ్యంలోనే ఎంబసీని మూసివేయాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. నవంబర్ 20న దాడి జరగబోతోందని తమకు కచ్చితమైన సమాచారం. అందిందని వెల్లడించింది. రాయబార కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది. ఎయిర్ అలర్టు ప్రకటించగానే కీవ్ ని అమెరికా పౌరులు షెల్టర్లలోకి వెళ్లిపోవాలని కోరింది.రష్యా, ఉక్రెయిన్ల మధ్య యుద్ధం ముదురుతున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో రష్యా పైకి దీర్ఘశ్రేణి క్షిపణుల ప్రయోగానికి ఉక్రెయిన్లు అమెరికా అనుమతివ్వడంతో అగ్నికి ఆజ్యం పోసినట్లైంది. దీంతో ఆగ్రహించిన రష్యా అధ్యక్షుడు పుతిన్ అణ్వాయుధాల వినియోగానికి అనుమతించే నిబంధనలను మరింత సరళతరం చేసే కీలక దస్త్రంపై సంతకం చేశారు. అణ్వాయుధాలు కలిగిఉన్న దేశం సాయంతో ఏ దేశమైనా తమపై దాడి చేస్తే.. దాన్ని సంయుక్త దాడిగానే పరిగణిస్తామని అందులో పేర్కొన్నారు.మరోవైపు అమెరికా ఇచ్చిన అనుమతితో ఉక్రెయిన్ ఏకంగా ఆరు దీర్ఘశ్రేణి క్షిపణుల్ని (ఆర్మీ టాక్టికల్ మిస్సైల్ సిస్టమ్) రష్యా పైకి ప్రయోగించింది. ఇందులో ఐదింటిని కూల్చేశామని, మరో దాన్ని ధ్వంసం చేశామని రష్యా ప్రకటించింది. దీంతో పొరుగునున్న ఐరోపా దేశాలు అప్రమత్తమయ్యాయి. చిన్న పిల్లల ఆహార పదార్థాలు, ఔషధాలు, తాగునీటిని నిల్వ చేసుకోవాలని కొన్ని నాటో దేశాలు- తమ ప్రజలకు సూచించాయి.

# క్షీణిస్తున్న గాలిలో నాణ్యత

(మొదటిపేజీ తరువాయి)

గాలి నాణ్యత సూచీ క్షీణించింది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ఏకంగా 450కుపైనే నమోద వుతోంది. తీవ్ర వాయు కాలుష్యంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కళ్ల మంటలు, తలనొప్పి వంటి పలు అనారోగ్య పరిస్థితుల్ని ఎదుర్కొం టున్నారు. ఇదే సమయంలో పలు నగరాలు స్వచ్ఛమైన గాలిని పీల్చుకుంటున్నాయి. దేశంలోని దాదాపు తొమ్మిది నగరాల్లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ చాలా మంచి కేటగిరీలో ఉంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి డేటా ప్రకారం.. అతి తక్కువ కాలుష్య నగరాల జాబితాలో మిజోరాంలోని ఐజ్వాల్ తొలి స్థానంలో ఉంది. ఐజ్వాల్ లో గాలి నాణ్యత సూచీ 26 వద్ద నమోదైంది. దీన్ని మంచి కేటగిరీ కింద భావిస్తారు. దీంతో అక్కడి నివాసితులు స్వచ్ఛమైన గాలిని పీలుస్తూ.. ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. ఐజ్వాల్ తర్వాత సిక్కింలోని గ్యాంగ్‌టక్, మేఘాలయాలోని షిల్లాంగ్ వరుసగా రెండు, మూడు స్థానాలో నిలిచాయి. ఈ నగరాల్లో ఏక్యూఐ లెవల్స్ వరుసగా 35, 36 వద్ద నమోదయ్యాయి. ఆ తర్వాత అస్సాంలోని గువాహటిలో 40, కర్ణాటకలోని చామరాజనగర్ 41, బాగల్‌కోట్‌లో 42, కేరళ త్రిస్సూర్‌లో 43, అరుణాచల్ ప్రదేశ్‌లోని నహర్లగన్‌లో 51, అస్సాం నాగాన్ నగరంలో ఏక్యూఐ లెవల్స్ 53తో సంతృప్తికరంగా ఉంది. ఇక దేశ రాజధాని ఢిల్లీ అత్యంత కాలుష్య నగరాల్లో తొలి స్థానంలో ఉంది. ఇక్కడ గాలి నాణ్యత సూచీ తీవ్రమైన కేటగిరీలో నమోదైంది. బుధవారం ఉదయం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 422 వద్ద నమోదైంది. మంగళవారంతో పోలిస్తే.. నేడు ఏక్యూఐ లెవల్స్ 494 నుంచి 422కి పడిపోయింది. అయిన ప్పటికీ ఇంకా ప్రమాదకర విభాగంలోనే ఉంది.

# కడప స్టీల్ ప్లాంట్ కోసం ఏం చేశావు..!

(మొదటిపేజీ తరువాయి)

కడప స్టీల్‌ప్లాంట్ కోసం ఏం చేశారని నిలదీశారు. టెంకాయలు కొట్టి నిరసన తెలిపారు. బుధవారం కడపలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజలు ఇలాంటి నాయకులను ఎన్నుకునే ముందు ఆలోచించుకోవాలని షర్మిల అన్నారు. గత ఐదేళ్లలో స్టీల్ ప్లాంట్ కోసం జగన్ చేసిందేమీ లేదన్నారు. కేవలం టెంకాయలు కొట్టే ఫ్యాక్టరీగానే గత పాలకులు తయారు చేశారన్నారు. కడప స్టీల్‌ప్లాంట్ శంకుస్థాపనలకే పరిమితమైందని, చెల్లి పెళ్లి చేయాలి మళ్లీ మళ్లీ అన్నట్లుగా తయారైందని ఎద్దేవా చేశారు. పేద ప్రజల కోసం, కడప ప్రాంత అభివృద్ధి కోసం వైఎస్సార్ చిత్తశుద్ధితో దీన్ని తీసుకొచ్చారని అన్నారు. 10 వేల ఎకరాల్లో రూ.20 వేల కోట్ల పెట్టుబడితో 20 మిలియన్ల టన్నుల సామర్థ్యంతో స్టీల్ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలన్నది ఆయన ఆశయ మని, దీని ద్వారా 25 వేల మందికి ప్రత్యక్షంగా, లక్ష మందికి పరోక్షంగా ఉద్యోగాలు కల్పించేందుకు అవకాశముందని చెప్పారు. వైఎస్సార్ చనిపో యిన తర్వాత వచ్చిన నాయకులందరూ స్టీల్ ప్లాంట్ ఊసే లేకుండా చేశారని విమర్శించారు. సెయిల్ ద్వారానే ప్లాంట్ నిర్మించాలని విభజన హామీల్లో ఉందని గుర్తు చేశారు. 2014లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఉంటే నిర్మాణం జరిగి ఉండేదన్నారు. ఏపీ పట్ల బిజెపికి చిన్నచూపు ఉందని, ప్రత్యేక హోదాతో పాటు మిగిలిన హామీలను సైతం ఆ పార్టీ తుంగలో తొక్కిందని షర్మిల ధ్వజమెత్తారు. కడప ప్రాంత అభివృద్ధికి స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టకపోతే కాంగ్రెస్ పార్టీ ఉద్యమబాట పడుతుందని, అవసరమైతే నిరవధిక నిరాహార దీక్షకూ సిద్ధం అని షర్మిల అన్నారు. ఇకపోతే సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టేవారిని కఠినంగా



శిక్షించాలని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. తనతో పాటు వైఎస్ విజయమ్మ, సునీతపై పోస్టులు పెట్టించింది వైకాపా ఎంపీ అవినాష్‌రెడ్డి అని పోలీసులు నిర్ధరణకు వచ్చారని.. అలాంటప్పుడు ఆయన్ను ఎందుకు విచారిం చడం లేదని ప్రశ్నించారు. వైకాపా 'సోషల్ సైకో' వర్రా రవీందర్‌రెడ్డి కేసులో అవినాష్‌ను విచారించి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులకు సజ్జల భార్గవరెడ్డి మూల కారణమన్నారు. ఆయన్ను ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. అసభ్య పోస్టుల వెనక ఎంత పెద్ద తలకాయలు ఉన్నా.. ఏ ప్యాలెస్‌లో దాక్కున్నా పోలీసులు వదిలిపెట్టవద్దు. పోస్టులు పెట్టిన వారిని మాత్రమే పోలీసులు పట్టుకుంటున్నారు. వారి వెనకున్న వారిని ఎప్పుడు అరెస్ట్ చేస్తారని ప్రశ్నించారు.

# గోవా రాష్ట్ర అధికారులతో సమీక్షలో మాగుంట





ఒంగోలు, నవంబరు 20 (ఆంధ్రపత్రిక):గృహ మరియు పట్టణ వ్యవహారాల స్టాండింగ్ కమిటీ పర్యటనలో భాగంగా గోవా రాష్ట్రంలోని పనాజీలో గృహ మరియు పట్టణ వ్యవహారాల శాఖ, ఆర్థిక శాఖ, పనాజీ మున్సిపల్ శాఖ, హెచ్‌యూడిసిఓ, సిపిడబ్ల్యూడి, ఎన్‌బిసిసి, ఎన్‌హెచ్‌బి మరియు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్ మరియు పలు శాఖలతో ఏర్పాటు చేసిన కమిటీ సమావేశంలో పాల్గొన్న కమిటీ చైర్మన్ మరియు ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, మరియు కమిటీ సభ్యులు హైబీ ఈడెన్, సాయోని ఘోష్, మాల రాజ్య లక్ష్మి షా, లవ్లీ ఆనంద్, డా.గుమ్మా తనూజా రాణి, సత్పల్ బ్రహ్మ చారి, కన్వర్సింగ్ తన్వర్, రాఘవ్ చడ్డా, చామల కిరణ్ కుమార్ రెడ్డి. ఈ సందర్భంగా "స్మార్ట్ సిటీ మిషన్", "ఎఎంఆర్‌యూటీ స్కీం", "స్వచ్ఛ భారత్ మిషన్", ప్రధానమంత్రి ఆవాస యోజన, ప్రధాన మంత్రి స్వానిధి యోజన, సిపిడబ్ల్యూడి, ఎన్‌బిసిసి,హెచ్‌యూడిసిఓ పలు అంశాలపై గోవా రాష్ట్ర అధికారులతో సమీక్ష జరిపినారు.





# తిరుమలలో "అన్నప్రసాదం"కు కియోస్క్ మిషన్లు విరాళం

## ప్రారంభించిన టీటీడీ అడిషనల్ ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి



తిరుమల, నవంబర్ 20 (ఆంధ్రపత్రిక):టీటీడీ నిర్వహిస్తున్న ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు విరాళం ఇచ్చేందుకు తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రంలో కియోస్క్ మిషన్‌ను టీటీడీ ఏర్పాటు చేసింది. ఈ మిషన్‌ను టీటీడీ అడిషనల్ ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి బుధవారం ప్రారంభించారు. ఈ మిషన్ ను కెనరా బ్యాంకు టీటీడీకి విరాళంగా అందించింది. ఈ మిషన్ల ద్వారా భక్తులు ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు సులభతరంగా విరాళం అందిచవచ్చు. రూ.1 నుండి రూ.99,999 వరకు తమకు తోచిన మొత్తాన్ని భక్తులు కియోస్క్ మిషన్‌లోని క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి యూపీఐ ద్వారా విరాళం ఇవ్వవచ్చు. ఈ సందర్భంగా అడిషనల్ ఈవో మీడియాతో మాట్లాడుతూ టీటీడీని పూర్తిగా డిజటలైజేషన్ చేయడంలో భాగంగా ఈ మిషన్ ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని కియోస్క్ మిషన్లను ఏర్పాటు చేస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు, లోకనాథం, రాజేంద్ర, కెనరా బ్యాంకు డీజీఎం రవీంద్ర అగర్వాల్, ఏజీఎం నాగరాజు రావు, తిరుమల బ్రాంచ్ మేనేజర్ రాఘవన్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారి సేవలో కేంద్రమంత్రి



తిరుమల,నవంబరు 20 (ఆంధ్రపత్రిక):తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని బుధవారం ఉదయం కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో, శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరము కేంద్ర మంత్రివర్యులకు, టీటీడీ వేద పండితులు రంగనాయకుల మంటపంలో వేద ఆశీర్వచనం గావించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కుటుంబ సభ్యులకు తిరుమల అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి శ్రీవారి దర్శనం ఏర్పాట్లు గావించారు.

# రెండేళ్లుగా అపరిష్కృతం.. 24 గంటల్లో పరిష్కారం



**డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు రుణపడి ఉంటాం**
**పవన్ కళ్యాణ్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపిన మెడికల్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు..**

మంగళగిరి, నవంబర్ 20 (ఆంధ్రపత్రిక): రెండేళ్లుగా పరిష్కారం కానీ సమస్య 24 గంటల్లో పరిష్కారం అయినందుకు హర్షణ వ్యక్తం చేస్తూ మెడికల్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కలిసి ధన్యవాదాలు తెలిపారు.'ఔట్ సోర్సింగ్ విధానంలో ఆప్కాస్ ద్వారా ఉద్యోగాల్లో చేరాము. మెడికల్ అండ్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ విభాగంలో 23 నెలలుగా విధులు నిర్వహిస్తున్నాము. విధుల్లో చేరిన నాటి నుంచి వేతనాలు లేవు. అప్పులు చేసి కుటుంబాలు నెట్టుకొస్తున్నాము. మేము పని చేసిన కాలానికి జీతాలు ఇప్పించండి సార్. ఉద్యోగ భద్రత కల్పించండి' అంటూ గత నెలలో మంగళగిరి లోని క్యాంపు కార్యాలయం వద్ద ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి ఉద్యోగులు తమ సమస్యను తీసుకు వెళ్లారు. సమస్య పరిష్కరిస్తామని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. హామీ ఇచ్చిన 24గంటలలోనే ఏపీసిఓఎస్ ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తుల జీతం బకాయిల సమస్యను పరిష్కరించారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. దీనితో మెడికల్ అండ్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ విభాగం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని జనసేన పార్టీ క్యాంపు కార్యాలయం వద్దపవన్ కళ్యాణ్‌ని కలిసి ధన్యవాదాలు తెలిపారు. గత రెండేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను నాలుగువారాలలోపు పరిష్కరించినందుకుపవన్ కళ్యాణ్‌కు రుణపడి ఉంటామన్నారు. సమస్య పరిష్కారం దిశగా వారి వెంట ఉంది కృషిచేసిన ఏపీఎంఎస్ఐడిసి చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావుకు ఉద్యోగస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజలు ఇచ్చిన విజయాన్ని ఎప్పుడు మరిచిపోను

**నాలుగు దశాబ్దాలుగా నన్ను ఆదరిస్తూ వస్తున్నందుకు ధన్యవాదాలు**
**ఇప్పుడిప్పుడే రాష్ట్రం కుదుటపడుతుంది : ఏపీ సీఎం చంద్రబాబు**



అమరావతి, నవంబర్ 20 (ఆంధ్రపత్రిక): గత ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన విజయాన్ని తాను ఎన్నడూ మరిచిపోనని, ఏపీ చరిత్రలో ఎప్పుడూ చూడని ప్రజాతీర్పు వచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజల తిరుగుబాటు కనిపించిందని తెలిపా రు. "నాలుగు దశాబ్దాలుగా నన్ను ఆదరించారు. అందరికంటే ఎక్కువ సార్లు నన్ను ప్రజలు సీఎం చేశారు. ఎన్నో ఇబ్బందులు పెట్టారు.. జైలుకు కూడా పంపారు. బాంబు దాడి నుంచి శ్రీవారే నన్ను కాపాడారు. నేను ఏ తప్పూ చేయలేదు. సీఎం అయ్యాక రాష్ట్రాన్ని బాగు చేస్తారా.. చేయగ లుగాతాము అనే నమ్మకం ఉందా అని పలువురు నన్ను అడిగారు. నేను పారిపోను.. పారిపోలేను. అధికారం ఉన్నా.. అధికారం లేకపోయి నా ప్రజల కోసమే పనిచేశాను. ఇప్పుడు కూడా ప్రజలు తీర్పు ఇచ్చి నన్ను గెలిపిస్తే.. అభివృద్ధి చేసి తీరుతాను అని ప్రతిజ్ఞ చేసి ముందుకు వచ్చాను" అని సీఎం పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని తెలిపారు. రాత్రికి రాత్రి ఏదీ జరిగిపోదన్నారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం వెంటిలేటర్‌పైకి వెళ్లిందన్నారు. కీలక సమయంలో ప్రజలు ఘన విజయం అందించారని చెప్పారు. ఢిల్లీలో పరపతి పెరిగిందని.. కేంద్రం అన్ని విధాలుగా సహకరిస్తోందన్నారు. రాష్ట్రం ఇప్పుడిప్పుడే గాడిన పడుతోందన్నారు. 64 లక్షల మందికి పెన్షన్ అందిస్తున్నామని తెలిపారు. అధికారంలోకి రాగానే పెన్షన్లు రూ.4వేలకు పెంచామని చెప్పారు. విజయవాడ వరదల సమయంలో సీఎం సహాయనిధికి రూ.500 కోట్లు విరాళంగా వచ్చాయన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు, తప్పులు శాపాలుగా మారాయన్నారు. ఎంత తవ్వితే అన్ని తప్పులు బయటపడుతున్నాయన్నారు. వైసీపీ అప్పులతో ఏపీ వెంటిలేటర్‌పైకి వెళ్లిందని విమర్శించారు. వైసీపీ పాలనలో రూ.10 లక్షల కోట్లు అప్పులు చేశారని.. అప్పులపై లెక్కలతో సహా అసెంబ్లీలో చూపించామని అన్నారు. "వైసీపీ పాలనలో నా కుటుంబంపై ఆరోపణలు చేశారు. అధికారం కొత్త కాదు.. కేంద్ర రాజకీయాలు నాకు కొత్త కాదు. రాజకీయ జీవితంలో ఇలాంటి పరిస్థితులు ఎప్పుడూ చూడలేదు. కూడు, గూడు, గుడ్డ అనే నినాదంతో సంక్షేమం మొదలుపెట్టాం. రూ.30 తో మొదల్కెన పెన్షన్... ఇప్పుడు రూ.4 వేలు చేశాం" అని అన్నారు. పేదల కోసం అనేక సంస్కరణలు, పథకాలు తీసుకొచ్చామని వెల్లడిరచారు. సంక్షేమ పథకాలు ప్రారంభించిన ఘనత టీడీపీదే అని అన్నారు. పేదలకు పక్కా ఇళ్లు నిర్మించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. టీడీపీ పాలనలో 120 సంక్షేమ పథకాలు ప్రారంభించామని తెలిపారు.

# కార్తీకమాసం నెలరోజులు భక్తుల సహకారంతో పలు కార్యక్రమాలు



గొల్లపూడి ప్రదీప్ కుమార్, శార్వాణి దంపతులను సత్కరిస్తున్న ఆధ్యాత్మిక సేవకులు ఎస్.ఎస్.ఆర్ ఆంజనేయులు, జానకీ లక్ష్మి దంపతులు...



ఆకాశ దీపం కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు గొల్లపూడి ప్రదీప్ కుమార్, శార్వాణి దంపతులు.

హైదరాబాద్, నవంబర్ 20 (ఆంధ్రపత్రిక): బుధవారం సాయంత్రం నిజాంపేట్ శ్రీ భ్రమరాంబా సమేత మల్లిఖార్జున స్వామి వారి ఆలయంలో ప్రముఖులు గొల్లపూడి ప్రదీప్ కుమార్, శార్వాణి దంపతులకు ఆధ్యాత్మిక సేవకులు ఎస్.ఎస్.ఆర్. ఆంజనేయులు, జానకీ లక్ష్మి దంపతులు శాలువా కప్పి నూతన వస్త్రాలను బహూకరించి సత్కారం చేశారు. ఆధ్యాత్మిక సేవకులు ఆంజనేయులు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుండి పరమేశ్వరుని సేవలో నిమగ్నమైన ప్రదీప్ కుమార్, శార్వాణి దంపతులను సత్కరించడం పరమేశ్వరుని అనుగ్రహంగా భావిస్తున్నామని ఇటువంటి సేవకులను, పాటలు పాడు తున్న గాయకులను ఈనెల 24వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటలకు సత్కరిస్తామని ఎస్.ఎస్.ఆర్.ప్రకటించారు.



శ్రీశైల మల్లన్న దర్శనానికి పయనం

**ఆకాశ దీపం కార్యక్రమం నిర్వహించిన ప్రదీప్, శార్వాణి దంపతులు:**

బుధవారం సాయంత్రం 6.30 గంటలకు ఆలయ అర్చకులు ధ్వజ స్తంభ పూజ నిర్వహించారు. ఈ సంద ర్భంగా ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ధ్వజ స్తంభం కార్యక్రమం తమ దంపతుల చేతిమీద నిర్వహించడం మా పూర్వజన్మసు కృతం అని ఆనందం వ్యక్తం చేశారు. ఆధ్యాత్మిక సేవకులు ఎస్.ఎస్.ఆర్ఆంజనేయులు మాట్లాడుతూ కార్తీకమాసం నెలరోజులు భక్తుల సహకారంతో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పలువురు స్వామి వారి సేవకులు, ఉద్యోగ స్తులతో సహా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని వారిని అభినంది స్తున్నామని పేర్కొన్నారు.

**శ్రీశైల మల్లన్న దర్శనానికి పయనం:**

గత 20 రోజులుగా విరామం లేకుండా స్వామి వారి సేవలో పాల్గొంటున్న సేవకులకు బుధవారం కొద్దిగా వెసులుబాటు కలిగింది. దీంతో శ్రీ శైల భ్రమ రాంబా సమేత మల్లిఖార్జున స్వామి వారిని దర్శించేందుకు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరమల్లె గౌతమ్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో శ్రీయుతులు రాజేశ్వర్, నందకిషోర్, శివ ప్రసాద్, మహేష్, శ్రీరామ్ కుమార్, లీలా మోహన్, సూర్యనారాయణ, సత్యనారాయణ తదితర భక్త బృందం శ్రీశైల మల్లన్న దర్శనానికి బయలుదేరారు.

# నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే బత్తుల

**రాజానగరం నియోజవర్గ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ...**



రాజమహేంద్రవరం, నవంబర్ 20 (ఆంధ్రపత్రిక):రాజానగరం నియోజకవర్గంలో బత్తుల బలరామకృష్ణ ఎమ్మెల్యేగా గెలుపొందిన నాటి నుండి నేటి వరకు నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. నియోజకవర్గంలో సమస్యలను, అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు ప్రభుత్వ దృష్టికి తీసుకుని వెళ్లి నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు తో భేటీ అయి రాజానగరం నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి కూలంకుషంగా చర్చించడం జరిగింది. ఈ భేటీలో ముఖ్యంగా రాజానగరం నియోజకవర్గంలో త్రాగు నీరు సాగు నీరు, పురుషోత్తపట్నం భూముల నష్టపరిహారం, కోరుకొండ భూముల రిజిస్ట్రేషన్ సమస్యలు, డిగ్రీ మరియు పాలిటెక్నిక్ కాలేజ్ ఆవశ్యకత, హాస్పిటళ్ల అభివృద్ధి, కొత్త హాస్పిటల్ నిర్మాణాలు, రోడ్లు డ్రైనేజీలు నిర్మాణం, ఇలా పలు అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం ముఖ్యమంత్రి నారా చంద్రబాబుని డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్‌తో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అందచేయడం జరిగింది. ఈ భేటీలో చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించి త్వరితగతిన పెండింగ్ పనులు అలాగే కొత్త పనులు పూర్తి చేస్తాము అని హామీ ఇచ్చారు. అలాగే ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పనితీరుపై సంతోషం వ్యక్తం చేసారు.

# శ్రీరామచంద్ర ఉత్సవ మూర్తికి అంగుళీ సంధాన సంప్రోక్షణం



తిరుమల, నవంబర్ 20 (ఆంధ్రపత్రిక):తిరుమల ఆలయంలో బుధవారం ఉదయం శ్రీ సీతా లక్ష్మణ సమేత శ్రీరామచంద్ర మూర్తి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే 2021 సంవత్సరంలో శ్రీరాముల వారి విగ్రహానికి సంబంధించిన ఎడమచేయి మధ్య వేలి భాగంలో చిన్నపాటి భిన్నం ఏర్పడినట్లు గుర్తించారు. అప్పట్లో ఈ వేలుకు బంగారు కవచాన్ని తొడిగి ఏర్పడిన భిన్నాన్ని సవరించమైనది. సాధారణంగా ఇటువంటి చిన్నపాటి భిన్నాలు ఉత్సవమూర్తులకు ఏర్పడినప్పుడు 12 ఏళ్లకు ఒకసారి నిర్వహించే మహా సంప్రోక్షణ కార్యక్రమంలో సవరించడం పరిపాటి. అయితే మహా సంప్రోక్షణ కార్యక్రమం 2018లో టీటీడీ నిర్వహించింది. తదుపరి మహా సంప్రోక్షణ కార్యక్రమం 2030లో జరగనుంది. అందుకు ఐదు సంవత్సరాలకు పైగా సమయం ఉన్న కారణంగా జీయర్ స్వాములు, ఆగమ సలహాదారులు, అర్చకులతో కూడిన కమిటీ ఇటీవల బ్రహ్మోత్సవ సమయంలో ప్రస్తుత అధికారుల దృష్టికి తీసుకురాగా, సదరు సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులు కోరారు. ఈ కమిటీ నిర్ణయించిన మేరకు చిన్నపాటి భిన్నాలను ఆగమోక్తంగా సవరించేందుకు మంగళ, బుధవారాల్లో శ్రీరాములవారి ఎడమ చేయి అంగుళీ సంధాన సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడానికి ప్రస్తుత టీటీడీ యాజమాన్యం కూడా అంగీకరించింది. ఈ కార్యక్రమం ద్వారా ఉత్సవ విగ్రహాలకు ఎటువంటి దోషం ఉండదని కూడా కమిటీ తెలిపింది. కాగా సంపంగి ప్రాకారంలో జరిగిన ఈ క్రతువుల్లో భాగంగా ముందుగా మంగళవారం రాత్రి వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం కళాపకర్షణ, బింబ వాస్తు, మహాశాంతి తిరుమంజనం, శయనాధివాసం పూజలు నిర్వహించారు. అనంతరం బుధవారం ఉదయం ప్రత్యేక హోమం నిర్వహించి పూర్ణాహుతి, కళావాహన కార్యక్రమాలు నిర్వహించి ఉత్సవ మూర్తిలో ఉన్న చిన్నపాటి భిన్నాన్ని శాస్త్రోక్తంగా సవరించడమైనది. తిరుమల జీయర్ స్వామీజీల సమక్షంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య తిరుమల ప్రధాన అర్చకులు వేణు గోపాల దీక్షితులు, శ్రీ కృష్ణ శేషాచల దీక్షితులు, గోవిందరాజ దీక్షితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి, ఇతర ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా పునర్వసు నక్షత్రం సందర్భంగా బుధవారం సాయంత్రం సహస్ర దీపాలంకార సేవలో శ్రీ సీతా లక్ష్మణ సమేత శ్రీరామచంద్ర మూర్తి భక్తులను అనుగ్రహిస్తారు.

Printed and Published by KANCHARLA RAMAIAH behalf of Nageswara Rao Estates Private Limited, Printed at jagati publication Limited. Sakshi Press, Survey No 86/10, Madhurawada village, MCV Limits, Visakhapatnam - 530041, (AP), Published at D.No50-39-5/A, NORTH EXTENSION LAYOUT, NEAR STATE BANK OF HYDERABAD, SEETAMMADHARA, VISAKHAPATNAM-530013 Editor:KANCHARLA RAMAIAH.Excutive editor V.VIJAYALAKSHMI. RNI NO.10721/65 CELL 9849998069, Email:andhrapatrikadaily@gmail.com